మన సమగ్ర

RNI NO:TGTEL/25/A5443

# ప్రజావాణి

తెలుగు డైలీ

MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

| రాజన్న సిరిసిల్ల | శుక్రవారం | 17.07.2026 | సంపుటి : 01 | సంచిక : 194 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | FRIDAY | 17.07.2026 | Volume : 01 | Issue : 194 | Pages : 12 | Cost : 2/- |



Wanted Reporters

తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న

ప్రజావాణి దిన పత్రిక మరియు మన ప్రజావాణి NEWS TV చానల్

నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా

విలేఖరులు కావలెను

( కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత )

Ph: 9440032006


## పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

ఆరోగ్యం, ఆపరేషన్‌పై గవర్నర్ ఆరా

త్వరగా కోలుకుని మళ్లీ విధుల్లోకి రావాలని ఆకాంక్ష




## 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- బిజినెస్ జాబితాను విడుదల చేసిన సెక్రటరీ జనరల్



**న్యూఢిల్లీ,జూలై 16 :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిజినెస్ లిస్ట్‌ను సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల

మిగతా2లో...



## బోనమెత్తిన గోల్కొండ

- గోల్కొండ కోటలో ప్రారంభమైన ఆషాడ బోనాల ఉత్సవాలు
- అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు
- కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ పూజలు
- వర్షాలు సమృద్ధిగా కురవాలని ఆకాంక్షించిన మంత్రి సురేఖ

**హైదరాబాద్,జూలై 16 :** గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారి బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో అటవీ, పర్యావరణ,

మిగతా2లో...

# సీతారామను పూర్తి చేస్తాం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- లక్షల ఎకరాలకు నీళ్లిచ్చినట్లు బీఆర్ఎస్ నేతల డ్రామాలు : నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ప్రభుత్వంపై బురద జల్లుతున్నారు : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**సత్తుపల్లి, జూలై 16 :** గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది సీతారామ ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటకు వచ్చిన ఆయన నీటిపారుదల శాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి యాతాలకుంట సొరంగ కాలువ మార్గాన్ని (టన్నెల్) పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ జూలూరుపాడు టన్నెల్‌ను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీ-డిజైన్ పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనానికి నష్టం కలిగించారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో

మిగతా2లో...

## వేర్ హౌసింగ్ సామర్థ్యం పెంపు

వచ్చే 20 ఏండ్ల గిడ్డంగుల అవసరాలపై అధ్యయనం చేయండి

వడ్డీ భారాలు తగ్గించుకోవాలి

ప్రభుత్వ కార్పొరేషన్లకు మంత్రి తుమ్మల సూచన




## ఎడ్యుకేషన్ జిహాద్‌పై బిజెపి ఆగ్రహం

- సైదాబాద్ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి
- బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు డిమాండ్

**హైదరాబాద్,జూలై 16 :** 'ఎడ్యుకేషన్ జిహాద్' ఉదంతాన్ని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు మరోసారి స్పష్టం చేశారు. ఘటనపై కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నిష్పాక్షిక మైన, సమగ్రమైన దర్యాప్తు జరపాలన్నారు. పాఠశాల యాజమాన్యంతో పాటు కారకులైన ప్రతి ఒక్కరిపైనా చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అవసరమైతే ఆ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని రాంచందర్ రావు పేర్కొన్నారు. సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనపై బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు



రాంచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో 'ఎడ్యుకేషన్ జిహాద్' తారాస్థాయికి చేరిందంటూ ఆయన మండిపడ్డారు. ఇందుకు

మిగతా2లో...

## రిటైర్డ్ ఇంజనీర్లు సలహాలు ఇస్తే బెదిరింపులా..?

- కరెంట్ లేక అల్లాడుతుంటే పట్టించుకోరా..?
- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ హరీష్ రావు



**హైదరాబాద్,జూలై 16 :** రిటైర్డ్ ఇంజినీర్లు, తెలంగాణ సాగునీటి పారుదల శాఖ మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి గేట్లు ఎత్తొచ్చని చెప్తే.. ఆ నీళ్లు ఎత్తొచ్చని చెప్పిన ఇంజినీర్లను జైళ్లలో పెడతమని, బెల్ట్‌తో కొడ్తమని రాజకీయాలు చేస్తున్నది మీరని సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ సర్కార్‌పై మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఫైర్ అయ్యారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు నీరందంచండి..కరెంట్ ఇవ్వండి.. విద్యుత్ సామర్థ్యం ఉన్నది.. విద్యుత్ ప్లాంట్లు ఉన్నయి. బొగ్గు లేక విద్యుత్ ఉత్పత్తి ఆగిపోయింది. దృష్టి పెట్టండి అని ప్రభుత్వాన్ని ముల్లు కట్టె పెట్టి నిద్రలేపుతున్నాం. మీకు విషయాలు చెబుతున్నమన్నారు. రాజకీయాలు చేయడం మీరు మానండి.. విద్యుత్ ఉత్పత్తి పెంచండి.. రైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వండని ప్రభుత్వానికి హరీశ్ రావు సూచించారు.. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ చేస్తారట. కమీషన్ల కోసం గ్రీన్ ఎనర్జీ పాలసీని నిలిపేశారు. నాణ్యమైన బొగ్గును వెంటనే సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. దేవాదులకు నీళ్లు అందడానికి కారణం

మిగతా2లో...



## యూకెతో ఆర్థిక ఒప్పందంతో అధిక ప్రయోజన్

తెలంగాణకు అనుకూలంగా మలచకుంటాం

యుకెకు ఎగుమతులు పెంచుతాం: మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జూలై 16 :** భారత్- యునైటెడ్ కింగ్ డమ్ ల మధ్య కుదిరిన సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం వల్ల తెలంగాణా గరిష్ఠ ప్రయోజనం పొందేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. బుధవారం నుంచి అమల్లోకి వచ్చిన ఈ ఒప్పందం వల్ల దేశం నుంచి ఎగుమతి అయ్యే 99 శాతం పారిశ్రామిక ఉత్పత్తులపై యుకె సుంకాలను తొలగించిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. యుకె డిప్యూటి ట్రేడ్ కమిషనర్ చంద్రు కె అయర్ ఆధ్వర్యంలో గురువారం నాడు సచివాలయంలో తనను కలిసిన ప్రతినిధి బృందంతో శ్రీధర్ బాబు సమావేశమ య్యారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం భారీగా వృద్ధి చెందుతుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేసారు. రెండు దేశాల మధ్య రూ. 32.56 లక్షల కోట్ల వాణిజ్యానికి అవకాశం ఉందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. తెలంగాణాలో పారిశ్రామిక వస్తూత్పత్తి, లైఫ్ సైన్సెస్, ఏవియేషన్, డిఫెన్స్, ఐటి, సెమి కండక్టర్స్, చిప్ ల డిజైన్, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో పెట్టుబడులకు అత్యంత అనుకూల పరిస్థితులు ఉన్నాయని చెప్పారు.

మిగతా2లో...

## ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

- మంత్రి సీతక్క వెల్లడి



## 20 నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. కేంద్ర ప్రభుత్వం 5 కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచేందుకు చట్ట సవరణ చేయనుంది. గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో కీలక సవరణలు చేపట్టనుంది. విదేశీ విరాళాల నియంత్రణ సవరణ బిల్లుపై ఈ సమావేశాల్లో చర్చించి.. ఆమోదం తెలపనుంది. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'పై తుది నిర్ణయం తీసుకోనుంది. జనన, మరణాల ఆలస్యం రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయనుంది. జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే చట్టానికి మరికొన్ని సవరణలు చేయనుంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆలస్యపు చెల్లింపుల పరిష్కారం కోసం సరికొత్త బిల్లులను ఈ సమావేశాల్లో తీసుకురానుంది. ఓూష్టాలు సొంతంగా ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణ చేయనుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అదనపు నిధుల వ్యయంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించనుంది. ఆగస్ట్ 13వ తేదీతో ఈ వర్షాకాల సమావేశాలు ముగుస్తాయి.

## పవన్ కళ్యాణ్‌కు గవర్నర్ నజీర్ పరామర్శ

**హైదరాబాద్,జూలై 16:** కుడి భుజానికి శస్త్రచికిత్స అనంతరం హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను గవర్నర్ జస్టిస్ ఎస్. అబ్దుల్ నజీర్ మర్యాదపూర్వకంగా పరామర్శించారు. పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లిన గవర్నర్.. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పకుండా పాటించాలని సూచించారు. త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శ అనంతరం గవర్నర్, పవన్ కల్యాణ్ నివాసంలోని లైబ్రరీని కూడా సందర్శించారు. అక్కడ రచయితలు, పరిశోధకులు, విశ్లేషకులు, ప్రజా విధాన రూపకర్తలు రచించిన పలు విలువైన పుస్తకాలను పరిశీలించారు. పుస్తకాలలోని అంశాలు, సమకాలీన సామాజిక, పరిపాలనా, ప్రజా విధానాలపై పవన్ కల్యాణ్‌తో గవర్నర్ ఆసక్తికరంగా చర్చించారు. ఈ సందర్భంగా పవన్ అభ్యర్థన మేరకు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఒక పుస్తకంపై తన ఆటోగ్రాఫ్ కూడా చేశారు. ఈ ఆత్మీయ సమావేశం స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. తన ఆరోగ్యాన్ని తెలుసుకునేందుకు స్వయంగా నివాసానికి వచ్చి పరామర్శించిన గవర్నర్‌కు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గవర్నర్ చూపిన ఆప్యాయత, శుభాకాంక్షలు తనకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరూ కొద్దిసేపు పలు సమకాలీన అంశాలపై కూడా అభిప్రాయాలు పంచుకున్నట్లు సమాచారం.

## రిటైర్డ్ ఇంజనీర్లు సలహాలు ఇస్తే బెదిరింపులా..?

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంలో కోతలు-వాతలు తప్ప ఏమీ లేవన్నారు. రైతులకు కరెంట్ ఇవ్వకపోగా ఇప్పుడు భూములపై ట్యాక్స్ వేస్తారట. రైతులకు నీళ్లు ఇవ్వమంటే రక్తం పారిస్తామంటున్నారు. రెండు పంటలకు బోనస్ ఎగ్గొట్టారు. విద్యుత్ కోసం రైతులు ధర్నాలు చేస్తున్నారు. విద్యుత్ సామర్థ్యం ఉన్నా ఉత్పత్తి చేయలేకపోతున్నారు. 7,180 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉంటే 3100 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. రిజర్వాయర్లలో నీటి నిల్వ సామర్థ్యం 33 శాతం మాత్రమే. ఎల్‌నినో వస్తుందని తెలిసినా ముందస్తు ప్రణాళిక లేదు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా పారిశ్రామిక వేత్తలు, ప్రజలపై భారం పడుతోందన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రాధాన్యం

**ములుగు,జూలై 16 :** ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాల యంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కన్నాయిగూడెం, మంగపేట, ఏటూరునాగారం ఏజెన్సీ మండలాల్లో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ప్రజలకు ఉపయోగపడే పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. అభివృద్ధి పనుల అమలులో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా అధికారులు సమన్వ యంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో అటవీశాఖ అధికారి వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జీ, ఎం. సంపత్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, జిల్లా స్థాయి అధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎడ్యుకేషన్ జిహాద్‌పై బిజెపి ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

పాతబస్తీ సైదాబాద్‌లోని సక్సెస్ స్కూల్ ఘటనే ప్రత్యక్ష నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న హిందూ విద్యార్థికి కల్మా, సూరా అల్-ఫాతిహాలను చదివి రావాలని హోమ్‌వర్క్‌గా ఇవ్వడంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే పూర్తి బాధ్యత వహించాలని రాంచందర్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా 'కాంగ్రెస్ అంటే ముస్లింలు.. ముస్లింలు అంటే కాంగ్రెస్' అని, రేవంత్ చేసిన ఓటు బ్యాంకు, ముస్లిం సంతుష్టీకరణ రాజకీయాల వల్లే ఇలాంటి తీవ్రవాద ఆలోచనలు ఉన్న శక్తులకు తెగింపు పెరిగిందని రాంచందర్ రావు మండిపడ్డారు. తమ బిడ్డ చేత బలవంతంగా కల్మా రాయించడాన్ని గమనించి, పాఠశాల యాజమాన్యాన్ని ధైర్యంగా నిలదీసిన ఆ చిన్నారి తల్లి సాహసాన్ని తాను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానని రాంచందర్ రావు పేర్కొన్నారు. ఇంతటి తీవ్రమైన ఉదంతం వెలుగులోకి వచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ సదరు పాఠశాల యాజమాన్యంపై ఇప్పటివరకు ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేవలం ఒక ముస్లిం టీచర్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తే సరిపోదని, ఈ ఘటనకు పూర్తి బాధ్యత స్కూల్ మేనేజ్‌మెంట్‌దేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ పాలనలో హిందువుల పరిస్థితి ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి ఈ ఘటనే ఉదాహరణ అని రాంచందర్ రావు పేర్కొన్నారు. హిందూ విద్యార్థులు, వారి కుటుంబాల భద్రత, ఆత్మగౌరవం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా కళ్లు మూసుకుని వ్యవహరిస్తోందని మండిపడ్డారు. హిందూ విద్యార్థులపై వారి మతానికి సంబంధం లేని ప్రార్థనలు, కల్మాలు బలవంతంగా రుద్దడం ఏమాత్రం సహించబోమన్నారు. కొన్ని కాన్వెంట్ స్కూళ్లలో హిందూ విద్యార్థులు బొట్టు పెట్టుకుని రాకూడదని ఒత్తిడి చేస్తూ మతాచారాలకు దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. విద్యా సంస్థలు విద్యను అందించాలే తప్ప, విద్యార్థులపై ఏ మతాన్నీ రుద్దే హక్కు ఎవరికీ లేదన్నారు. ప్రతి విద్యార్థి రాజ్యాంగ హక్కులను గౌరవించాల్సిన బాధ్యత అన్ని పాఠశాలలపై ఉందన్నారు.

## సీతారామను పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులను రూపొందించారని, వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పనులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామనీ, అవసరమైన బిల్లులను సిద్ధం చేసి వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్టు తెలిపారు. **లక్షలాది ఎకరాలకు సాగునీరందించినట్టు ప్రచారం : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి** లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించినట్టు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీల గోదావరి జలాల అనుమతులు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. గత ప్రభుత్వం సాయిల్ టెస్ట్‌లు నిర్వహిం చకుండా నిర్మాణాలు చేపట్టడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ సమస్యలు తలెత్తాయన్నారు. మిగిలిన బ్యారేజీల భద్రతపై కూడా నిపుణుల సూచనలు ఉన్నాయనీ, ప్రస్తుతం మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబం ధించిన భూసేకరణలో ప్రభుత్వం నిర్ణయించిన విధానం ప్రకారం వేగంగా పరిహారం చెల్లింపులు చేస్తామని, అధికారులు ఈ అంశాన్ని ప్రాధాన్యం గా తీసుకోవాలని సూచించారు. **కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు : మంత్రి పొంగులేటి** కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రారంభించిన అన్ని నీటిపారుదల పనులను నిజాయితీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్, వైరా--లంకసాగర్ ప్రాజెక్టులు, ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా సాధ్యమైనంత మేరకు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మొహమ్మద్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మెన్లు దోమ ఆనంద్ బాబు, బాగం నీరజదేవి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సీఈలు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బీఎస్ఈ యుగంధర్ రావు పాల్గొన్నారు.

## బోనమెత్తిన గోల్కొండ

(మొదటి పేజీ తరువాయి)

దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్ఛారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్స వాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాంస్కృతిక కళాకారుల కోరిక మేరకు మంత్రి సురేఖ ఈరగోల చేతిలో ధరించి, వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాఢ బోనాల ఉత్సవాల బుక్ లెట్ ను మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో కలిసి మంత్రి సురేఖ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ. 11 లక్షల చెక్కును ఇరువురు మంత్రులు కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, గోల్కొండ జగదాంబిక ఆలయ కమిటీ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలతో హైదరాబాద్ లో పండుగ వాతావరణం నెలకొన్నదని అన్నారు. గోల్కొండ జగదాంబిక అమ్మవారి బోనాల సమర్పణతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని, తెలంగాణ అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని మంత్రి సురేఖ ఆకాంక్షించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ ఎజెండాగా ప్రభుత్వం పనిచేస్తున్నదని తెలిపారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న దేవాలయాలకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

## వేర్ హౌసింగ్ సామర్థ్యం పెంపు

**హైదరాబాద్,జూలై 16:** రాష్ట్రంలో రైతులకు గోదాముల సౌకర్యాన్ని మరింత విస్తరించేం దుకు తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా రెండేండ్లలో ప్రస్తుతమున్న సామర్థ్యానికి అదనంగా మరో ఐదు లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని అందుబాటులోకి తీసుకొస్తామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్లు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలంటే వడ్డీ భారాన్ని తగ్గించుకుంటూ ఆదాయ వనరులను పెంచుకోవాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్, హాకా కార్పొరేషన్ల మేనేజింగ్ డైరెక్టర్లతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ఆధీనంలో 52 సొంత గోదాములుండగా వాటి నిల్వ సామర్థ్యం సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నులని తెలిపారు. ప్రస్తుతం ఈ గోదాముల్లో 104 శాతానికి పైగా ఆక్యుపెన్సీ నమోదై 6.33 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తులు నిల్వ ఉన్నాయని వివరించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీలు, పీఈజీ, ఇన్వెస్టర్ గోదాములు, అద్దె గోదాములతో కలిపి మొత్తం 524 గోదాములను ప్రస్తుతం వినియోగిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం 48 కొత్త గోదాముల నిర్మాణం వివిధ దశల్లో కొనసాగుతోందన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరో 32 గోదాముల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామనీ, వీటి ద్వారా మరో 3.25 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. మొత్తంగా రాష్ట్రంలో సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యాన్ని కల్పించేలా ప్రణాళిక రూపొందించామని వెల్లడించారు. ప్రతి కొత్త గోదాంపైనా సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అన్ని సంస్థల పరిధిలోని గోదాముల న్నింటినీ ఒకే సమన్వయ వ్యవస్థ కింద నిర్వహించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

### యూకెతో ఆర్థిక ఒప్పందంతో

## అధిక ప్రయోజన్

(మొదటి పేజీ తరువాయి)

అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలను వృద్ధి చేసామని, యుకె పారిశ్రామికవేత్తలు వీటిని వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రం నుంచి యుకెకు ప్రస్తుతం రూ.3,553 కోట్ల విలువైన ఎగుమతులు మాత్రమే జరుగుతున్నాయని తెలిపారు. కొత్త ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాల వల్ల ఎగుమతులను భారీగా పెంచుకునే అవకాశం ఏర్పడిందని వివరించారు. దేశంలోని ఫార్మా ఉత్పత్తుల్లో 40 శాతం తెలంగాణాలోనే జరుగుతున్నాయని, వ్యాక్సిన్ ఎగుమతుల్లో 30 శాతం రాష్ట్రానిదేనని శ్రీధర్ బాబు తెలిపారు. విమానయాన రంగానికి అవసరమైన ప్రిసిషన్ విడిభాగాల ఉత్పత్తిలో తెలంగాణా అగ్రస్థానంలో ఉందని గుర్తు చేసారు. ప్రపంచ ప్రఖ్యాత ఏవియేషన్ సంస్థలు ఎయిర్ బస్, బోయింగ్, రోల్స్ రాయిస్, విమాన ఇంజన్ల తయారీ సంస్థ ప్రాట్ అండ్ విట్నీస్, డసో ఏవియేషన్ ఉత్పత్తి చేసే రఫేల్ విమానాల విడిభాగాల తయారీ, ఓవర్ హాలింగ్ సదుపాయాలు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, సఫ్రాన్ ఏవియేషన్ సంస్థలు పరిశ్రమలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేసారు. హైదరాబాద్ లో ఫార్చ్యూన్ 500 కంపెనీలతో సహా పలు ప్రఖ్యాత సంస్థలు 350 జిసిసి కేంద్రాలను ఏర్పాటు చేసాయని చెప్పారు. యుకెకు ఎగుమతి చేయగలిగే వస్తువుల తయారీపై స్థానిక పారిశ్రామిక వేత్తలతో సమావేశం ఏర్పాటు చేసి సిఇటిఏ ఒప్పందం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఇండస్ట్రీస్ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆధిత్యకు శ్రీధర్ బాబు సూచించారు. యుకె నుంచి భారత్ పర్యటించే మేయర్ల బృందాన్ని హైదరాబాద్ ను కూడా సందర్శించేలా చూడాలని చంద్రు కె అయర్ ను మంత్రి కోరారు. అధికారులతో కలిసి యుకెను సందర్శించి అక్కడ పారిశ్రామిక, వాణిజ్య ఎకోసిస్టంను పరిశీలించాలని చంద్రు అయర్ శ్రీధర్ బాబును ఆహ్వానించారు. యుకె ప్రతినిధి బృందంలో సిద్దార్థ్ విశ్వనాథన్, నళిని రఘురామన్, ప్రవీణ్ పద్మనాభన్, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ కృష్ణ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో ఆషాఢ బోనాల సందడి

- ప్రజలకు సిఎం రేవంత్ శుభాకాంక్షలు



**హైదరాబాద్,జూలై 16 :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి, ఆధ్యాత్మిక విశ్వాసానికి అద్దం పట్టే ఈ వేడుకల ప్రారంభం సందర్భంగా నగర ప్రజలకు, భక్తులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బోనాల పండుగ సామాజిక ఐక్యతకు ప్రతీక అని కొనియాడిన ఆయన.. భక్తుల నమ్మకాలకు, సంప్రదాయాలకు భంగం కలగకుండా ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.20 కోట్ల నిధులను కేటాయించిందని గుర్తుచేశారు. ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో ఈ ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందాలని 'ఎక్స్' వేదికగా ఆకాంక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. త్సవాల నిర్వహణలో భాగంగా దేవాలయాల పరిసరాల్లో పారిశుద్ధ్యం, నిరంతర తాగునీటి సరఫరా, నిరంతరాయ విద్యుత్, వైద్య సేవలతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, కట్టుదిట్టమైన భద్రత, అగ్నిమాపక సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని వేలాది ఆలయాల్లో భక్తుల రద్దీని తట్టుకునేందుకు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ అధికారిక పర్యవేక్షణలో నేటి నుంచి ప్రారంభం కానున్న ఈ బోనాల జాతరను విజయవంతం చేసేందుకు సర్వం సిద్ధమైంది.

## కోతుల దాడిలో మహిళలకు గాయాలు.



**కమాన్ పూర్, మన సమగ్ర ప్రజావాణి జూలై 16.**కోతుల దాడిలో కమాన్ పూర్ మండలం గుండారం గ్రామానికి చెందిన కొలిపాక అనూష గాయపడింది.గురువారం రోజున తమ పశువుల వద్దకు వెళుతున్న సమయంలో ఒకేసారి రెండు మూడు కోతులు వెంటబడి తరిమి కొరకడంతో ఆమె గాయాల పాలయ్యింది.గాయపడ్డ కొలిపాక అనూష కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకుంది.ఆమెకు సిబ్బంది ఇంజక్షన్లు వేయడం జరిగింది.కాగా కమాన్ పూర్ మండలం లోని పేరపల్లి,రొంపి కుంట, గుండారం,రాజాపూర్ తదితర గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉంది. ఒకేసారి వందల సంఖ్యలో కోతులు గ్రామంలో తిరుగుతూ ఇండ్లలో చొరబడి ఇంట్లో ఇండ్లలోని వస్తువులు చిందర వందల చేస్తున్నాయి.ఆయా గ్రామాల్లోని ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకొని కోతుల బెడద తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.

## అక్రమ ఇసుక రవాణాపై బెజ్జంకి పోలీసుల ఉక్కుపాదం

- గాగ్గిల్లాపూర్ స్టేజ్ వద్ద ట్రాక్టర్, ట్రైలర్ స్వాధీనం



**బెజ్జంకి,జూలై 16(ప్రజావాణి**సిద్దిపేట జిల్లా బెజ్జంకి పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు.ఈ క్రమంలో గురువారం బెజ్జంకి మండల పరిధిలోని గాగ్గిల్లా పూర్ స్టేజ్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో టిఎస్ 22 టి 4364 నంబర్ గల ట్రాక్టర్,టి ఎస్ 22 టి 7178 నంబర్ గల ట్రైలర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల విచారణలో తోటపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ గొల్ల రాజ్‌కుమార్ (29), వాహన యజమాని ఉల్లి నరేష్ (40) ఆదేశాల మేరకు తోటపల్లి గ్రామ శివారులోని మొయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను లోడ్ చేసి రవాణా చేస్తున్నట్లు నిర్ధారణ అయింది.దీంతో ట్రాక్టర్, ట్రైలర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్, వాహన యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ సందర్భంగా బెజ్జంకి ఎస్సై తోట తిరుపతి మాట్లాడుతూ,ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వడం,నిల్వ చేయడం లేదా రవాణా చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు.అక్రమ ఇసుక తవ్వకాలు,రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇటువంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం తెలిసిన వెంటనే బెజ్జంకి పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించి ప్రజలు పోలీసులకు సహకరించాలని వారి యొక్క వివరాలు గొప్యంగా ఉంచుతామని తెలిపారు.

## దమ్మపేట మండలంలో జగ్గారం గ్రామంలో కల్వర్ట్ నిర్మానానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జారె



**దమ్మపేట,ప్రజావాణి న్యూస్, జూలై16:** దమ్మపేట మండలం లో జగ్గారం గ్రామపంచాయతీ లో అశ్వారావుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా జగ్గారం పరిధిలోని గల ప్రధాన రహదారి వద్ద రూ.25. లక్షల వ్యయంతో నిర్మించబోయే కల్వర్ట్ నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం పట్వారిగూడెం గ్రామంలో అనారోగ్యంతో మరణించిన చెలికాని రంగారావు దశదిన కార్యక్రమంలో పాల్గొనివారి చిత్రపటానికి పూలమాలలు వేసి,వారి కుటంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ జిల్లా,మండల నాయకులు,ప్రజాప్రతినిధులు అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నుకలిసి దళిత బంధు పథకం మంజూరు చేయాలని

- హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీఇంచార్జి వోడితేల ప్రణవ్
- మండల అధ్యక్షుడు వీరమనేని పరశురామ్ రావు



**జమ్మికుంట జులై 16 (ప్రజావాణి)** తెలంగాణ రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కార్యాలయంలో కలిసిన ప్రణవ్ మా హుజురాబాద్ నియోజక వర్గ దళిత సోదరుల పెండింగ్ లో ఉన్న దళిత బంధు పథకం మంజూరి దాని తాలూకు వివరాలు మంత్రి తో చర్చించగా మంత్రి సానుకూలంగా స్పందించి నిధుల మంజూరు కొరకు సంబంధిత అధికారులతో సమీక్ష చేసి త్వరలోనే లబ్ధి దారులకు అందేలా చూస్తానని హామీవ్వడం జరిగింది ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జమ్మికుంట మండల అధ్యక్షుడు వీరమనేని పరశురామ్ రావు తదితరులు పాల్గొన్నారు.


## వేములవాడలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య.. కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు



**ప్రజావాణి వేములవాడ టౌన్ 16 జులై 2026**వేములవాడలో విషాదం చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ బాలసాని అజయ్ (24) బుధవారం తన ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో అజయ్ ఆత్మహత్య తీసుకోగా, గమనించిన కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మృతుడికి కేవలం 15 రోజుల క్రితమే కుమారుడు జన్మించాడని, పసికందును వదిలి అజయ్ అనంతలోకాలకు వెళ్ళిపోయాడంటూ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. అయితే అజయ్ ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.సమాచారం అందుకున్న వేములవాడ పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వేములవాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అజయ్ మృతి విషయం తెలుసుకున్న స్థానిక ఆటో కార్మికులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఒక యువ ఆటో డ్రైవర్ ఇలా అర్ధాంతరంగా తనువు చాలించడంతో పట్టణంలోని ఆటో కార్మికుల్లో తీవ్ర విషాదం నెలకొంది.

# టీజేఏ పేరుతో ఫేక్ సభ్యత్వాలు

- వివాదాస్పద జర్నలిస్టు ఇతర సంఘాలతో చేతులు కలిపి, సంఘాన్ని నిర్వీరామం చేయాలని చూస్తున్న ఓ వ్యక్తి
- ఒక సంఘంలో పని చేస్తున్న కేటుగాడు , ఈ వ్యక్తి ని కీలుబొమ్మగా వాడుకుంటున్న వైనం
- క్రిమినల్ కేసులు ఉన్న, సంఘంలోనే పనిచేస్తూ ఇసుక దందాలు పాల్పడుతూ పలు కేసుల్లో విచారణ నిందితుడు
- సంఘానికే చెడ్డ పేరు తెచ్చే పనిలో ఈ వ్యక్తి చంచలతనం
- ఆది నాయకత్వం ఇతనిపై విచారణ చేయాల్సిందే అంటున్న స్థానిక జర్నలిస్టులు




**మహబూబాబాద్ జూలై 16 (ప్రజావాణి)**మహబూబాబాద్ జిల్లాలో ఇప్పుడిప్పుడే టీజే ఏ సంఘం బలోపేతం దిశగా ఉంటున్న సందర్భంలో, ఈ సంఘంలో పనిచేస్తున్నానని మాయ మాటలు చెబుతూ, జిల్లాలో ఉన్న నాయకత్వంతో అందుబాటులో లేకుండా, అధర్ జర్నలిస్టు సంఘాల, కీలుబొమ్మగా మారి, టీజేఏ సంఘంలో ఫేక్, సభ్యత్వాలు చేయించుకుంటూ, అదర్ సంఘాల, నాయకుల కనుసన్నల్లో, పనిచేస్తూ టీజేఏ నాయకత్వాన్ని దెబ్బతీయాలని చూస్తున్న ఈ వ్యక్తి అరాచకాలు రోజురోజుకు విషం ఇస్తున్నాయి. ఇతడు పలు కేసుల్లో నేరస్థునిగా ఉంటూనే జర్నలిస్టు ముసుగులో ఇసుక దందాలు చేస్తూ, టిజేఏ సంఘానికి తానే కీలకమని, ప్రగల్బాలు పలుకుతూ, పలు సంఘాల నాయకత్వంతో సంప్రదింపులు జరుపుతూ ఆ సంఘంలో ఉన్న వారిని ఈ సంఘంలోకి తీసుకు ఉన్నట్లు, తప్పుడు సమాచారాన్ని స్టేట్ కమిటీకి అందిస్తూ, టీజేఏ సంఘాన్ని అభాసుపాలు చేయాలని, కంకణం కట్టుకున్న ఈ మూర్ఖునిపై, టీజేఏ నాయకత్వం, పోలీస్ ఇంటలిజెన్స్ వ్యవస్థ కూడా ఇతనిపై ఒక కన్ను వేయాల్సిందే? తను గత కొంతకాలంగా తన సొంత మండలంలో అక్రమ ఇసుక దందా చేసి, పోలీసుల చేతుల్లో పెడదెబ్బలు తిని కాళ్లు చేతులు విరగొట్టుకున్న ఈ వ్యక్తి, సంఘాన్ని అడ్డుపెట్టుకొని, తన అరాచకాలు కొనసాగించాలని, అరాచకం మూకలతో, చెయ్యి కలిపి సంఘాన్ని సంఘ నాయకత్వాన్ని, దెబ్బతీయాలని చూస్తున్న ఈ వ్యక్తి, పొద్దుటి పూట, టీజేఏ సాయంత్రం పూట అదర్ సంఘాల చెంచాగిరి, గా పని చేస్తూ సంఘం యొక్క విలువలను దిగజార్చుతున్నాడని వినికిడి ఇతని యొక్క అరాచకాలకు, ఫేక్ జర్నలిజానికి, ఫేక్ సభ్యతలకు చెక్కు పెట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని స్థానిక జర్నలిస్టులు చర్చించుకుంటున్నారు. గత కొద్ది రోజులగా అక్రిడేషన్ కమిటీలో డీజేఏ ఉన్న వేరే సంఘంలో, పనిచేయాలని నిశ్చయించుకొని,అక్కడ ఆదరణ దొరకకపోవడం తో తిరిగి టీజే ఏ పేరుతో మేక వన్నె పులిలాగా తిరుగుతున్న, ఈ వ్యక్తిపై రాష్ట్ర కమిటీ చర్య తీసుకోవాల్సిందే ?కావున రాష్ట్ర నాయకత్వం ఈ అంశంపై ఆరా తీసి, ఫేక్ సభ్యతాలపై విచారణ చేపట్టి, ఈ నేర చరిత్ర ఉన్న వ్యక్తిని సంఘం నుంచి బహిష్కరించాలని స్థానిక జర్నలిస్టులు కోరుతున్నారు.

## మంత్రి సహకారంతో కమాన్ పూర్ ను అభివృద్ధి చేస్తా.



**కమాన్ పూర్, మన సమగ్ర ప్రజావాణి జూలై 16.**రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి సహాయ సహకారాలతో కమాన్ పూర్ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ అన్నారు.కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల సుభాష్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు.ఈజీఎస్ నిధులతో అభివృద్ధి పనులు సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ గురువారం ప్రారంభించారు.కమాన్‌పూర్ లో ఈజీఎస్ ఉపాధి హామీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ గురువారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో ఈ అభివృద్ధి పనులు చేపట్టడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తూ దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు.సుభాష్‌నగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం ప్రజలకు మెరుగైన రాకపోకల సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్,సోహెల్, వార్డు సభ్యులు గుంజపడుగు నవీన్, కమ్మగోని మౌనిక, మల్లారపు మానస,అరుణ్ కుమార్,మేడగోని సత్యమ్మ శ్రీనివాస్,బోగే లక్ష్మిరమేష్, మెరుగు కుమార్,గోడిశెల లింగస్వామి,నాయకులు నగునూరి నర్సయ్య,రంగు శ్రీనివాస్, బొజ్జ రాజసాగర్, బొజ్జ చారి,గర్రెపెల్లి వెంకన్న, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రక్షణ సేన పెద్దపల్లి ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమరయ్య నియామకం




**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి జులై 16**23 నియోజకవర్గాల్లో 12 బీసీలకు అవకాశం కల్పించడం చారిత్రాత్మకం: పార్టీ నాయకులు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న పార్టీలు బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే ఉపయోగించుకున్నాయని, వారికి తగిన రాజకీయ ప్రాధాన్యం కల్పించడంలో విఫలమయ్యాయని తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు బొంగోని శంకర్ గౌడ్, ఉస్తెం శ్రీనివాస్ ముదిరాజ్ విమర్శించారు.గురువారం పెద్దపల్లి ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించిన 23 నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌ల జాబితాలో 12 స్థానాలను బీసీలకు కేటాయించడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. అలాగే పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉద్యమకారుడు, బీసీ నాయకుడు సలేంద్ర కొమరయ్యను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.2001 నుంచి తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న కొమరయ్యకు ఈ నియామకం ద్వారా సముచిత గుర్తింపు లభించిందని, ఇది బీసీ సమాజానికి గర్వకారణమని తెలిపారు. పార్టీ అధినేత్రి కవిత తీసుకున్న ఈ నిర్ణయం అణగారిన వర్గాలకు రాజకీయ భరోసా కల్పిస్తుందని అన్నారు.పార్టీ ఆవిర్భావం నుంచి కులమతాలకు అతీతంగా బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని, అదే దిశగా పార్టీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు.ఈ సందర్భంగా సింగరేణి డిపెండెంట్ ఉద్యోగాల అంశాన్ని ప్రస్తావిస్తూ, గత మూడున్నరేళ్లుగా నిలిచిపోయిన ఉద్యోగాల భర్తీ కోసం ఈ నెల 20న కవిత నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించగానే ప్రభుత్వం స్పందించి జూలై 17, 18 తేదీల్లో మెడికల్ బోర్డు నిర్వహించాలని నిర్ణయించడం పార్టీ సాధించిన తొలి విజయమని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కవిత మార్గదర్శకత్వంలో బీసీలను ఏకం చేసి, పెద్దపల్లి జిల్లాలో తెలంగాణ రక్షణ సేనను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ రక్షణ సేన జిల్లా నాయకులు కల్వల తిరుపతి, చిలుక ఆనంద్, మల్యాల కరుణాకర్, గుర్రం శ్రీనివాస్, ఓదెల మండల నాయకులు నల్లగొండ స్వామి గౌడ్, సుల్తానాబాద్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# శ్రీ కట్ట మైసమ్మ తల్లికి తొలి బోనం సమర్పించిన

- గండు రంగన్న--విజయ దంపతులు





**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, జూలై 16:**పెద్దపల్లి పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ సమీపంలో వెలసిన శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఆలయంలో ఆషాఢమాస వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా గండు రంగన్న--విజయ దంపతులు అమ్మవారికి తొలి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం నుంచే ఆలయంలో వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు కొండపాక శ్రీనివాసాచార్యులు, ఆలయ కమిటీ సభ్యుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, మూడు సంవత్సరాల క్రితం ప్రతిష్ఠించిన శ్రీ కట్ట మైసమ్మ తల్లి ఆలయం భక్తులకు కొంగుబంగారంగా మారిందన్నారు. అమ్మవారిని విశ్వాసంతో ప్రార్థించిన ప్రతి భక్తుడి కోరికలు నెరవేరుతున్నాయని తెలిపారు.భక్తుల సౌకర్యార్థం రేకుల షెడ్, తాగునీటి వసతి, ఆహ్లాదకరమైన వాతావరణం వంటి సౌకర్యాలను ఆలయ కమిటీ అందుబాటులోకి తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఆషాఢ మాసం సందర్భంగా లోకకల్యాణం, పెద్దపల్లి ప్రజల సుఖశాంతి, సుభిక్షం కోసం తొలి బోనం సమర్పించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయంలో బోనం సమర్పించడం విశిష్టమైన ఆచారమని, ఈ మాసంలో అమ్మవారికి బోనం సమర్పిస్తే కుటుంబంలో అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల విశ్వాసమని చెప్పారు.అమ్మవారి దర్శనానికి కుల, మత భేదాలు లేవని, పెద్దపల్లితో పాటు పరిసర గ్రామాల ప్రజలందరూ ఆలయానికి వచ్చి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. అమ్మవారి అనుగ్రహంతో కుటుంబ సమస్యలు తొలగి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలుగుతాయని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బొడ్డుపల్లి శ్రీనివాస్, భూతగడ్డ సంపత్, కౌన్సిలర్ దొడ్డుపల్లి జగదీశ్, సురేష్ గౌడ్, పోతని పురుషోత్తం, భాస్కర్ యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి రామ్మూర్తితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు.

## వల్భాపూర్‌లో ఉచిత ఆరోగ్య శిబిరానికి విశేష స్పందన.



**ఎల్కతుర్తి,ప్రజావాణి న్యూస్:-**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని వల్భాపూర్ గ్రామంలో ఎల్కతుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో గురువారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.ఈ ఆరోగ్య శిబిరానికి గ్రామప్రజల నుంచి విశేష స్పందన లభించింది.ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మేడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, జ్వరం,దగ్గు,జలుబు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా ఎల్కతుర్తి పీహెచ్‌సీని లేదా ఆశా కార్యకర్తలను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు.గ్రామంలో పారిశుద్ధ్యాన్ని పాటించడం,స్వచ్ఛమైన తాగునీటిని వినియోగించడం,దోమల నివారణ చర్యలు చేపట్టడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని డాక్టర్ రాజశేఖర్,మేడికల్ ఆఫీసర్ డాక్టర్ సౌమ్య తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,శ్వేత ఉపసర్పంచ్ అనిల్,వార్డు సభ్యులు,ఎఎన్ఎం మమత,ఆశా కార్యకర్తలు,గ్రామ పెద్దలు,గ్రామస్తులు పాల్గొన్నారు.ఆరోగ్య శిబిరాన్ని విజయవంతం చేసిన వైద్య సిబ్బందిని గ్రామ ప్రజలు అభినందించారు.

శుక్రవారం ,
జూలై 17, 2026
మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ



# అమీన్‌పూర్‌లో విద్యార్థుల వెల్లువ... ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కొరత

- పెరుగుతున్న విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా తరగతి గదులు, ఉపాధ్యాయులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి

**అమీన్‌పూర్, జూలై 16 (ప్రజావాణి):** తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో అమీన్‌పూర్ ఒకటి. ఇటీవలి సంవత్సరాల్లో జనాభా గణనీయంగా పెరగడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు కూడా భారీగా పెరిగాయి. అయితే ఆ మేరకు ప్రభుత్వ విద్యా వ్యవస్థ విస్తరించకపోవడంతో పాఠశాలలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని తల్లిదండ్రులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు పెరుగుతున్నప్పటికీ, తరగతి గదులు, ఉపాధ్యాయులు, ఫర్నిచర్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు తగిన స్థాయిలో లేకపోవడం విద్యార్థుల చదువుపై ప్రభావం చూపుతోందని వారు చెబుతున్నారు.

40 మందికి నిర్మించిన గదుల్లో 80 మందికి పైగా విద్యార్థులు

సాధారణంగా 40 మంది విద్యార్థులకు సరిపోయే తరగతి గదుల్లో ప్రస్తుతం 80 నుంచి 85 మంది వరకు చదువుకుంటున్న పరిస్థితి ఉందని స్థానికులు తెలిపారు. బెంచీలు, డెస్కులు సరిపోక విద్యార్థులు ఇరుకుగా కూర్చోవాల్సి వస్తోందని, దీంతో బోధన నాణ్యతపై కూడా ప్రభావం పడుతోందని పేర్కొంటున్నారు.

ఉపాధ్యాయుల కొరతతో ఇబ్బందులు

పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినా, ఆ మేరకు ఉపాధ్యాయుల నియామకాలు జరగలేదని స్థానికులు చెబుతున్నారు. నరేగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు సుమారు 95 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులే బోధన అందిస్తున్నట్లు



సమాచారం. ఒకే ఉపాధ్యాయుడు ఒకేసారి రెండు, మూడు తరగతులకు పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి నెలకొంది.

తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్ల కొరత

ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ఫర్నిచర్ వంటి కనీస వసతులు కూడా తగినంతగా లేవని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

అదనపు తరగతి గదులు అవసరం

అమీన్‌పూర్ పరిధిలో వేగంగా కొత్త కాలనీలు, అపార్ట్‌మెంట్లు ఏర్పడుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలలపై భారం మరింత పెరుగుతోందని స్థానికులు చెబుతున్నారు. జనాభా పెరుగుదలకు అనుగుణంగా కొత్త ప్రభుత్వ పాఠశాలలు, అదనపు తరగతి గదులు నిర్మించడం, ఖాళీ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం అత్యవసరమని అభిప్రాయపడుతున్నారు.

ప్రజల డిమాండ్లు




విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అదనపు తరగతి గదులు నిర్మించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, ఫర్నిచర్, విద్యా సామగ్రి వంటి మౌలిక వసతులు కల్పించాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక విద్యా అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి. అవసరమైతే కొత్త ప్రభుత్వ పాఠశాలలు, హైస్కూల్‌లు, జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ విద్యపై విశ్వాసంతో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్న తల్లిదండ్రులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని స్థానికులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు సమస్యలను పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దేవాదుల కాల్వ ద్వారా తక్షణమే సాగునీరు విడుదల చేయాలని విజ్ఞప్తి.

- జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేత.



**ఎల్కతుర్తి ప్రజావాణి న్యూస్:-** హనుమకొండ జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ గారి ఆదేశాల మేరకు, ఎల్కతుర్తి,భీమదేవరపల్లి మండలాల రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ధర్మసాగర్ నార్త్ దేవాదుల కాల్వ ద్వారా తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కలెక్టర్ సమస్యపై సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులతో వెంటనే మాట్లాడి రైతులకు అవసరమైన సాగునీటిని విడుదల చేసే దిశగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎల్కతుర్తి,భీమదేవరపల్లి మండలాల్లో పంటలు సాగు చేస్తున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అత్యవసరంగా సాగునీటిని విడుదల చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్,బొమ్మనపల్లి అశోక్ రెడ్డి,సింగిల్ విండో మాజీ అధ్యక్షులు గోలి రాజేశ్వర్ రావు,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబాల శ్రీకాంత్ (బక్కి),ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాల రైతులు పాల్గొన్నారు.

# నాగేపల్లిలో విజయవంతంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం

- 70 మందికి కంటి పరీక్షలు.. 30 మందికి ఉచిత శస్త్రచికిత్సకు ఎంపిక




**మంథని నియోజక వర్గం ప్రతినిధి, జూలై 16, ప్రజావాణి:** రామగిరి మండలం నాగేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ, కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో, గొల్లపల్లి రాయమల్లు తన కీర్తిశేషులైన సతీమణి రమాదేవి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతంగా జరిగింది. శిబిరాన్ని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 70 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 30 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఎంపిక చేశారు. రోగులకు ఉచిత రవాణా, భోజనం, మందులు, లెన్స్‌లు తదితర వైద్య సేవలు కూడా అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు డా. శరణ్య యాదవ్ మాట్లాడుతూ, ప్రియమైన వారి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప నివాళి అని పేర్కొన్నారు. ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కమిటీ చైర్మన్ మేకల మారుతి యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు ఎల్లా రామ్మూర్తి, మాజీ ఎంపీపీ ఆరెల్లి కొమురయ్య, సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ యాదవ్, మాజీ సర్పంచ్ ఎరుకల ఓదెలు, ఉపసర్పంచ్ యసం సతీష్, కాంగ్రెస్ నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులు, వైద్య బృందానికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# జమ్మికుంట పట్టణంలో గోశాల ఏర్పాటు చేయాలని మున్సిపల్ చైర్మన్ కు వినతి పత్రం

- పాలకవర్గానికి పట్టణ ప్రజల తరఫున విజ్ఞప్తి
- పట్టణ మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పూదరి రేణుక శివకుమార్ గౌడ్

**జమ్మికుంట జూలై 16 (ప్రజావాణి)** జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ కి మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు పట్టణ ప్రజల తరఫున హృదయపూర్వక విజ్ఞప్తి చేయడం జరిగింది జమ్మికుంట పట్టణ అభివృద్ధి కోసం మున్సిపల్ పాలకవర్గం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అభినందిస్తూ అత్యంత ముఖ్యమైన ప్రజా సామాజిక అంశమైన గోమాతల సంరక్షణ కోసం శాశ్వత గోశాల ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని వారి దృష్టికి తీసుకువెళ్లాము ప్రస్తుతం జమ్మికుంట పట్టణంలో అనేక గోవులు రోడ్లపై వీధుల్లో సంచరిస్తూ ప్లాస్టిక్ కవర్లు విషపూరిత వ్యర్థాలు మిగిలిపోయిన



ఆహార పదార్థాలను తిని అనారోగ్యానికి గురవుతున్నాయి అంతేకాకుండా రహదారులపై తిరుగుతున్న గోవుల కారణంగా తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడటమే కాకుండా ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా పెరుగుతున్నాయి ఇది ప్రజల భద్రతతో పాటు మూగజీవాల సంక్షేమానికి సంబంధించిన అత్యంత కీలకమైన అంశంఅందువల్ల జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ పాలకవర్గ సభ్యులు ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి గోశాల ఏర్పాటు కోసం తగిన స్థలాన్ని గుర్తించి మంజూరు చేయడంతో పాటు అవసరమైన చర్యలు వెంటనే ప్రారంభించాలని పట్టణ ప్రజల తరఫున వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నాముగోమాతల సంరక్షణ అనేది కేవలం ఒక సామాజిక బాధ్యత మాత్రమే కాదు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక కూడా ఈ గొప్ప కార్యక్రమాన్ని మున్సిపల్ పాలకవర్గం చేపట్టి జమ్మికుంట పట్టణానికి ఆదర్శంగా నిలవాలని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారుజమ్మికుంట పట్టణ ప్రజల తరఫున గోశాల ఏర్పాటు కోసం వినమ్ర విజ్ఞప్తి

# నాగేపల్లిలో విజయవంతంగా ఉచిత నేత్ర వైద్య శిబిరం

- ప్రియమైన వారి జ్ఞాపకార్థం సేవ చేయడం వారికి ఇచ్చే గొప్ప నివాళి.
- డా.శరణ్య యాదవ్.

**రామగిరి,మన సమగ్ర ప్రజావాణి జులై 16** రామగిరి మండలంలోని నాగేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ, కరీంనగర్ రేకుర్తి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో,గొల్లపల్లి రాయమల్లు తన సతీమణి గొల్లపల్లి రమాదేవి జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించడం జరిగింది. ఈ శిబిరానికి మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్ హాజరై రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి సంబంధిత అన్ని వ్యాధులకు ఉచిత నేత్ర పరీక్షలు నిర్వహించడంతో పాటు,శస్త్రచికిత్స అవసరమైన రోగులను గుర్తించి కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రిలో పూర్తిగా ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే రోగులకు ఉచిత రవాణా,భోజనం, మందులు,లెన్స్‌లు మరియు అవసరమైన అన్ని వైద్య సేవలను కూడా ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ అధ్యక్షురాలు డా.శరణ్య యాదవ్,రేకుర్తి కంటి ఆసుపత్రి టెక్నీషియన్ ప్రభాకర్ ఆధ్వర్యంలో మొత్తం 70 మందికి ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 30 మందికి కంటి శస్త్రచికిత్స అవసరమని గుర్తించి, వారికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించి కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా డా.శరణ్య




యాదవ్ మాట్లాడుతూ, తమ ప్రియమైన వారి జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించడం వారికి అందించే గొప్ప నివాళి. గొల్లపల్లి రాయమల్లు తన సతీమణి రమాదేవి పేరుతో ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయం. ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకం. లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు మరిన్ని సేవా కార్యక్రమాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా కమిటీ చైర్మన్ మేకల మారుతి యాదవ్,జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షుడు,మాజీ జెడ్పీటీసీ ఎల్లా రామ్మూర్తి, మాజీ ఎంపీపీ ఆరెల్లి కొమురయ్య,సర్పంచ్ కొండవేన దివ్య సుధాకర్ యాదవ్,మాజీ సర్పంచ్ ఎరుకల ఓదెలు,ఉప సర్పంచ్ యసం సతీష్, గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షుడు తీగల సదయ్య, కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు వేగోళపు సంతోష్,యూత్ ఉపాధ్యక్షుడు నాడెం శ్రీనివాస్,మెంబర్ భద్రపు శ్రీనివాస్,మైలారం అనిల్, పందుల సోము,రామిని గోపాలకృష్ణ కాంగ్రెస్ పార్టీ సీనియర్






నాయకులు వేగోళపు రాయమల్లు, మంతిని వెంకన్న,మంతిని లచ్చన్న,నల్ల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు గ్రామ ప్రజలు లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ప్రతినిధులు,రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్య బృందం, గొల్లపల్లి రాయమల్లు,వారి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రతి ఓటరూ ఎన్యుమరేషన్ ఫారం నింపివ్వాలి

- మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్



**మేడిపల్లి జూలై 16( మన ప్రజావాణి)** ప్రతి ఓటరూ ఎన్యుమరేషన్ ఫారం నింపి బిఎల్ఓ,బిఎల్ఎ లకు ఇవ్వాలని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. బోడుప్పల్ సర్కిల్--10, డివిజన్--11లోని న్యూ హేమానగర్ కాలనీలో ఏర్పాటు చేసిన ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం హెల్ప్ డెస్కు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్,బోడుప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బొమ్మక్ బాలయ్య,మాజీ కార్పొరేటర్ బుక్యా సుమన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కృపాసాగర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్ కార్యక్రమంలో ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ప్రతి అర్హులైన పౌరుడికి ఓటు హక్కు కల్పించేందుకు ఓటరు సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు రేవతి, యూత్ కాంగ్రెస్ నాయకులు అంబాల అరవింద్,రాహుల్,శివ సాయి చంద్,పృథ్వి, బూత్ లెవల్ అధికారులు బిఎల్ఓలు నరేష్,ముఖేష్, బూత్ లెవల్ ఏజెంట్లు బిఎల్ఎలు,న్యూ హేమానగర్ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్లకు ఫారాలు పూరించడంలో సహకారం అందించాలి

- మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి





**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జులై 16 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బిఎల్వోలు నిర్వహిస్తున్న ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ, స్వీకరణ వేగవంతం చేయాలని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి బిఎల్ఓ లకు సూచించారు. గురువారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలోని శామీర్ పేట గ్రామంలో జరుగుతున్న సర్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ మను చౌదరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బి ఎల్ వో లకు మొత్తం ఎన్ని ఎన్యుమరేషన్‌ఫారాలు కేటాయించారు, ఇప్పటి వరకు ఎన్ని ఫారాలు అందించారు,తిరిగి ఎన్ని ఫారాలు తీసుకున్నారు అని బిఎల్ ఓలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. తీసుకున్న ఫారాల డిజిటలైజ్ ఏవిధంగా చేస్తున్నారని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఫారాలు పూరించడంలో ఓటర్లకు అవసరమైన మేర సహాయం అందించాలని బిఎల్‌ఓలకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట్ తహసీల్దారు సిహెచ్.శ్రీనివాస్, బిఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు మానసిక, శారీరకంగా దృడంగా ఉండడానికి క్రీడలు దోహదం చేస్తాయి

- ఉప్పల్ ఎమ్ ఎల్ ఏ బండారి లక్ష్మా రెడ్డి







**మేడ్చెల్ మల్కాజ్గిరి జిల్లా జులై 16 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి ( ప్రజావాణి )** ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ లీగ్--8వ ఎడిషన్ గ్రాండ్ ఫినాలేలో విజేతలకు బహుమతుల ప్రదానం చేసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఉప్పల్‌లో నిర్వహించిన ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ లీగ్ 8వ ఎడిషన్ గ్రాండ్ ఫినాలే పోటీలు ఉత్సాహభరితంగా ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విజేతలు, రన్నరప్ క్రీడాకారులకు ట్రోఫీలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, యువత క్రీడల్లో చురుకుగా పాల్గొనడం శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఇలాంటి క్రీడా పోటీలు యువతలో క్రమశిక్షణ, స్నేహభావం, పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి క్రీడా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు గంధం నాగేశ్వర్ రావు , నిర్వాహకులు సాజన్ ఖాన్, మహేందర్ రెడ్డి, క్రీడాకారులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్ణీత ధరలకే డీఏపీ విక్రయించాలి

- అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన వంగ రాజేశ్వర్ రెడ్డి
- హర్షం వ్యక్తం చేసిన సిద్దిపేట రైతులు



**సిద్దిపేట, జూలై 16 (ప్రజావాణి):** సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో కొందరు ఎరువుల వ్యాపారులు కోరమాండల్ డీఏపీ (DAP) ఎరువుల బస్తాలను ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారనే రైతుల ఫిర్యాదులపై వంగ రాజేశ్వర్ రెడ్డి వెంటనే స్పందించారు. రైతుల నుంచి సమాచారం అందుకున్న వెంటనే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.
ప్రభుత్వ నిబంధనల ప్రకారం కోరమాండల్ డీఏపీ ఎరువుల బస్తాను రూ.1,350 ధరకే విక్రయించాలని, అదనపు వస్తువులు (లింక్ లేదా అటాచ్‌మెంట్) కొనుగోలు చేయాలని రైతులను బలవంతం చేయరాదని అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు అందేలా అన్ని ఎరువుల దుకాణాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని కోరారు.అలాగే ప్రతి ఎరువుల దుకాణం వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక (ప్రైస్ డిస్‌ప్లే బోర్డు)ను రైతులకు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. కొందరు వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయించడం లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం వంటి చర్యలను ప్రభుత్వం ఏమాత్రం సహించదని, అలాంటి వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నాణ్యమైన ఎరువులు పొందేలా చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని వంగ రాజేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. రైతుల సమస్యపై వెంటనే స్పందించి అధికారులను అప్రమత్తం చేసిన ఆయన చొరవను సిద్దిపేట నియోజకవర్గ రైతులు స్వాగతిస్తూ హర్షం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా తీసుకున్న ఈ చర్యతో అధిక ధరల విక్రయాలకు అడ్డుకట్ట పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కేజీబీవీ పాఠశాల లో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం





**కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా** కాగజ్ నగర్ పట్టణంలో ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు కాగజ్నగర్ టౌన్ లోని కేజీబీవీ పాఠశాల ప్రాంగణంలో జిల్లా పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాబృంద సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాల రూపంలో సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలు, బాల్యవివాహాల ముప్పులు, రోడ్డు ప్రమాదాలు నివారణ, చట్టం-శాంతి భద్రత, మహిళల భద్రత, గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్, హెల్ప్‌లైన్ నంబర్లు (1930, 100, 1098) వినియోగం వంటి ముఖ్యాంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రమశిక్షణ, నైతిక విలువలు, సమాజ సేవా భావన పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ టౌన్ ఎస్.ఐ రాజు ,పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రమాదేవి , కళబృందం సభ్యులు రోహిత్, రాంచందర్, శ్రీనివాస్, చంద్రశేఖర్, రజిత, సంఘవి , విద్యార్థులు పాల్గొన్నారు.జిల్లా పోలీస్ కళాబృందం ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు, యువతలో సమాజహితం, చట్టం-శాంతి, భద్రత, జాగ్రత్తలు వంటి విషయాల్లో మరింత అవగాహన పెంచడమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు.

# ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన రాష్ట్ర ప్రభుత్వ విప్



**ప్రజావాణి వేములవాడ టౌన్ 16 జులై 2026** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం 28 మంది లబ్ధిదారులకు 10 లక్షల 99 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు పొందలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో ఉపయోగంగా మారిందన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.

# పూజలు చేసిన కాసేపటికే.. కోదాడలో వరుణుడి పలకరింపు..

- బొడ్రాయి అమ్మవారికి మున్సిపల్ చైర్‌పర్సన్ జలాభిషేకం చేసిన రోజే భారీ వర్షం..
- అమ్మవారి కరుణ, చైర్‌పర్సన్ సంకల్పం ఫలించిందంటున్న పట్టణ ప్రజలు..







**కోదాడ, జూలై 16/ ప్రజావాణి** మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ ఆధ్వర్యంలో ఉదయం జలాభిషేకం, పూజలు నిర్వహించిన కాసేపటికే.. మధ్యాహ్నం నుంచి కోదాడ పట్టణంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి భారీ వర్షం కురిసింది. ఎండవేడితో అల్లాడుతున్న పట్టణానికి ఈ వర్షం ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది. చైర్‌పర్సన్ మనస్ఫూర్తిగా చేసిన పూజలు, జలాభిషేకం వెనువెంటనే ఫలించాయని, అమ్మవారి కరుణ వల్లే వరుణ దేవుడు కరుణించాడని పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం

- పాల్గొన్న జమ్మికుంట కు చెందినబీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు రాజేష్ ఠాకూర్ పాల్గొని పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు అంశాలపై







**జమ్మికుంట జులై 16 (ప్రజావాణి)**భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిన్న ఘనంగా నిర్వహించబడింది. ఈ సమావేశంలో జమ్మికుంట టౌన్‌కు చెందిన బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు రాజేష్ ఠాకూర్ పాల్గొని పార్టీ బలోపేతానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.సమావేశం అనంతరం బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు ని రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు క్రాంతి కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి కరీంనగర్ జిల్లాలోని పార్టీ కార్యకలాపాలు ప్రజా సమస్యలు సంస్థాగత బలోపేతంపై వివరించారు. ఈ సందర్భంగా నాయకులు పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్యకర్తలను అభినందిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు.ఈ సందర్భంగా రాజేష్ ఠాకూర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి చేరేలా కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం నుంచి మరిన్ని అభివృద్ధి నిధులు మౌలిక వసతుల ప్రాజెక్టులు సంక్షేమ కార్యక్రమాలు తీసుకురావడంలో పార్టీ నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడం యువత మహిళలు ఎస్సీ వర్గాల భాగస్వామ్యాన్ని పెంచడం కేంద్ర ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడడం తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తూ ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తామని రాజేష్ ఠాకూర్ స్పష్టం చేశారు.

# రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్







**ప్రజావాణి,నంగునూరు , జూలై 16:** సిద్ధిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి నంగునూరు మండలం రాజగోపాలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆసుపత్రిలోని ఓపీ విభాగం, మందుల నిల్వలు, సిబ్బంది హాజరు, రిజిస్టర్ల నిర్వహణ తదితర అంశాలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్య అధికారులను ఆదేశించారు. అవసరమైన మందులు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, నీటి ద్వారా సంక్రమించే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఉప ఆరోగ్య కేంద్రాల ద్వారా ఏఎన్ఎంలు, సూపర్‌వైజర్లు గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో రోజువారీగా ఎంతమంది రోగులు ఓపీ సేవలు పొందుతున్నారని అడిగి తెలుసుకున్నారు., రోజుకు సుమారు 50 నుంచి 60 మంది రోగులు వస్తున్నట్లు వైద్యాధికారులు కలెక్టర్ కు తెలిపారు. ఆసుపత్రి సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. అటెండెన్స్ రిజిస్టర్, లీవ్ లెటర్లు, ఓపీ రిజిస్టర్‌లను పరిశీలించారు. విధులకు అందరూ హాజరయ్యారని వైద్యాధికారి వివరించారు. వైద్య సిబ్బంది సమయ పాలన పాటిస్తూ రోగులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రోగులకు అవసరమైన మందులు సకాలంలో అందించి వారికి ఆరోగ్య సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో కలెక్టర్ స్వయంగా మాట్లాడారు. చిన్న ఆరోగ్య సమస్యల నుంచి సీజనల్ వ్యాధుల వరకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్య సేవలు పొందాలని సూచించారు. వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా వాడాలని చెప్పారు. పోషకాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ముఖ్యంగా తాగునీటిని కాచి చల్లార్చి తాగడం అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. సీజనల్ వ్యాధులను నియంత్రించడంలో ప్రజల సహకారం ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ కె. హైమావతి పేర్కొన్నారు. ప్రజలు ఆరోగ్య సమస్యలు తలెత్తిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి వైద్య సేవలను పొందాలని విజ్ఞప్తి చేశారు.

# 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని

- ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు
- సర్ కార్యక్రమాన్ని ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలి
- జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం




**జమ్మికుంట జులై 16 (ప్రజావాణి)**ఎన్నికల సంఘం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ (ఎస్ ఐ ఆర్ ) కార్యక్రమాన్ని ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఒక్కరు నిర్లక్ష్యం చేయకుండా సద్వినియోగం చేసుకోవాలని జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పుల్లూరి స్వప్న సదానందం పిలుపునిచ్చారు జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్ పర్సన్ స్వప్న సదానందం మాట్లాడుతూ ఓటరు జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా తప్పులు లేకుండా రూపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అన్నారు18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్న వారు తమ వివరాలను ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారుబూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓలు) ఇంటింటికీ వచ్చి వివరాలు సేకరించినప్పుడు ప్రజలు పూర్తి సహకారం అందించాలనికోరారు అవసరమైన పత్రాలను సమర్పించి ఓటరు జాబితాను ఖచ్చితంగా రూపొందించేందుకు సహకరించాలనివిజ్ఞప్తిచేశారుఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని ఈ అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయరాదని అన్నారు. ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఆగస్టు 3 వరకు ఎన్నికల సంఘం పొడిగించడం జరిగిందని అన్నారుజమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో జమ్మికుంట ఇల్లందకుంట వీణవంక మండలాల ప్రజలందరూ సర్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు.

# అనారోగ్యంతో మాజీ పంచాయతీ కార్మికుని మృతి

- కుటుంబానికి హరీశ్ రావు రూ.5 వేల ఆర్థిక సాయం



**ప్రజావాణి,నంగునూరు, జూలై 16:** సిద్ధిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామానికి చెందిన మాజీ పంచాయతీ కార్మికుడు కందికట్ల ఆగయ్య అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. పదేళ్లుగా ఆయన పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. దీర్ఘకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో కొనసాగుతోంది. ఆగయ్య భార్య గ్రామంలో పంచాయతీ కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. వృద్ధాప్యం కారణంగా ఇటీవల ఆమె కూడా విధుల నుంచి విరమణ పొందినట్లు గ్రామస్తులు తెలిపారు. దీంతో కుటుంబం ఆర్థికంగా మరింత క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోంది. కుటుంబ పరిస్థితులను బీఆర్ఎస్ నాయకులు మాజీ మంత్రి హరీశ్ రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన రూ.అయిదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయాన్ని ఆగయ్య భార్యకు బీఆర్ఎస్ నాయకులు గురువారం అందించి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం హరీశ్ రావు ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఆగయ్య కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ నాయకులు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక సహాయం అందజేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండి మల్లేశం, నాయకులు బండి ప్రశాంత్, డాకూరి కోటీశ్వర్ రెడ్డి, డాకూరి భాస్కర్ రెడ్డి, బొల్లు సంపత్, దేవులపల్లి ఎల్లయ్య, గజ్జల సతీశ్ రెడ్డి, పరకాల కిష్టారెడ్డి, వెంకట్, మల్లేశం, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి విద్యార్థి లక్ష్యం చేరుకోవాలి

- ఆటలు ఆడాలి.. చదవాలి
- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లి కేజీబీవీ విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్




**ప్రజావాణి వేములవాడ టౌన్ 16 జులై 2026** ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని.. తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. వేములవాడ రూరల్ మండలం మర్రిపల్లిలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో యూనిఫాంల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని స్టోర్ రూమ్ లో బియ్యం, కూరగాయలు, పండ్లు, నెయ్యి, ఇతర పదార్థాల నాణ్యత, గడువు తేదీని తనిఖీ చేశారు. మెనూ చార్ట్ పరిశీలించి.. ఏ ఏ ఆహార పదార్థాలు సిద్ధం చేస్తున్నారో పరిశీలించారు. విద్యాలయంలో చదివి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు ప్రస్తుతం ఎక్కడ చదువుతున్నారో ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకొని.. దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలని పిలుపు నిచ్చారు. రెసిడెన్షియల్ విద్యాలయాల్లో ప్రవేశానికి చాలా మంది పోటీ పడతారని ఇక్కడ చదివే మంచి అవకాశం విద్యార్థులకు వచ్చిందని పేర్కొన్నారు. విద్యార్థులు రోజు ఆటలు ఆడాలని.. మంచిగా చదవాలని సూచించారు. చదువు మధ్యలో మానేయవద్దని, ఉన్నత విద్యాభ్యాసం చేయాలని పిలుపు నిచ్చారు. విద్యార్థులు వివిధ వృత్తులు, ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అప్పుడే మహిళ సాధికారత సాధ్యమని తెలిపారు. విద్యార్థులకు మహిళా సంఘాల వారితో యూనిఫాంలు కుట్టిస్తున్నామని, వారికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ప్రతి రెసిడెన్షియల్ విద్యాలయాల్లో తనిఖీ కోసం ఒక మండల, జిల్లా స్థాయి అధికారులను కేటాయించామని వివరించారు. వారు విద్యాలయం తనిఖీ చేసి.. విద్యార్థులతో కలిసి భోజనం చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులకు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయాలని వైద్య సిబ్బందిని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈఓ మొండయ్య, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, తహసీల్దార్ అబూబాకర్, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పలాస కాశీబుగ్గ జంట పట్టణాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలు..

- ప్రధాన కూడలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు లేక ఇబ్బందులు.
- ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేక పోవడము వల్ల ఇక్కట్లు
- ట్రాఫిక్ నిబంధనలు లేకుండ వాహనాలు నడుపు తున్న వారిపై చర్యలు .లేవు..




**పలాస ప్రజావాణి ప్రతినిధి** శ్రీకాకుళం జిల్లాలోని పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో నీ జంటపట్టణాల్లో పెరుగుతున్న జనాభా కు తోడు వాహనాలు పెరుగుతున్నాయి.దీనికి సంబంధించి అవసరమైన ట్రాఫిక్ పోలీసులు సంఖ్య తక్కువ ఉండడం వల్ల పెరిగిన ట్రాఫిక్ ను నియంత్రణ చర్యలు తీసుకోలేని పరిస్థితి ఉంది . ముక్యంగా ఉదయము ఎనిమిది గంటలు కు అలాగే సాయంకాలము ఐదు గంటలు కు విద్యార్దులను తరలిస్తున్న బస్సులు ఒకె సారి వాహనాలు రావడము వల్ల ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుందని చెప్పక తప్పదు. ఆలాగే ప్రతీ వారంలో శుక్రవారం జరిగే సంత వల్ల అదనంగా ట్రాఫిక్ జామ్ అవుతుందని పలువురు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ప్రధానంగా రోడ్ల ఆక్రమణలు, అస్తవ్యస్తంగా తిరిగే పశువులు, స్థానిక బస్టాండ్ వద్ద మార్కెట్ కారణంగా భారీగా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయి. వీటి పరిష్కారానికి అధికారులు సంయుక్తంగా చర్యలు చేపడుతున్న ప్పటికీ సమస్య శాశ్వత పరిష్కారము కావడము లేదని పలువురు పేర్కొంటున్నారు.ప్రధాన ట్రాఫిక్ సమస్యలు మరియు కారణాలకు సంబంధించి రోడ్ల ఆక్రమణలు తో పాటు ప్రధాన కూడళ్లలో రోడ్లను ఆక్రమించి దుకాణాలు పెట్టడం, ఇష్టారాజ్యంగా పశువులు సంచరించడం.లాంటి వాటిని నియంత్రణ చేయాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు..కాశీబుగ్గ బస్ స్టాండ్ ఆవరణలో అనధికార మార్కెట్ మరియు బస్సుల రాకపోకలతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. జాతీయ రహదారిపై మరియు పట్టణ ప్రధాన మార్గాల్లో భారీ వాహనాల వల్ల తరచూ ట్రాఫిక్ జామ్ అవుతోంది.ఆక్రమణలను పురపాలక సంఘం అధికారులు, పోలీసులు సంయుక్తంగా ఆక్రమణల



తొలగింపునకు చర్యలు తీసుకొని ఇక్కడ ట్రాఫిక్ జామ్ సమస్యలు నుంచి ప్రజలను కాపాడాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు..

# భరణి కోట స్కూలు విద్యార్ధిని ఆత్మ హత్య సంఘటపై మండి పడ్డ గిరిజన శక్తి సంక్షేమ సంఘం,ప్రజాసంఘాలు





**పలాస ప్రజావాణి ప్రతినిధి** శ్రీకాకుళం జిల్లాలోని మెలియాపుట్టి మండలం భరణికోట పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని సవర నవ్యశ్రీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన స్థానికంగా తీవ్ర ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనకు ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు వసంత వేధింపులే కారణమని విద్యార్థిని పేర్కొన్నట్లు సమాచారం. అయితే, ఈ ఆరోపణల నిజానిజాలను సంబంధిత అధికారులు నిష్పాక్షికంగా, సమగ్రంగా విచారించి ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందనీ గిరిజన శక్తి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సవర నర్సింహా మూర్తి అలాగే రైతుకూలీ సంఘము రాష్ట్ర నేత కోనేరు రమేష్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నేత మద్దిల రామారావు లు స్పష్టము చేశారు. ఈ మేరకు పలాస ప్రభుత్వ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న బాధితురాలు ను పరామర్శించారు.. పాఠశాల నిర్వహణకు సంబంధించి కూడా పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు వసంత తరచూ పాఠశాల ముగిసే సమయానికి ముందే వెళ్లిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే, నైట్ స్టడీ సమయంలో విధులు నిర్వహించకపోవడంతో ఆ బాధ్యత ఇతర సిబ్బందిపై పడుతోందనే అభ్యంతరాలు కూడా వ్యక్తమవుతున్నాఅన్నారు ఘటన అనంతరం విద్యార్థిని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, విద్యార్థులు భయాందోళనకు గురికాకుండా నైట్ స్టడీ సమయం వరకు పాఠశాల సిబ్బంది మొత్తం అక్కడే ఉన్నారని, రాత్రంతా మహిళా సిబ్బంది పాఠశాలలోనే విధులు నిర్వహించారని సమాచారం. అయితే, ఫిజిక్స్ ఉపాధ్యాయురాలు వసంత సాయంత్రం 5 గంటలకే పాఠశాల విడిచి వెళ్లిపోయారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమని తేలితే, విద్యార్థుల భద్రత మరియు విధుల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించినట్లుగా భావించాల్సి ఉంటుందనీ వారు తెలిపారు.అందువల్ల, సంబంధిత ఐటిడిఏ అధికారులు ఈ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలనీ అలాగే విచారణలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం లేదా ఇతర ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే, సంబంధిత వారిపై చట్టప్రకారం తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నామనీ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు..

# రైతులు వరి పంటలను తగ్గించి ఆరుతడి పంటలు వెయ్యాలి

- వ్యవసాయ అధికారి కిషోర్ నాయక్



**ప్రజావాణి వేములపల్లి జూలై 16**మండల కేంద్రంలో ఈరోజు వేములపల్లి మండలం ఆమనగల్, లక్ష్మీదేవిగూడెం, శెట్టిపాలెం, బుగ్గబావి గూడెం గ్రామాల్లోని వ్యవసాయ భూములలో పర్యటించి రైతులకు ప్రస్తుత వానాకాలం సీజన్లో ఎల్-నినో ప్రభావం వలన రైతులు వరి పంటను తగ్గించి ఆరుతడి పంటలు వేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఆర్.కిషోర్ నాయక్, సూచించారు. వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉండడం వలన రైతులు వరి పంటను సాగు చేసినట్లయితే నష్టపోవాల్సి వస్తుందని, అలా కాకుండా వారు సగం విస్తీర్ణంలో నీరు తక్కువగా అవసరమయ్యే మెట్ట పంటలను పండించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఇప్పటికే వ్యవసాయ శాఖ ముందస్తు అవగాహన కార్యక్రమాల ద్వారా వేసిన పెసర, కంది పంటలను పరిశీలించి, మిగిలిన రైతులను కంది లాంటి ఆరుతడి పంటలు వేసుకోవచ్చని తెలిపారు. వచ్చే రెండు నెలలు కూడా దాదాపు ఇవే పరిస్థితులు ఉండే అవకాశం ఉన్నందువల్ల భూగర్భ జలాలు ఇంకా తగ్గిపోయే అవకాశం ఉన్నది. అందువల్ల వరి పంట వేయడం వల్ల సరిపోయే నీళ్లు లేకపోవడం వల్ల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉన్నది. బోర్లు బావుల కింద వరి సాగు చేసే రైతులకు 25% విస్తీర్ణంలో మాత్రమే వరి వేసుకోగలరని, మిగతా 75% విస్తీర్ణంలో ఆరుతడి పంటలు వేసుకోవాలని సూచించారు. ప్రాజెక్టులు, లిఫ్ట్ ఇరిగేషన్ల కింద వరిని పండించే రైతులకు ప్రాజెక్టులలోకి వ్యవసాయానికి సరిపోయే నీరు వచ్చే అవకాశం లేనందున వరి పంట స్థానంలో అరుతడి పంటలు వేసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అసైన్డ్ భూములు, పట్టలేని భూములను సేద్యం చేస్తున్న రైతులు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించి తగిన పత్రాలు అందజేసి యూరియా బుక్ చేసుకోవాల్సిందిగా సూచించారు. వేములపల్లి మండలంలో ఇప్పటికీ 800 టన్నుల యూరియా రైతులు బుక్ చేసుకుని ఉన్నారు. మరియు యూరియా నిల్వలు తగినంతగా అందుబాటులో ఉన్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ఎండి షఫీ, కె,రమేష్, ఎం ప్రియాంక, మాజీ ఆదర్శ రైతు సైదిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు



**సిద్దిపేట, జూలై 16 (ప్రజావాణి):** సిద్దిపేట జిల్లా మీరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మైనర్ బాలికపై లైంగిక దాడి, అపహరణ, పోక్సో కేసులో నిందితుడు తాడేం చందు (34)కు గౌరవ న్యాయస్థానం 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధించినట్లు సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఐపీఎస్ తెలిపారు.సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. 2022 మే 20న మీరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు నమోదు కాగా, అప్పటి దర్యాప్తు అధికారి ఏసీపీ దేవరెడ్డి సమగ్ర దర్యాప్తు నిర్వహించి, పూర్తి సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో పటిష్టమైన ఛార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్. ఆత్మరాములు వాదనలు వినిపించగా, మీరుదొడ్డి ఎస్ఐ సతీష్, సీఐ రాజేష్, ఏసీపీ రవీందర్, లైజనింగ్ అధికారి శ్రీనివాస్ రెడ్డి, సీడీఓ పరశురాములు, హెడ్ కానిస్టేబుల్ అంజిరెడ్డి తదితరులు సమన్వయంతో కేసు విచారణకు సహకరించారు.సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన గౌరవ న్యాయమూర్తి వై. జయ ప్రసాద్ నిందితుడిని దోషిగా నిర్ధారిస్తూ 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసులో సమర్థవంతంగా పనిచేసి నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని సీపీ రష్మీ పెరుమాళ్ అభినందించారు. మైనర్ బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడే వారిని చట్టం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని ఆమె స్పష్టం చేశారు. ఇలాంటి కేసుల్లో శాస్త్రీయ దర్యాప్తు, పటిష్టమైన సాక్ష్యాధారాల ఆధారంగా నిందితులకు కఠిన శిక్షలు పడేలా సిద్దిపేట పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు.పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలతో తరచూ మాట్లాడుతూ వారి కదలికలను గమనించాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100/112కు సమాచారం అందించాలని సీపీ విజ్ఞప్తి చేశారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్. డాక్టర్ చెన్నమనేని వికాస్ రావు



**ప్రజావాణి వేములవాడ టౌన్ 16 జులై 2026:**కొనరావుపేట మండల కేంద్రంలో బావుసాయిపేట గ్రామంలో ఇటీవల కొండగట్టులో ప్రమాదవశాత్తు యాక్సిడెంట్ లో అకాల మరణం చెందిన పోకల మధుకర్ ౦/శీ భూమయ్య గారి కుటుంబాన్ని మరియు నిమ్మపల్లి గ్రామంలోని అనారోగ్య కారణంగా ఇటీవల అకాల మరణం చెందిన తోట స్వప్న౦/శీ రాజు గారి కుటుంబాన్ని "భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ శ్రీ చెన్నమనేని వికాస్ రావు" గారు వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేయడం జరిగింది.. ఇట్టి కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మిర్యాల్ కార్ బాలాజీ గారు, జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు, జిల్లా కౌన్సిల్ మెంబర్ గొట్టే రామచంద్రం, మండల పదాధికారులు,కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి లో శ్రీ జగన్నాథ రథయాత్రను ప్రారంభించిన ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా








**మన సమగ్ర ప్రజావాణి జులై 16సంగారెడ్డి జిల్లా ప్రతినిధి** రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని ఇస్కాన్ ఆలయం - కూకట్ పల్లి అద్వర్యంలో వైభవంగా నిర్వహించిన శ్రీ జగన్నాథ్ రథయాత్ర - 2026 ను ప్రారంభించారు.ఈ సందర్భంగా శ్రీ జగన్నాథ్ రథయాత్ర ను పురస్కరించుకొని ఇస్కాన్ టెంపుల్ నిర్వహణ లో కూకట్ పల్లి లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, అశేష జనవాహిని మధ్య భక్తులు 'జై జగన్నాథ్' , 'హరే రామ' 'హరే కృష్ణ' నామస్మరణ నినాదాలతో మార్మోగిస్తూ భక్తిశ్రద్ధలతో జగన్నాథుడి రథచక్రాలను లాగారు. మంత్రి దామోదర్ రాజనర్సింహ భక్తితో స్వామి వారి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు.

# వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం..

- బతుకమ్మ ఆటలతో మహిళల ప్రత్యేక ప్రార్థనలు



**ప్రజావాణి,నంగునూరు, జూలై 16:** వర్షాలు సమృద్ధిగా కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని కోరుతూ సిద్దిపేట జిల్లా నంగునూరు మండల కేంద్రంతో పాటు మైసంపల్లి గ్రామంలో గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వానాకాలం ప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో పంటల సాగుపై రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో గ్రామ ప్రజలు గ్రామ దేవతలను ప్రసన్నం చేసుకునేందుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవతలకు జలాభిషేకం అనంతరం మహిళలంతా కలిసి నీళ్ల బిందెల చుట్టూ బతుకమ్మ ఆటలు ఆడుతూ వాన దేవుని ప్రార్థించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి నరేశ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు ఆనందంగా పంటలు పండించుకోవాలని గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించామని తెలిపారు. వర్షాభావం తొలగిపోయి చెరువులు, కుంటలు నిండి వ్యవసాయ భూములు పచ్చదనంతో కళకళలాడాలని దేవుళ్లను వేడుకున్నామని చెప్పారు.అలాగే బుధవారం రాత్రి నంగునూరు మండల కేంద్రంలోని కొంగల చింత ప్రాంతంలో మహిళలు అర్ధరాత్రి వరకు బతుకమ్మ పాటలు పాడుతూ సంప్రదాయ నృత్యాలతో వాన దేవుని ప్రార్థించారు. గ్రామీణ సంస్కృతి, దైవభక్తి, ప్రకృతిపట్ల ఉన్న అనుబంధాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, రైతుల కష్టాలు తొలగి పోవాలని గ్రామ ప్రజలు సామూహికంగా ప్రార్థనలు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో తరతరాలుగా కొనసాగుతున్న ఇటువంటి ఆచారాలు ప్రకృతితో మనిషికి ఉన్న విడదీయరాని బంధానికి నిదర్శనంగా నిలుస్తున్నాయని పలువురు గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రైతులు, మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొని వర్షాల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# సంఘం డైరీ వారి ఆధ్వర్యంలో ఉచిత పశువుల క్యాంపు



**చిలుకూరు జూలై 16(ప్రజావాణి):** చిలుకూరు మండల కేంద్రంలో గురువారం సంఘం పాల డైరీ వారి ఆధ్వర్యంలో ఉచిత పశువుల క్యాంపు ను, తెలంగాణ రీజినల్ మేనేజర్ నాగబాబు, డాక్టర్ వీరారెడ్డి, ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ, గేదెలకు ఇన్సూరెన్స్ పాలసీ తక్కువ ధరకే ఉన్నదని దీనిని పాల సేకరణ కేంద్రం వారి ద్వారా పాలసీ చేయించుకోవాలని తెలియజేశారు. అనంతరం వెటర్నరీ డాక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ సంఘం డైరీ వారి ఆధ్వర్యంలో దాదాపు వంద గేదల వరకు పరీక్షలు చేయడం జరిగిందని రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో కోదాడ యూనిట్ సంఘం మేనేజర్ వరప్రసాద్, సూపర్వైజర్ రమేష్, పాల సేకరణ కేంద్రం నిర్వాహకులు పొందూరు రమేష్, రైతులు పాల్గొన్నారు.

# వ్యవసాయ పంటలను తగ్గించి ఆరుతడి పంటల సాగుకు రైతులు మొగ్గు చూపాలి

- దేవరకొండ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్



**దేవరకొండ ప్రజావాణి, జూలై 16:** ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాల తగ్గుదల, వాతావరణ మార్పుల నేపథ్యంలో రైతులు అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగును తగ్గించి, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని దేవరకొండ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ, ఈ ఏడాది వర్షపాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సాగునీటి లభ్యతపై అనిశ్చితి నెలకొందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో వరి వంటి అధిక నీటి అవసరం ఉన్న పంటల కంటే జొన్న, సజ్జ, రాగులు, పెసర, మినుములు, కందులు, శనగ, వేరుశెనగ తదితర ఆరుతడి పంటలను సాగు చేయడం రైతులకు అన్ని విధాలా ప్రయోజనకరమని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో సాగు చేయడంతో పాటు నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే నష్టాలను కూడా కొంత మేర నివారించే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు. రైతులు తమ భూముల స్వభావం, నీటి అందుబాటు, వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు అందించే శాస్త్రీయ సూచనలు, సాంకేతిక సలహాలను పాటిస్తూ ఆధునిక సాగు విధానాలను అవలంబించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రతి రైతు ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టాలని, నీటి సంరక్షణతో పాటు పంటల వైవిధ్యాన్ని పెంపొందించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ తెలిపారు. రైతులు పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకుంటే వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని ఆయన ఆకాంక్షించారు. ఈ వార్తకు సరిపోయే ఫోటో క్యాప్షన్ కూడా: "రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని సూచిస్తున్న దేవరకొండ మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్."

# వన మహోత్సవంలో భాగంగా మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో మొక్కల నాటకం

- ఏసీపీ సదానందం, ఎస్ఐ అసిఫ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొనడం





**మద్దూర్, జూలై 16:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం సిద్దిపేట జిల్లా మద్దూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా మొక్కల నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏసీపీ సదానందం ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎస్ఐ అసిఫ్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ సదానందం మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు వృక్షారోపణే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. ప్రతి వ్యక్తి కనీసం ఒక మొక్కను నాటి దానిని పెంచితేనే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని వాతావరణాన్ని అందించగలమని తెలిపారు. వన మహోత్సవం వంటి కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని, ప్రకృతి పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అసిఫ్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొని మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి ఆషాఢ మాసం బోనాలు సమర్పించిన తెలంగాణ శివశక్తులు...



**పెనుగంచిప్రోలు జులై 16 మన ప్రజావాణి** అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్న భక్తజనం.. తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా శివశక్తుల పూజలు, నృత్యాలు... తెలంగాణ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆషాఢ మాసంలో భక్తిశ్రద్ధలతో శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని కొలిచారు, పవిత్రమైన ఆషాఢ మాసం సందర్భంగా, తెలంగాణ నుంచి తరలివచ్చిన శివశక్తులు అమ్మవారికి ఘనంగా బోనాలు సమర్పించారు, తెలంగాణ సాంప్రదాయ నృత్యాలు, డప్పు వాయిద్యాల నడుమ శివశక్తులు అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు, శివసత్తులు మరియు శివశక్తులు పూనకంతో ఊగిపోతూ, భక్తిపారవశ్యంలో మునిగిపోయి అమ్మవారికి బోనాలు సమర్పించారు, పోతురాజుల విన్యాసాలు, భక్తుల కోలాటాలు, మరియు శివశక్తుల ఆటపాటలతో పెనుగంచిప్రోలు పరిసర ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

# హుజారాబాద్ మండలములో అర్హులైన పేదలకు ఇళ్లు స్థలాలు ఇవ్వాలి..

- హుజారాబాద్ మండల తహసిల్దార్ కు వినతి పత్రము ఇచ్చిన రైతు కూలీ సంఘం
- ప్రజలు పోరాటాలకు సిద్ధము కావాలని పిలుపు నచ్చిన సంఘం





**పలాస ప్రజావాణి ప్రతినిధి** హుజురాబాద్ మండల కేంద్రంలో రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో అర్హులైన పేదలకు నివాస స్థలాలు ఇవ్వాలని హుజురాబాద్ మండల తాసిల్దార్ కు వినతిపత్రం ఇచ్చిన రైతు కూలీ సంఘం. అనంతరం రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం మాట్లాడుతూ హుజురాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ భూములు అన్యకాంతం అవుతున్నాయనీ అందువలన అర్హులైన పేదలు ఇందిరమ్మ ఇండ్లకు నోచుకోక సొంత ఇల్లు లేక వేలాదిరూపాయలు ఇండ్ల కిరాయి చెల్లిస్తూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారాని అవేదన వ్యక్తము చేశారు. ప్రభుత్వం ఎన్ని సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన అన్నీ కూడా నేతిబీరలో నెయ్యి చందమే అని అన్నారు. ప్రభుత్వం కు చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వ భూముల అన్యాక్రాంతాన్ని అరికట్టి అర్హులైన నిరుపేదలకు ఇండ్ల స్థలాలుగా ఇస్తూ ఇల్లు కట్టుకోవడానికి రుణాలను మంజూరు చేయాలని రైతు కూలి సంఘం డిమాండ్ చేస్తుందన్నారు అర్హులైన నిరుపేదలందరూ ఇండ్ల స్థలాల కోసం ప్రభుత్వంపై పోరాటాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు సంపన్నుల లబ్ధి కోసమే తెలంగాణలోని అతివిలువైన భూములను కారుచౌకగాఅమ్మేస్తూ రేవంత్ రెడ్డి సర్కార్ రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొనసాగిస్తుందన్నారు. ప్రజా సమస్యలన్నీ గాలికి వదిలేసి కేవలం గారడి మాటలతో ప్రజలను మోసగిస్తుందన్నారు ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం జిల్లా కన్వీనర్ దేవనూరి రవికుమార్, ఆర్.రవితేజ ఇండ్ల స్థలాలు లేనినిరుపేదలు మోహన్ అంజలి, సరస్వతి గౌతమి ఎం.డి పర్వన ,సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

# కేసుల ఛేదనలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించాలి

- జిల్లా క్రైమ్ స్టాఫ్,సైబర్ వారియర్స్‌కు దిశానిర్దేశం చేసిన వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్






**ప్రజా వాణి,వికారాబాద్ జిల్లా జూలై 16:** వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా క్రైమ్ స్టాఫ్, సైబర్ వారియర్స్‌కు సీడీఆర్, ఐపీడీఆర్,టవర్ డంప్ అనాలిసిస్,ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్,ట్విట్టర్ (ఎ)మరియు ఇతర సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ లు మరియు హ్యూమన్ ఇంటెలిజెన్స్ ద్వారా నేరాల దర్యాప్తు,పెండింగ్ కేసుల ఛేదన అంశాలపై నిర్వహించిన ఒకరోజు ప్రత్యేక శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ పాల్గొని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రస్తుతం నేరాల స్వరూపం వేగంగా మారుతున్నందున సాంకేతిక పరిజ్ఞానంపై పూర్తి అవగాహన ప్రతి దర్యాప్తు అధికారికి అత్యంత అవసరమని తెలిపారు. నేరస్థులు మొబైల్ ఫోన్లు,సోషల్ మీడియా,డిజిటల్ కమ్యూనికేషన్‌ను విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో,సిడి ఆర్ ఐపీడీఆర్,టవర్ డంప్ డేటా విశ్లేషణతో పాటు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లలో మరియు హ్యూమన్ ఇంటెలిజెన్స్ ద్వారా సమర్థవంతమైన శోధన ద్వారా కీలక ఆధారాలను సేకరించి కేసులను త్వరితగతిన ఛేదించవచ్చని సూచించారు. పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ,సాంకేతిక ఆధారాలను వినియోగించి నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని,ప్రతి కేసులో డిజిటల్ సాక్ష్యాలను శాస్త్రీయ పద్ధతిలో సేకరించి కోర్టులో బలమైన అభియోగపత్రాలు దాఖలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదేవిధంగా, సోషల్ మీడియా వేదికల ద్వారా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించడం,పరారీలో ఉన్న నిందితుల ఆచూకీ కనుగొనడం,మోసాలు,సైబర్ నేరాలు, మహిళలు మరియు చిన్నారులకు సంబంధించిన కేసుల్లో డిజిటల్ ఇంటెలిజెన్స్‌ను సమర్థంగా వినియోగించాలని సూచించారు. ప్రతి దర్యాప్తు అధికారికి సహాయకంగా ప్రతి క్రైమ్ స్టాఫ్ సిబ్బంది ఆధునిక దర్యాప్తు పద్ధతులపై నిరంతరం అవగాహన పెంపొందించుకోవాలని,కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుని ప్రజలకు వేగవంతమైన,నాణ్యమైన పోలీసు సేవలు అందించేలా కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డిటిసి డిఎస్‌పి శ్రీనివాస్,సిసిఎస్ ఇన్స్పెక్టర్ బల్వంత్ రాయ్,ఐటి సెల్ ఎస్ఐ శంకర్,ఐటి సెల్ సిబ్బంది,జిల్లా క్రైమ్ స్టాఫ్,సైబర్ వారియర్స్ మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గోదావరి పారినా గడప దాటని సాగునీరు:

- డాక్టర్ చిరుమల్ల రాకేష్ కుమార్




**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, జూలై 16** రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణను పూర్తిగా విస్మరించిందని బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమల్ల రాకేష్ కుమార్ ఆరోపించారు. గురువారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే జిల్లాలో సాగునీటి సంక్షోభం తీవ్రరూపం దాల్చిందన్నారు. గత ఏడాది ఇదే సమయానికి జిల్లాలో 2.79 లక్షల ఎకరాల్లో సాగు జరగగా, ఈసారి కేవలం 12 వేల ఎకరాల్లో మాత్రమే సాగు జరిగిందని గణాంకాలను ప్రస్తావించారు. డీ-83, డీ-86 కాలువల ద్వారా నీటి సరఫరా నిలిచిపోవడంతో పాటు ఎల్లమ్మ చెరువుతో సహా జిల్లాలోని పలు చెరువులు ఎండిపోవడం, భూగర్భ జలాలు అడుగంటడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. 20 టీఎంసీల సామర్థ్యం ఉన్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో ప్రస్తుతం కేవలం 7 టీఎంసీల నీరు మాత్రమే ఉందని, అది తాగునీటి అవసరాలకు కూడా సరిపోని పరిస్థితి నెలకొన్నదని అన్నారు. గోదావరిలో లక్షలాది క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వృథాగా వెళ్తున్నప్పటికీ, వాటిని వినియోగించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గత ప్రభుత్వం నిర్మించిన మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులు అందుబాటులో ఉన్నప్పటికీ, సరైన నిర్వహణ లేక ప్రస్తుతం వాటి ప్రయోజనం ప్రజలకు అందడం లేదని ఆరోపించారు. సమీపంలో గోదావరి ప్రవహిస్తున్నప్పటికీ, కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను నింపి, ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా పత్తిపాక రిజర్వాయర్ పనులను ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, ముఖ్యమంత్రి, మంత్రులు అభివృద్ధిని పక్కనపెట్టి పదవుల పంపకాల రాజకీయాల్లోనే నిమగ్నమయ్యారని విమర్శించారు. ముఖ్యమంత్రి చేసిన "రక్తం చిందితే పంటలు పండుతాయి" అన్న వ్యాఖ్యలపై స్పందిస్తూ, "పంటలు పండాలంటే ఎవరి రక్తం అవసరమో ప్రజలే నిర్ణయిస్తారు" అని వ్యాఖ్యానించారు. రైతు భరోసా, సన్న బియ్యం బోనస్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీల అమలుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సాగునీటి సమస్య పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడకపోతే రైతుల పక్షాన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, మాజీ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్ స్వామి, మేకల కుమార్ యాదవ్, కర్రె దేవేందర్ రెడ్డి, ఉప్పు శివకుమార్, పోసాని శ్రీనివాస్ యాదవ్, బోయిని మనోజ్, కంచి నాగరాజు, పాయిలి కిరణ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా బడి బట్టలను విక్రయిస్తున్న శ్రీ చైతన్య హైస్కూల్

- స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి.
- విద్యార్థి సంఘం ఎ ఐ ఎస్ ఎఫ్,ఎన్ఎస్ యూ ఐ డిమాండ్.





**గోదావరిఖని,మన సమగ్ర ప్రజావాణి జులై 16** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు బడి బట్టలను విక్రయిస్తున్న ఆర్ఎఫ్.సి.ఎల్ శ్రీ చైతన్య పాఠశాల పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఎన్ఎస్.యూ.ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం,ఎన్ఎస్.యూ.ఐ రాష్ట్ర కార్యదర్శి బైరిమల దుర్గ మాట్లాడు తూ.. విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఆకర్షించే విధంగా రంగురంగుల కరపత్రాలతో హంగు ఆర్భాటాలతో లేనివి ఉన్నట్టుగా చూపిస్తూ మోసం చేస్తున్నారని, విద్యాబుద్ధులు నేర్పాల్సిన వారే విద్య వ్యాపారం చేస్తున్నారని ఆయన అన్నారు. శ్రీ చైతన్య హైస్కూల్ యాజమాన్యం ఒక క్వాటర్సు కిరాయికి తీసుకొని ఆ రూములో బడి బట్టలను అధిక ధరలకు నిబంధనలకు విరుద్ధంగా విక్రయించడం జరుగుతుందని, సమాచారం తెలియగానే అక్కడికి వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న శ్రీ చైతన్య హై స్కూల్ పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్,ఎన్ఎస్.యూ.ఐ గా ఆందోళన చెయ్యగా మండల విద్యాధికారి జింక మల్లేష్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులచే ఆ రూమ్ ని సీజ్ చేయడం జరిగింది. విద్యా వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య పాఠశాల అనుమతులను కూడా రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించడం జరిగింది.

# పెబ్బేరు మండల తాసిల్దార్ కార్యాలయం లో దారుణం

- భవనం లోపల పూర్తిగా నేలలోకి కుంగిపోయిన అడుగు భాగం
- ఇలాగే కార్యాలయంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్న సిబ్బంది
- ఈ విషయంపై ఎవరు పట్టించుకోవడంలేదని అధికారులు వాపోతున్నారు
- ఎప్పుడు మరింత లోతుకు కృంగిపోతుందో తెలియని ఆందోళనలో సిబ్బంది
- వనపర్తి ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి దీనిపై స్పందించాలని అభ్యర్థన





**మన సమగ్ర ప్రజావాణి వనపర్తి జిల్లా:** ఈ అంశంపై అధికార యంత్రాంగం స్పందించి ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే తాసిల్దార్ కార్యాలయాన్ని బాగు చేయాలని భూముల రిజిస్ట్రేషన్ కొరకు మరియు తమ అవసరాల నిమిత్తం ధ్రువపత్రాల కోసం వచ్చిన ప్రజలు స్పందిస్తూ ప్రజా నాయకుడు ఎమ్మెల్యే తుడిమేగా రెడ్డి ని ఉన్నతఅధికారులను వేడుకుంటున్నారు భూముల రిజిస్ట్రేషన్ ల పేరుతో అధిక మొత్తంలో మార్కెట్ విలువలను పెంచి సాధారణ జీవనం గడుపుతున్న ప్రజలపై భారాన్ని పెంచడమే కాక ప్రభుత్వానికి ఆదాయాన్ని తెచ్చి పెడుతూ ప్రజల అవసరాలను తీరుస్తున్న కార్యాలయాలను పట్టించుకోవడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని మేధావులు తదితర సంఘసంస్కర్తలు ఆరోపిస్తున్నారు ఇప్పటికైనా అధికారం యంత్రాంగం కళ్ళు తెరిచి ఈ సమస్యకు పరిష్కారం చూపాలని కార్యాలయ సిబ్బంది ప్రజలు కోరుతున్నారు

# తెలంగాణ సాంస్కృతిక పండుగ కుమ్మర్ల తొలి బోనం

- మట్టి కుండల ప్రాధాన్యత
- కుమ్మర్ల తొలి బోనం.... శ్రీ శ్రీ శ్రీ కనకాల కట్ట మైసమ్మ.
- బోనాల పండుగలో భాగమైన కుమ్మర్ల పాత్ర అత్యంత ప్రాచీనమైనది, విశిష్టమైనది.
- వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం నాయకులు.








**మన సమగ్ర ప్రజావాణి వనపర్తి జిల్లా :**తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో జరుపుకునే పండుగ కుమ్మర్ల తొలి బోనం... తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం అధ్యక్షులు నడికుడి జయంతి రావు పిలుపు మేరకు గురువారం ట్యాంక్ బండ్ శ్రీశ్రీ శ్రీ కనకాల కట్ట మైసమ్మ దేవాలయం అమ్మవారి తొలి బోనం పూజ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం నాయకులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు,తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా వనపర్తిజిల్లా కుమ్మరి సంఘం నాయకులు మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్రంలో ఆషాఢమాసంలో జరుపుకునే పండుగ కుమ్మర్ల తొలి బోనం..భోజనమే... బోనం! మహిళలు.. అట్టహాసంగా లష్కర్ బోనాలు.. తొలి బోనం సమర్పించి తెల్లవారుజాము నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు క్యూ కడతారన్నారు.కుమ్మరి కులస్తులు తయారుచేసిన మట్టి కుండ (బోనం)లోనే అమ్మవారికి నైవేద్యం వండటం, కుమ్మరి మహిళలే తొలి బోనాన్ని సమర్పించడం అనాదిగా వస్తున్న సంప్రదాయమే.. కుమ్మర్ల తొలి బోనం అన్నారు.కుమ్మర్ల తొలి బోనం విశిష్టతకు చాలా ఆదారణ ఉందన్నారు.

మట్టి కుండల ప్రాధాన్యత:
బోనాలు అనగానే మట్టి కుండలు గుర్తుకొస్తాయి. కుమ్మరులు ఎంతో భక్తిశ్రద్ధలతో, పవిత్రంగా,ప్రత్యేక కుండలను తయారుచేస్తారన్నారు.

తొలి ప్రాధాన్యత: బోనాల ఉత్సవాలు ప్రారంభమయ్యేది వేప ఆకులు,పసుపు, కుంకుమ, వెలిగించిన దీపం అలంకరించబడిన కుండల్లోనే కొత్త బియ్యం, పాలు,బెల్లం వేసి నైవేద్యం వండి తొలి రోజుల్లో, కుమ్మరి సంఘం మహిళలు తయారుచేసిన తొలి బోనాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి,అమ్మవారికి సమర్పిస్తారన్నారు.గ్రామ దేవతలకు (పోచమ్మ, ఎల్లమ్మ) ఆనవాయితీగా సమర్పిస్తారు.

చారిత్రక నేపథ్యం: కుమ్మరి వృత్తి.

వనపర్తి కుమ్మరి సంఘం నాయకులు.

తెలంగాణ గ్రామ దేవతల సంస్కృతితో ముడిపడి ఉంది. ఆదిశక్తికి సమర్పించే ఈ నైవేద్యంలో మట్టి కుండ వాడటం ప్రకృతికి, సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుంది.

ఆచారాలు

ఈ తొలి బోనం సందర్భంగా కుమ్మరి కుటుంబాల సభ్యులు,గ్రామ పెద్దలు కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి,మొక్కులు చెల్లించుకుంటారు.ఈ బోనాల పండుగలో భాగమైన కుమ్మర్ల పాత్ర మన పూర్వీకుల జీవన విధానాన్ని, కులవృత్తుల గొప్పతనాన్ని చెప్పటానికి ఇదే నిదర్శనం అన్నారు.

గోల్కొండ, లష్కర్ బోనాల తయారీ విధానం,చాలా గొప్పగా ఉంటుందని కొనియాడారు.బోనాలు అమ్మవారిని పూజించే హిందువుల పండుగ.చెప్పుకోవచ్చు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కుమ్మరి సంఘం నాయకులు పాల్గొన్నారు.

# పెంచికలపేట గ్రామంలో ఘనంగా హరితహారం కార్యక్రమం

- పచ్చని చెట్లును నాటుదాం - ప్రాణవాయువును పొందుదాం.
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్ ఆధ్వర్యంలో.



**ఎల్కతుర్తి ప్రజావాణి న్యూస్:-**ఎల్కతుర్తి మండలంలోని పెంచికలపేట గ్రామంలో హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామంలో పచ్చదనాన్ని పెంపొం దించాలనే లక్ష్యంతో గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి, పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ముప్పు శైలజ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని తెలిపారు. హరితహారం కార్యక్రమాన్ని ప్రజలందరూ ఉద్యమంగా భావించి విజయవంతం చేయాలని, మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం గ్రామ ప్రజలకు మొక్కలను పంపిణీ చేసి గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.గ్రామస్థులు, యువత,మహిళలు ఉత్సాహంగా పాల్గొని హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా గ్రామమంతా పచ్చదన సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముప్పు శైలజ, ఉపసర్పంచ్ మర్రి అశోక్,గ్రామ కార్యదర్శి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్,వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు, మహిళలు,యువత,గ్రామ ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ఉప్పుసాక గ్రామపంచాయతీలో ఎస్ఐఆర్ పర్యవేక్షణ...

- ఎంపీడీవో జమలారెడ్డి ,సర్పంచ్ వర్ష మంగమ్మ,,ఉపసర్పంచ్ పొదెం సుధాకర్..





**బూర్గంపాడు మండలం (ప్రజావాణి )ప్రతినిధి జూలై16,.**ఎస్ ఐ ఆర్ పర్యవేక్షణలో భాగంగా బూర్గంపాడు మండలం ఉప్పు సాక గ్రామపంచాయతీని గురువారం ఎంపీడీవో జములారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జరుగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమం గురించి స్థానిక సర్పంచ్ వర్ష, మంగమ్మతో కలిసి సమీక్షించారు. అధికారులు సంబంధిత రికార్డులను తనిఖీ చేసి కార్యక్రమం యొక్క పురోగతి అమలు తీరును ఆరా తీశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిబంధనలకు అనుగుణంగా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రజలు అధికారులకు నిబద్ధతతో సహకరించాలన్నారు. గ్రామంలో వర్షాకాలం సమీపిస్తున్న వేళ పరిశుద్ధంపై స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శిని అడిగి సమస్యలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి వర్ష మంగమ్మ ఉపసర్పంచ్ పోదాం సుధాకర్, మాజీ సర్పంచ్ పాయం. వెంకటేశ్వర్లు, బూర్గంపాడు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వరుస లక్ష్మయ్య ,వార్డు మెంబర్లు కొరస వెంకటేశ్వర్లు, అజ్మీరా బాబురావు,బొల్లి రామకృష్ణ, మడకం మరుణ,ధరావత్ జానకి రాంబాబు, స్థానిక కార్యదర్శి సురేష్ ,ఎస్ ఐ ఆర్ సిబ్బంది, స్థానిక నాయకులు కొరస. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు


# ఇంద్రనగర్‌లో రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం

- మండల వ్యవసాయ అధికారి ఎం.రాజ్‌కుమార్
- వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. పున్నంచందర్.
- గ్రామ సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్.



**ఎల్కతుర్తి, ప్రజావాణి న్యూస్:-**హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ఇంద్రనగర్ గ్రామంలో రైతులకు వర్షాభావ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.మండల వ్యవసాయ అధికారి ఎం. రాజ్‌కుమార్,వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. పున్నంచందర్ పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు.ప్రస్తుతం ఎల్-నీనో ప్రభావం కారణంగా తగినంత వర్షపాతం లేకపోవడంతో అధిక నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని రైతులకు సూచించారు. కంది,పెసర,మినుము వంటి పప్పుధాన్యాలు, నువ్వులు,పొద్దుతిరుగుడు,ఆముదం వంటి నూనెగింజల పంటలు, అలాగే జొన్న,సజ్జ,రాగి వంటి చిరుధాన్యాలు, కూరగాయల పంటలను సాగు చేయడం ద్వారా మంచి దిగుబడులు సాధించే అవకాశం ఉందని వివరించారు.జూలై నెలాఖరు వరకు కంది, పెసర,మినుము,నువ్వులు, పొద్దుతిరుగుడు,ఆముదం వంటి పంటలను పట్టుకోవచ్చని, తక్కువ కాలపరిమితి గల వేరుశనగ రకాలను ఆగస్టు 15 వరకు సాగు చేయవచ్చని తెలిపారు. సజ్జ,రాగి వంటి చిరుధాన్యాల సాగును కూడా ఆగస్టు నెలలో చేపట్టవచ్చని రైతులకు సూచించారు.గ్రామ సర్పంచ్ అంబాల రాజ్‌కుమార్‌తో పాటు గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంథని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో డబ్బులు వసూలు.


OFFICE OF THE MEDICAL OFFICER COMMUNITY HEALTH CENTRE MANTHANI, DIST PEDDAPALLY

Medical Officer
Community Health Center
Manthani, Dist. Peddapally

**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.** మంథని మండలంలో గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సిహెచ్సి లోని ల్యాబ్లో రక్త పరీక్షల నిమిత్తం వెళ్లిన ప్రతి ఒక్కరు దగ్గర నుండి 20 రూపాయలు వసూలు చేయడం జరిగింది . ఈ విషయం గమనించిన పౌరసరమాచార సంక్షేమ సంఘం మంథని నియోజకవర్గం వైస్ ప్రెసిడెంట్ ఎలుక సదానందం వెంటనే హాస్పిటల్ సూపర్నెంట్ డాక్టర్ తో మాట్లాడడం జరిగింది ప్రభుత్వ ఆసుపత్రిలో డబ్బులు వసూలు చేయడం ఏంటని దానికి రసీదు ఇవ్వకపోవడం ఏంటని డాక్టర్ గారిని ప్రశ్నించగా ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని సమస్య పరిష్కారం చేస్తానని చెప్పి కలెక్టర్ గారితో మాట్లాడడం జరిగింది కలెక్టర్ గారు స్పందిస్తూ ఇంకో కొన్ని పరికరాలు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని సమస్య పరిష్కారం అవుతుందని చెప్పాడు

# బీఎస్పీ కార్యకర్త మరణం ఉద్యమానికి తీరని లోటు

- అడ్వకేట్ నిషాని రామచంద్రం ఛీఫ్ జోన్ ఇంచార్జి
- హుజురాబాద్ ఆస్పత్రికి కి భారీగా తరలి వచ్చిన పార్టీ శ్రేణులు
- పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లే ప్రశాంత్ గౌడ్
- డాక్టర్ అవార్డు గ్రహీతఅంబాల ప్రభు



**జమ్మికుంట జులై 16 (ప్రజావాణి)**బహుజన్ సమాజ్ పార్టీ లో పని చేస్తున్న సైదాపూర్ మండలం రామచంద్రాపూర్ గ్రామానికి చెందిన కొయ్యేడ మధు నిన్న రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా హుజురాబాద్ లోని సివిల్ ఆసుపత్రిలో పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లే ప్రశాంత్ గౌడ్ తో మరియూ పార్టీ నాయకులతో కలిసి అడ్వకేట్ నిషాని రామచంద్రం సివిల్ ఆసుపత్రి కి వచ్చి కార్యకర్త కుటుంబానికి ధైర్యం చెప్పి దహన సంస్కారాలకు పార్టీ కార్యకర్తల సహాయంతో పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.కార్యకర్త మరణ వార్త విని ఆసుపత్రి కి కుటుంబ సభ్యులు పార్టీ నాయకులు భారీగా తరలి వచ్చి కార్యకర్త కుటుంబానికి బాసట గా నిలబడినారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన అతడి కూతురు అక్షిత (8 సంవత్సరాలు) మెరుగైన చికిత్స కోసం వరంగల్ లోని ఎం జి ఎమ్ ఆసుపత్రికి తరలించారు. బీఎస్పీ ఛీఫ్ జోన్ ఇంచార్జ్ అడ్వకేట్ నిషాని రామచంద్రం ఎంజిఎం వైద్యుల తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మధు మరణానికి కారణమైన కడారి రాజశేఖర్ పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వాహనాల తనికి లో ఫైన్ వేసి చలాన్లు వసూలు చేసే పోలీసులు ఇన్సురెన్స్ కట్టించే విధంగా వాహన దారులకు కౌన్సిలింగ్ ఇవ్వాలని కోరినారు చింతల పల్లి గ్రామం లో గ్రామ పంచాయతీ నిబంధనలను ఉల్లంఘించి రోడ్డుపై గద్దెలు నిర్మించడం వలన ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పరామర్శ లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె ప్రశాంత్ గౌడ్ పార్లమెంట్ ఇంచార్జ్ దొడ్డే శ్రీనివాస్ జిల్లా కార్యదర్శి ఇల్లెందు రమేష్ హుజురాబాద్ అసెంబ్లీ ఇంచార్జి లు వేల్పుల మల్లేశం అంబాల ప్రభు హుస్నాబాద్ అసెంబ్లీ నియో జకవర్గ అధ్యక్షులు వేల్పుల రాజు హుజురాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు గిన్నారపు మహేందర్ అసెంబ్లీ కమిటీ ఉపాధ్యక్షులు కండె తిరుపతి మాజీ రాష్ట్ర కార్యదర్శి దొడ్డే సమ్మయ్య బోయిని బాబు మంద సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు

# మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ నూతన మండల కమిటీ ఎన్నిక



**చిలుకూరు జూలై 16(ప్రజావాణి ):** సూర్యాపేట జిల్లా మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ విస్తరణలో భాగంగా జిల్లాలోని వివిధ మండలాల నూతన మండల అధ్యక్షులు, కార్యదర్శుల ఎన్నిక ప్రక్రియలో భాగంగా గురువారం చిలుకూరు మండల కేంద్రం సిపిఐ ఆడిటోరియంలో చిలుకూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులుగా బోరెడ్డి నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా షేక్.నాగుల్ మీరా, కోశాధికారిగా అమరగాని ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా పిల్లి శివ లను, మండల సీనియర్ కబడ్డీ క్రీడాకారుల సమక్షంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికకు సహకరించినటువంటి సూర్యాపేట జిల్లా మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ కి,సీనియర్ క్రీడాకారులకు,తోటి క్రీడాకారులకు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మోర్తాల నాగిరెడ్డి, సూర్యాపేట జిల్లా మోడ్రన్ కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి భాస్కర విజయ్ కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి, మాతంగి మట్టయ్య, సూర్యాపేట జిల్లా ప్రైవేట్ వ్యాయామ ఉపాధ్యాయులు, పి ఈ టి అసోసియేషన్ అధ్యక్షులు, షేక్, పాషా, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు పిండిప్రోలు లక్ష్మయ్య, సురేష్, సందీప్, సీనియర్ కబడ్డీ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# సమస్యల్లో గిరిజన సంక్షేమ హాస్టళ్లు ల్లో విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు

- అధికారలు పర్యవేక్షణ లేక కొందరు విద్యార్థులు ప్రాణాలు పోయేలా చర్యలు
- విద్యార్థులు చదువు తో పాటు వారి సమస్యలు తెలుసు కొనే ప్రయత్నము టీచర్స్ చేయరా ?
- మెలియా పుట్టి లోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని ఆత్మ హత్య సంఘటపై ప్రజాసంఘాలు ఆగ్రహము
- విద్యార్థిని ఆత్మ అత్య కు కారణం అయిన టీచర్ రాజీ పద్దతుల్లో ఉన్నారు ..
- బాధిత విద్యార్థి తల్లీ తండ్రులు తో రాజీ మనీ సంతకాలు చేయించుకున్న టీచర్ అనుకూల వర్గాలు

**పలాస ప్రజావాణి ప్రతినిధి** శ్రీకాకుళం జిల్లాలో నీ మెలియా పుట్టి మండలములోని గిరిజన ఆశ్రమ పాఠశాల లో చదువుతున్న విద్యార్థి ఆత్మ హత్య సంఘటపై ఇక్కడ ప్రజలు చర్చ జరుగుతుంది. ఆశ్రమ పాఠశాలలో సవర నవ్య శ్రీ అనుమాన స్పదంగా ఆత్మ హత్య సంఘటపై ఇక్కడ చర్చ జరుగుతుంది. సంఘటన జరిగిన తర్వాత బాధితురాలు ఇంటికి వెళ్లి అదే నేర ఆరోపణ కు సంబంధించిన టీచరు కు అనుకూలంగా ఉండే విదంగా విద్యార్థి ఆత్మ హత్య సంఘటపై పెద్ద చర్చ జరుగుతుంది. గిరిజన విద్యార్థి ఆత్మ హత్య సంఘటపై ప్రజా సంఘాలు ఆగ్రహము వ్యక్తము చేస్తున్నారు..ఈ సంఘటనకు సంబంధించి బాధిత కుటుంబానికి టీచర్ రాజీ మనీ సంతకాలు తో కేసు మాయ చేస్తున్నారని పలువురు ఆరోపణలున్నాయి.జిల్లాలో గిరిజన సంక్షేమ పాఠశాలలు సీతంపేట ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్నాయి. 47 ఆశ్రమ పాఠశాలలు, 12 గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 102 మంది కుక్‌లు, కమాటీలు గత పదేళ్లుగా పనిచేస్తున్నారు. అప్పట్లో సిబ్బంది నియామకం చేపట్టకపోవడంతో వార్డెన్లు సొంత డబ్బులతో పాటు హాస్టల్ నిర్వహణలో వచ్చే వి కొద్దిమొత్తం జీతానికి వీరిని నియమించుకున్నారు. ఒక్కొక్కరికీ నెలకు రూ.5 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారని తెలిసింది...

ఐటీడీఏ అధికారులు మెలియా పుట్టి మండలములోని గిరిజన విద్యార్థి సంఘటనకు సంబంధించి నిజాలను బయటకు తేవాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు.










# కోటగిరిలో ఉచిత కంటి,జనరల్ వైద్య శిబిరం



**కోటగిరి/ప్రజావాణి:-**కోటగిరి మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ బర్ల మధుకర్ అధ్యక్షతన లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ సౌజన్యంతో లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని, లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి ఆధ్వర్యంలో ఉచిత కంటి,జనరల్ వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ శిబిరంలో నిష్ణాతులైన వైద్యులు ప్రజలకు కంటి, జనరల్ పరీక్షలు నిర్వహించారు. నార్మల్ సమస్య ఉన్నవారికి ఉచితంగా మందులు పంపిణీ చేసి తీవ్ర సమస్య ఉన్నవారికి లైన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ నందు సంప్రదించాలని కోరారు. ఈ సందర్భంగా బర్ల మధుకర్ మాట్లాడుతూ. పేద,మధ్య తరగతి ప్రజలు కార్పోరేట్ ఆసుపత్రిలో వైద్యం చేసుకోవడం సాధ్యపడదనీ. అందుకే ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు గ్రామ స్థాయి నిరుపేదలకు ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ఈ ఉచిత కంటి,జనరల్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన లయన్స్ జనరల్ బోధన్ ఆసుపత్రి వారికి సర్పంచ్ బర్ల మధుకర్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో గంగాధర్,ఎస్సై శ్రీనివాస్,ఎంపీడీవో విష్ణు,సూపర్డెంట్ శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ అలీన తఫీన్,మాజీ ఎంపిటిసి కొట్టం మనోహర్, వార్డు సభ్యులు లయన్స్ క్లబ్ ఆఫ్ భవాని జి.ఈ.టి లయన్స్ పల్లెంపాటి శ్రీధర్,ఆర్.సి తన్నీరు సుబ్బారావు, ఆర్.ఎస్ పావులూరి వెంకటేశ్వర రావు, డీ.సీ.ఏం.సాయిబాబా,లయన్స్ క్లబ్ ఆఫ్ కోటగిరి జె.సి.వై.జానకి రావు,అధ్యక్షులు ఎన్.సాయి శ్రీనివాస్,లయన్స్ హనుమం త రావు,డా.విక్రమ్ జనరల్ మెడిసిన్, డా.యశస్విని ఎంబీబీఎస్,డా.అజయ్ ఆప్తామాలిస్టు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# కొత్త భవనాలకు పాత బేస్‌మెంట్ రాయి..!

- మహిళా శక్తి భవనాల నిర్మాణాలపై నాణ్యత లోపం
- తెర్పోల్‌లో పాత మెటీరియల్ వినియోగంపై ఆరోపణలు





ప్రభుత్వం మహిళల సాధికారత కోసం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో నిర్మిస్తున్న డ్వాక్రా మహిళా శక్తి భవనాల నిర్మాణ పనుల్లో పాత మెటీరియల్ వినియోగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామంలోని స్కూల్ వద్ద తొలగించిన పాత బేస్‌మెంట్ రాళ్లను కొత్తగా నిర్మిస్తున్న మహిళా శక్తి భవనాలకు ఉపయోగిస్తున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న కొత్త నిర్మాణాల్లో నాణ్యమైన, నిబంధనలకు అనుగుణమైన నిర్మాణ సామగ్రి వినియోగించాల్సి ఉండగా, పాత రాళ్లను వినియోగించడం ఎంతవరకు సమంజసమని వారు నిలదీస్తున్నారు. తెర్పోల్ గ్రామంలోనే కాకుండా మండలంలోని మరికొన్ని గ్రామాల్లో కొత్త ప్రభుత్వ భవనాల నిర్మాణాల్లో పాత మెటీరియల్ వినియోగిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయని సమాచారం. దీంతో నిర్మాణాల నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ అంశంపై సంబంధిత ఇంజినీరింగ్, గ్రామీణాభివృద్ధి అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, నిర్మాణ పనులను పరిశీలించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న భవనాలు దీర్ఘకాలం ప్రజలకు ఉపయోగపడేలా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఈరోజు నాగ పెల్లిలో SIR కార్యక్రమం



**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.** మంథని మండలం నాగపల్లి గ్రామంలో ఈరోజు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి షెగ్గం రాజేష్ ఆధ్వర్యంలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమం పూర్తి చేసుకున్న సందర్భంగా నాగ పెల్లి బి ఎల్ఓ కాజీపేట రాజమల్లును శాలువాతో సన్మానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ సతీష్ అనిల్ రెడ్డి కుమార్ ఆకాష్ సతీష్ రవి గోవర్ధన్ రెడ్డి లక్ష్మారెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారుద

## మండల అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య అధ్యక్షతన టీడీపీ విస్తృతస్థాయి సమావేశం - సర్, రోడ్లపై కీలక తీర్మానాలు



**పెనుగంచిప్రోలు జులై 16 మన ప్రజావాణి** మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల వెంకట సీతారామయ్య/అధ్యక్షతన మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశం పెనుగంచిప్రోలు పాత సినిమా హాల్ సెంటర్ లోని ఆర్ కే ఫంక్షన్ హాల్ నందు ఘనంగా నిర్వహించబడింది. సమావేశంలో చింతల వెంకట సీతారామయ్య మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకే ఈ విస్తృతస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు !తెలిపారు. జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీ రామ్ రాజగోపాల్ తాతయ్య నాయకత్వంలో మండలంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు.

సీతారామయ్య ఆధ్వర్యంలో ఆమోదించిన ముఖ్య తీర్మానాలు

1. సర్ పనులు:మండలంలో సర్ పనులు సుమారు 98% పూర్తయ్యాయని, మిగిలిన పెండింగ్ పనులకు గడువు పొడిగించి వెంటనే పూర్తి చేయాలని తీర్మానించారు.
2. రోడ్ల పునరుద్ధరణ:2024–25 వరదలతో దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ తీర్మానం చేశారు.

పెనుగంచిప్రోలు – పాత వేమవరం రోడ్డు

– పెనుగంచిప్రోలు – వయా ముచ్చింతల – తాళ్లూరు రోడ్డు

పెనుగంచిప్రోలు – వయా అనిగండ్లపాడు – శివాపురం రోడ్డు

పెనుగంచిప్రోలు – వయా అనిగండ్లపాడు – గుమ్మడిదూరు రోడ్డు

ఈ సందర్భంగా చింతల వెంకట సీతారామయ్య మాట్లాడుతూ, “మండలంలో ఎలాంటి సమస్య ఉన్నా సరే మనం అందరం కలిసి పరిష్కరిస్తాం. కార్యకర్తలు ప్రతి గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీని, ప్రభుత్వాన్ని బలోపేతం చేయాలి” అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని చింతల వెంకట సీతారామయ్య నాయకత్వానికి మద్దతు తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రత పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన జీవనం

- బాలవికాస ఆధ్వర్యంలో ఆదిత్యఅమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల సహకారంతో పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం
- పెద్దంపల్లి గ్రామసర్పంచ్ పద్మ కుమార్
- జమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన ప్రతి మహిళ ఆరోగ్యంపై అవగాహన

**జమ్మికుంట జూలై 16 (ప్రజావాణి)**జమ్మికుంట మండలం పెద్దంపల్లి గ్రామంలో బాలవికాస ఆధ్వర్యంలో ఆదిత్యఅమృత మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల సహకారంతో గురువారం పాఠశాల ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారుఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎగితపద్మ-కుమార్. హాజరయ్యారుఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటిస్తూ పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యవంతమైన జీవితం గడపవచ్చని అన్నారు వ్యాధులు రాకముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆహారపు అలవాట్లలో చిన్నచిన్న మార్పులు చేసుకోవడం ద్వారా అనేక రోగాలను నివారించవచ్చని సూచించారు శిబిరంలో ఆదిత్య అమృత ఆసుపత్రి వైద్య బృందం సుమారు 200 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి రూ.55 వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేసింది. గ్రామానికి విచ్చేసిన స్పెషలిస్ట్ వైద్యులను సర్పంచ్ ఘనంగా సన్మానించారుప్రముఖ వైద్యులు డాక్టర్ భరత్ డాక్టర్ శ్రీనివాస్ డాక్టర్ మహిపాల్ మాట్లాడుతూ సమతుల్య ఆహారం తీసుకోవాలనిసూచించారు బియ్యం రవ్వ మైదా చక్కెర వంటి తెల్లటి ఆహార పదార్థాల వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని కోరారుఅధిక కార్బోహైడ్రేట్లు తీసుకోవడం వల్ల ఊబకాయం పెరిగి మధుమేహం రక్తపోటు గుండె కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం అధికమవుతుందని హెచ్చరించారు. ప్రతిరోజూ నడకతో పాటు గ్రామాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యాయామశాలలను వినియోగించుకోవాలని సూచించారుజమ్మికుంట బాలవికాస సెంటర్ మేనేజర్ పబ్బు సులోచన మాట్లాడుతూ ప్రతి మహిళ ఆరోగ్యంపై అవగాహన పెంపొందించుకుని వంటింటినే ఆరోగ్యశాలగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. బాలవికాస పరిధిలోని 14 సెంటర్లకు చెందిన 180 గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ దాదాపు రూ.2 కోట్ల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో ఈ సేవా కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బాలవికాస కోఆర్డినేటర్ ఆసియా ఉపసర్పంచ్ దొడ్డే నాగరాజు పాలకవర్గ సభ్యులు ఎం రాజయ్య డి ప్రవళిక డి తిరుమల ఎం. రాజేష్ డి లావణ్య కే గణపతి రెడ్డి పి అఖిల బాలవికాస విలేజ్ లీడర్ పి. రమ, ఆదిత్య-అమృత ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ దేవేందర్ రెడ్డి పీఆర్‌వోలు రఫిక్ దుర్గాప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది అనిల్ రావు మహేష్ శ్రావణ్ సంతోషిని పూజ శ్రావ్య సుమలతతో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు








# దాతల విరాళాలతో అభివృద్ధి... ప్రచారం మాత్రం సొంత నిధులదేనా?

- గ్రామాభివృద్ధి పేరిట ప్రచార ఆర్భాటంపై విమర్శలు
- విరాళాలు, ప్రభుత్వ నిధుల వినియోగంపై పారదర్శకత కోరుతున్న గ్రామస్థులు

**కొండాపూర్, జూలై 16 (ప్రజావాణి):**మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో గ్రామాభివృద్ధి పనుల నిర్వహణ, వాటిపై జరుగుతున్న ప్రచారం ప్రస్తుతం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. గ్రామంలో పరిశ్రమలు, వెంచర్లు ఏర్పడటంతో ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు భూస్వాములు, దాతలు గ్రామాభివృద్ధి కోసం స్వచ్ఛందంగా విరాళాలు అందిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే, దాతల సహకారంతో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజాప్రతినిధి తన సొంత నిధులతో నిర్వహించిన పనులుగా సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం చేసుకుంటున్నారనే ఆరోపణలు గ్రామస్థుల నుంచి వినిపిస్తున్నాయి. మరోవైపు, కొన్ని పనులకు ప్రభుత్వ నిధుల ద్వారా బిల్లులు సమర్పిస్తున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీంతో గ్రామాభివృద్ధి పనులపై పూర్తి పారదర్శకత అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, తాగునీటి బోర్లు, రహదారుల అభివృద్ధి వంటి పలు కార్యక్రమాలు దాతల సహకారంతో జరిగాయని, అయితే వాటిని వ్యక్తిగత ఖర్చులతో చేపట్టినట్లుగా ప్రచారం చేస్తున్నారని గ్రామస్థులు పేర్కొంటున్నారు. గతంలో ప్రభుత్వ భూమిలో మైనింగ్ అనుమతులతో మట్టి తరలింపుపై అధికారులకు ఫిర్యాదులు చేసిన అనంతరం, గ్రామాభివృద్ధి పేరుతో మైనింగ్ నిర్వాహకుల సహకారంతో కొన్ని ఫార్మేషన్ రోడ్లు ఉచితంగా వేయించుకుని, వాటిని కూడా తన సొంత నిధులతో నిర్మించినట్లుగా ప్రచారం చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో గ్రామ శివారులోని ప్రభుత్వ భూమి నుంచి రైతులు తమ పొలాలకు దారులు ఏర్పాటు చేసుకోవడానికి లేదా ఇళ్ల నిర్మాణ అవసరాల కోసం మట్టి తీసుకెళ్లాలన్నా తన అనుమతి తప్పనిసరి అన్నట్లుగా ప్రజాప్రతినిధి వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఇది అధికారిక విధానాలకు విరుద్ధమని కొందరు గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల సమయంలో “ప్రభుత్వ నిధులు వచ్చినా రాకపోయినా సొంతంగా గ్రామాన్ని అభివృద్ధి చేస్తాను” అని హామీ ఇచ్చిన ప్రజాప్రతినిధి, ప్రస్తుతం దాతల విరాళాలతో లేదా ప్రభుత్వ నిధులతో జరుగుతున్న పనులను వ్యక్తిగతంగా చేపట్టినట్లుగా ప్రచారం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. “గ్రామాభివృద్ధికి ప్రభుత్వ నిధులు, దాతల విరాళాలు వినియోగించడం స్వాగతించదగ్గ విషయమే. అయితే ఇతరుల సహకారంతో జరిగిన పనులను సొంత నిధులతో చేసినట్లుగా ప్రచారం చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే అవకాశముంది. గ్రామాభివృద్ధికి వచ్చిన ప్రతి రూపాయి, దాని వ్యయం గురించి పూర్తి వివరాలను ప్రజలకు వెల్లడించాలి” అని పలువురు గ్రామస్థులు కోరుతున్నారు. ఈ ఆరోపణలపై సంబంధిత ప్రజాప్రతినిధి, గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు. అలాగే గ్రామాభివృద్ధి పనుల నిధుల సమీకరణ, వ్యయం, అమలుపై సంబంధిత అధికారులు అవసరమైతే విచారణ చేపట్టి పూర్తి పారదర్శకతను నిర్ధారించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



శుక్రవారం ,
జూలై 17, 2026
మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ



# 'యమదూతలుగా' మారిన నకిలీ వైద్యులు..?

- షాబాద్‌లో ఆర్ఎంపీల ఆగడాలపై తీవ్ర ఆరోపణలు
- అర్హతలకు మించి వైద్యం.. ప్రజల ప్రాణాలతో చెలగాటం చేస్తున్నారనే విమర్శలు
- ప్రైవేట్ ఆస్పత్రులతో కమీషన్ల దందా సాగుతోందన్న ఆరోపణలు.. అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు







**షాబాద్// జులై 16 (మన ప్రజావాణి)**మండలంలో కొంతమంది ఆర్ఎంపీలు (ఆర్ ఎం పి )లు నిబంధనలకు విరుద్ధంగా వైద్య సేవలు అందిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ప్రాథమిక చికిత్సకే పరిమితమవాల్సిన వారు తమ క్లినిక్‌లలో సెలైన్లు ఎక్కించడం, ఇంజెక్షన్లు ఇవ్వడం, అధిక మోతాదులో యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్ వినియోగించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్య సదుపాయాల లేమిని ఆసరాగా చేసుకుని కొందరు ఆర్ఎంపీలు కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో వైద్యం చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జ్వరం, జలుబు వంటి సాధారణ సమస్యలతో వచ్చే రోగులకు కూడా పరీక్షలు లేకుండానే బలమైన మందులు ఇవ్వడం వల్ల వారి ఆరోగ్యం మరింత దెబ్బతింటోందని చెబుతున్నారు. అంతేకాకుండా, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులకు సరైన పరీక్షలు లేకుండానే మందులు సూచించడం వల్ల కిడ్నీలు, లివర్ వంటి అవయవాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా, కొందరు ఆర్ఎంపీలకు హైదరాబాద్‌లోని కొన్ని ప్రైవేట్ ఆస్పత్రులతో సంబంధాలు ఉన్నాయని, రోగుల పరిస్థితి విషమించిన తర్వాత కమీషన్ల కోసం నిర్దిష్ట ఆస్పత్రులకే పంపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో పేద కుటుంబాలు భారీ వైద్య ఖర్చులతో అప్పుల పాలవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఆరోపణలు వస్తున్నప్పటికీ సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులు తగిన తనిఖీలు నిర్వహించడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న క్లినిక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులకు నూతన దరఖాస్తుల స్వీకరణ

- పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి



**తొర్రూర్ జూలై 16(ప్రజావాణి)** పాలకుర్తి నియోజకవర్గం పరిధిలో,ఉచిత కంప్యూటర్ శిక్షణ కోసం నిరుద్యోగుల నుండి నూతన దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని ఝాన్సీ రెడ్డి తెలిపారు. గురువారం పత్రిక ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతంలో ఉన్న పేద నిరుద్యోగ యువత కోసం తన జీతం తో, ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను గత కొద్ది రోజుల నుండి, అందించడం జరుగుతుందని ఆమె తెలిపారు. మొదటి బ్యాచి శిక్షణ పూర్తిచేసిన యువతి యువకులకు సర్టిఫికెట్లు అందజేయడం జరిగిందన్నారు. అదేవిధంగా నిరుద్యోగ యువత కోసం నూతన దరఖాస్తులను స్వీకరించుటకు తేదీ జూలై 17వ నుండి 21 వరకు, గడువు విధించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. కావున , కంప్యూటర్ విద్యను నేర్చుకోవాలనే తపన ఉన్న నిరుద్యోగ యువతీ యువకులు, తొర్రూరు కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో, వారి యొక్క దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. ఈ కంప్యూటర్ విద్య శిక్షణకు విద్యా అర్హతలు పదవ తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న యువతి యువకులు , దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అదేవిధంగా పాలకుర్తి నియోజకవర్గం పరిధిలో ఉన్న గ్రామాల విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# అనఘాపురి కాలనీ పార్కు స్థలాన్ని కాపాడాలని

- కాలనీ సంక్షేమ సంఘం -- హైడ్రా కు వినతిపత్రం
- అధికారులు కట్టుదిట్టమైన చర్యలు.



**మేడిపల్లి జూలై 16 (మన ప్రజావాణి)** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ని అనఘాపురి కాలనీ ఏర్పడిన నాటి నుండి 92 సర్వే నంబర్ లేఔట్‌లో గల 498 గజాల పార్కు స్థలాన్ని కొందరు ఆక్రమణదారులు ఆక్రమించేందుకు పలుమార్లు ప్రయత్నించారు. 2014 సంవత్సరంలో అప్పటి కాలనీ సంక్షేమ సంఘం గ్రామపంచాయతీ నుండి ఆర్‌టీఐ ద్వారా పార్కు స్థలానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి,అప్పటి నుండి ఆ స్థలాన్ని కాలనీ కార్యక్రమాలకు వినియోగిస్తూ సంరక్షిస్తున్నారు. 2024 సంవత్సరంలో మరోసారి ఆక్రమణదారులు పార్కు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా,అప్పటి అధ్యక్షుడు దాచేపల్లి నాగరాజు,కాలనీ సభ్యులు కలిసి మున్సిపల్ అధికారులను,ఆర్డీఓ కార్యాలయం,కలెక్టర్ కార్యాలయం,హైడ్రా అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు.మున్సిపల్ అధికారుల సహకారంతో ఆక్రమణకు సంబంధించిన పనులను నిలిపివే యించారు.మళ్లీ 2026 సంవత్సరంలో ఆక్రమణదారులు పార్కు స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించగా,ప్రస్తుతం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రావుల శ్రీనివాస్ రెడ్డి,సభ్యులతో కలిసి జీహెచ్ఎంసీ అధికారులు,హైడ్రా కమిషనర్ రంగనాథ్ ని కలిసి వినతిపత్రం సమర్పించారు.గురువారం నాడు హైడ్రా అధికారులు అనఘాపురి కాలనీలోని 92 సర్వే నంబర్‌లో గల 498 గజాల పార్కు స్థలాన్ని పరిశీలించి, భవిష్యత్తులో ఎటువంటి అక్రమ ఆక్రమణలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు.

# శోభాయమానంగా జగన్నాథుని రథయాత్ర

- ఇస్నాపూర్‌లో మారుమోగిన జగన్నాథ నామస్మరణ
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం.. ఘనంగా అన్నదాన కార్యక్రమం



**ఇస్నాపూర్, జూలై 16 (ప్రజావాణి):**ఇస్నాపూర్‌లో గురువారం శ్రీ జగన్నాథ స్వామివారి రథయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. జగన్నాథుని నామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగగా, స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ఒడిశా రాష్ట్రానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని రథయాత్రలో పాల్గొన్నారు. ప్రతి ఏడాది నిర్వహించే ఈ రథయాత్రకు ఈసారి కూడా విశేష స్పందన లభించింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం జగన్నాథ స్వామివారి రథాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో లాగుతూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. దేవస్థానం నుంచి జాతీయ రహదారి వరకు సాగిన రథయాత్ర భక్తుల గోవింద నామస్మరణల మధ్య శోభాయమానంగా కొనసాగి, తిరిగి ఆలయానికి చేరుకోవడంతో ముగిసింది. రథయాత్ర సందర్భంగా పలువురు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవస్థానం కమిటీ సభ్యులు తాగునీరు, వైద్యసేవలు, ఇతర మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేశారు. అనంతరం వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమం ప్రశాంతంగా జరిగేందుకు పటాన్‌చెరు పోలీసులు విస్తృత బందోబస్తు ఏర్పాటు చేసి, ట్రాఫిక్ నియంత్రణతో పాటు భక్తుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జగన్నాథుని రథయాత్రను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరుకావడంతో ఇస్నాపూర్ ప్రాంతం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది.

# పోచమ్మ గుడిలో చేతి బోరు ప్రారంభం



**మన ప్రజావాణి మందమర్రి:- జూలై 16**పట్టణంలోని 24వ వార్డు పోచమ్మ గుడి దేవాలయంలో నెలకొన్న నీటి సమస్యకు పరిష్కరించి ఎందుకు గురువారం ఆలయ ప్రాంగణంలో కొత్త చేతి బోరును ఏర్పాటు చేసి, ప్రారంభించారు. ఈకార్యక్రమానికి అఖిల భారత యాదవ మహాసభ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి సదానందం యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై, బోరును ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆలయంలో నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ స్థానిక మహిళలు తమ దృష్టికి తీసుకురాగా, సమస్యను రాష్ట్ర కార్మిక, మైనింగ్, ఉపాధి కల్పన శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ల దృష్టికి తీసుకు పోవడంతో వారు స్పందించి సంబంధిత మున్సిపల్ అధికారులతో మాట్లాడి, బోరు వేయించారని, దీంతో ఆలయంలోని నీటి సమస్య పూర్తిగా తీరిందని, వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర మంత్రి, స్థానిక ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి చెన్నూరు నియోజకవర్గంలో గతంలో ఏ నాయకుడు చేయని విధంగా అభివృద్ధి చేస్తున్నారని కొనియాడారు. ప్రతి వార్డులో మార్నింగ్ వాక్ చేస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుని, వెంటనే అధికారులకు ఫోన్ చేసి పరిష్కరిస్తున్నారన్నారు. అదేవిధంగా పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పెద్దపల్లి నియోజకవర్గంలో రైల్వే బ్రిడ్జిలు, రైళ్ల సౌకర్యాలతో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిద్దుతున్నారని తెలిపారు. తండ్రి-కొడుకుల నాయకత్వంలో చెన్నూరు, పెద్దపల్లి నియోజకవర్గాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వార్డు ప్రజలు మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీ వంశీకృష్ణ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ పైడిమల్ల నర్సింగ్, దుర్గం ప్రభాకర్, నాగుల దుర్గయ్య, సత్తన్న తోటరాజు, అందెల రాజన్న, సంజీవ్, విజయ్ తో పాటు 24వ వార్డు ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

# ఉద్యమకారులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి



**మన ప్రజావాణి మంథని ప్రతినిధి.** మంథని మండలం కన్నా ల గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులు కేకే కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఉమ్మడి కరీంనగర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల నుండి తెలంగాణ ఉద్యమకారులు మేనిఫెస్టో పెట్టిన విధంగా 250 గజాల స్థలాన్ని మరియు పెన్షన్ ఉచిత బస్సు సౌకర్యం హెల్త్ కార్డులు జారీ చేయాలని ఉమ్మడి జిల్లా ఉద్యమకారులు ముక్తకంఠంతో కేకే కమిటీకి చెప్పడం జరిగిందని అన్నారు

# జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు

- స్టేషన్ మాస్టర్‌ను సస్పెండ్ చేయాలని రైల్వే శాఖ అధికారులతో పాటు రైల్వే మంత్రికి ఫిర్యాదు
- స్టేషన్ మాస్టర్ నిర్లక్ష్యం ప్లాట్‌ఫారాల మధ్య పరుగులు తీసిన ప్రయాణికులు






**జమ్మికుంట జూలై 16 (ప్రజావాణి)**జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ నిర్లక్ష్య వైఖరి కారణంగా గురువారం ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సికింద్రాబాద్‌కు వెళ్లే భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ సాధారణంగా రెండో నంబర్ ప్లాట్‌ఫారంపైకి వస్తుండగా రైలు రాకకు సుమారు పది నిమిషాల ముందు స్టేషన్ మాస్టర్ పొరపాటున మొదటి నంబర్ ప్లాట్‌ఫారంపైకి వస్తుందని అనౌన్స్‌మెంట్ చేశారుదీంతో మహిళలు వృద్ధులు చిన్నారులతో పాటు పలువురు ప్రయాణికులు సామాన్లు మోసుకుంటూ హడావుడిగా మొదటి ప్లాట్‌ఫారానికి పరుగులు తీశారుఅందరూ మొదటి ప్లాట్‌ఫారానికిచేరుకున్న తర్వాత మరోసారి అనౌన్స్‌మెంట్ చేస్తూ రైలు రెండో నంబర్ ప్లాట్‌ఫారంపైనే వస్తుందని ప్రకటించారుదీంతో ప్రయాణికులు తిరిగి రెండో ప్లాట్‌ఫారానికి పరుగులు పెట్టాల్సి వచ్చిందిఈ గందరగోళం కారణంగా సుమారు 15 నిమిషాల పాటు ప్రయాణికులు తీవ్ర ఆందోళన అవస్థలు ఎదుర్కొన్నారుస్టేషన్ మాస్టర్ నిర్లక్ష్యం వల్ల వృద్ధులు మహిళలు చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత స్టేషన్ మాస్టర్‌ను సస్పెండ్ చేయాలని రైల్వే శాఖ అధికారులతో పాటు రైల్వే మంత్రికి ఫిర్యాదు చేసినట్లు ప్రయాణికులు తెలిపారు

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణను సద్వినియోగం చేసుకోవాలి: ఐలాపూర్ మాణిక్ యాదవ్





**అమీన్‌పూర్, జూలై 16 (ప్రజావాణి):**భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అమీన్‌పూర్ మండలంలోని ఐలాపూర్ తాండ పోలింగ్ స్టేషన్‌లో గురువారం ఐలాపూర్ మాణిక్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో (బీఎల్వోలు) మాట్లాడి కార్యక్రమం అమలు తీరును తెలుసుకున్నారు. ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, పూర్తి చేసిన ఫారాల స్వీకరణ, ఓటర్ల వివరాల ధృవీకరణ, కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పులు, ఇతర సవరణలు వంటి ప్రక్రియలను పరిశీలించారు. కార్యక్రమం ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పకడ్బందీగా కొనసాగుతోందని బీఎల్వోలు వివరించారు. ఐలాపూర్ తాండలో ఓటర్ల నుంచి మంచి స్పందన లభిస్తోందని, రోజురోజుకు ఫారాల సమర్పణ శాతం పెరుగుతోందని, అర్హులైన ఒక్క ఓటరు కూడా మిగిలిపోకుండా ప్రతి ఇంటిని సందర్శిస్తూ అవగాహన కల్పిస్తున్నామని వారు తెలిపారు.
ఈ సందర్భంగా ఐలాపూర్ మాణిక్ యాదవ్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపులు వంటి అంశాలకు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం మంచి అవకాశమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోపు ఎన్యూమరేషన్ ఫారాన్ని పూర్తి చేసి సంబంధిత బీఎల్వోకు అందజేసి తమ ఓటరు వివరాలను సరిచేసుకోవాలని కోరారు.
ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు అని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో ప్రతి ఓటరి భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. యువ ఓటర్లు, మహిళలు, ఇటీవల నివాసం మార్చుకున్న వారు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో బీఎల్వోలు, స్థానిక ప్రజలు, ఓటర్లు పాల్గొన్నారు.

# తొలి ఏకాదశి రోజున జనరల్ సెలవు ప్రకటించాలి



**రాయికల్;జూలై 16(ప్రజావాణి):**ఈనెల 25వ తేదీన వచ్చే తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించ తలపెట్టిన మూడు రోజుల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని వాయిదా వేయడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా జనరల్ హాలిడే ప్రకటించాలని తెలంగాణ యాదవ మహాసభ ఉద్యోగుల సంఘం రాష్ట్ర శాఖ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి రాష్ట్ర శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. తొలి ఏకాదశి రోజున లక్షలాది మంది హిందూ భక్తులు ఉపవాస దీక్షలు ఆచరిస్తూ శ్రీ మహావిష్ణువు, శ్రీ మహాదేవుడు, శ్రీ శక్తి మాతలను భక్తిశ్రద్ధలతో ఆరాధిస్తారని, రాష్ట్రవ్యాప్తంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇలాంటి పవిత్రమైన రోజున ఉపాధ్యాయుల శిక్షణ నిర్వహించడం వల్ల వేలాది మంది ఉపాధ్యాయులు తమ మతాచారాలు, కుటుంబ సంప్రదాయాలను పాటించలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో ఈనెల 16న శ్రీ పూరి జగన్నాథ రథయాత్ర సందర్భంగా కూడా శిక్షణ కార్యక్రమాలను వాయిదా వేయాలని వినతిపత్రం ఇచ్చినా ప్రభుత్వం స్పందించలేదని, దీంతో అనేక మంది ఉపాధ్యాయులు తమ ఆరాధ్య దైవాన్ని దర్శించుకునే అవకాశాన్ని కోల్పోయారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో జూలై 25న గల ఉపాధ్యాయుల శిక్షణను వాయిదా వేసి అనుకూలమైన తేదీల్లో నిర్వహించాలని, తొలి ఏకాదశి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జనరల్ హాలిడే ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ వినతిపత్రం ప్రతులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి, పాఠశాల విద్యా సంచాలకులు, యస్.సి.ఈ.ఆర్.టి డైరెక్టర్‌కు కూడా పంపినట్లు వేల్పుల స్వామి యాదవ్ తెలిపారు.

## కమాన్ చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు

● బొంకూరి కైలాసం విజ్ఞప్తికి అధికారుల సానుకూల స్పందన



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, జూలై 16** పెద్దపల్లి పట్టణంలోని కమాన్ చౌరస్తా వద్ద తరచూ చోటుచేసుకుంటున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు స్థానిక మహనీయుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త బొంకూరి కైలాసం చేసిన విజ్ఞప్తికి అధికారులు సానుకూలంగా స్పందించారు. ఆర్ అండ్ బి (ర్ బి ) శాఖ, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో కమాన్ చౌరస్తాలో స్పీడ్ బ్రేకర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బొంకూరి కైలాసం మాట్లాడుతూ, వాహనాలు అధిక వేగంతో ప్రయాణించడం వల్ల ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. తమ విజ్ఞప్తిని వెంటనే పరిగణనలోకి తీసుకుని చర్యలు చేపట్టిన ఆర్ అండ్ బి అధికారులకు, ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. స్థానికులు కూడా స్పీడ్ బ్రేకర్ ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తూ, దీంతో ప్రమాదాల తీవ్రత తగ్గి పాదచారులు, వాహనదారులకు మరింత భద్రత కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధికారులు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, అధిక వేగంతో కాకుండా నిర్ణీత వేగ పరిమితిలోనే వాహనాలు నడపాలని సూచించారు.

## పుదిపట్ల లో చెత్త నుండి సంపద కేంద్రం ను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపిడిఓ



**మన ప్రజావాణి చౌడేపల్లి, జూలై 16:** మండలంలోని పుదిపట్ల గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద కేంద్రాన్ని డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ గురువారం పరిశీలించారు. ఉదయం క్లాప్ మిత్రలు నిర్వహిస్తున్న ఇంటింటి చెత్త సేకరణ (డోర్ టూ డోర్) కార్యక్రమాన్ని పరిశీలించిన ఆయన, అనంతరం చెత్త నుంచి సంపద కేంద్రాన్ని సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన ఎన్‌ఏడీఏపీ తొట్టెలు, కేంద్రం పరిసరాల పరిశుభ్రత, మొక్కల పెంపకం, పూల మొక్కలు, పండ్ల తోటలు, తీగ మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ మాట్లాడుతూ, పుదిపట్ల గ్రామంలో క్లాప్ మిత్రలు చేస్తున్న పనితీరు ఆదర్శప్రాయంగా ఉందని, చెత్త నిర్వహణలో గ్రామం మండలంలోనే కాకుండా జిల్లా స్థాయిలోనూ ముందంజలో నిలిచే విధంగా అభివృద్ధి సాధించడం అభినందనీయమన్నారు. గ్రామస్తులతో మాట్లాడుతూ, గ్రామానికి వచ్చే స్వచ్ఛ రథానికి ప్లాస్టిక్, ఇనుప తదితర పునర్వినియోగ చెత్తను అందజేసి, దానికి బదులుగా నిత్యావసర వస్తువులను పొందే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మహేశ్వర్, క్లాప్ మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణాపురం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం.. ఆర్టీసీ బస్సును ఢీకొన్న ఆటో -- ఒకరికి తీవ్ర గాయాలు





**చౌడేపల్లి, జూలై 16:** అన్నమయ్య జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని కృష్ణాపురం సమీపంలో గురువారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మదనపల్లి నుంచి చౌడేపల్లికి వస్తున్న ఆర్టీసీ బస్సును ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు, బోయకొండ గంగమ్మ అమ్మవారి దర్శనం ముగించుకుని అమ్మ చెరువు మెట్ట గ్రామానికి తిరుగు ప్రయాణంలో ఉన్న ముగ్గురు వ్యక్తులు ఆటోలో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా, సతీష్ కుమార్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం ఆయన అపస్మారక స్థితిలో పడిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించగా, సతీష్ కుమార్‌కు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## భర్త వేధింపులు తాళలేకపోతున్నా..రక్షించండి



**మన ప్రజావాణి మందమర్రి:- జులై 16** తన భర్త, అతని బావ నుంచి తనకు,తన ఇద్దరు చిన్నారులకు ప్రాణహాని ఉందని పోలీసులు, అధికారులు రక్షణ కల్పించాలని పట్టణంలోని ప్రాణహిత కాలనీ (షిర్కే) కు చెందిన మహిళ స్వరూప రాణి కోరారు. గురువారం పట్టణ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తన కుటుంబ సమస్యలను వివరించారు. తనకు, చీకటి శ్రీశైలం తో 2012లో వివాహం జరిగిందని, వివాహం జరిగినప్పటి నుంచే భర్త ఎలాంటి పని చేయకుండా తనను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడని ఆరోపించారు. వివాహానికి ముందే శ్రీశైలం మరో ఇద్దరు మహిళలను వివాహం చేసుకొని, ఆ విషయాన్ని తన వద్ద దాచిపెట్టి, మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను ఆరోగ్యమిత్రగా పనిచేస్తూ, ఇద్దరు పిల్లలను పోషిస్తున్నానని తెలిపారు. ఇటీవలి కాలంలో తన భర్త శ్రీశైలం తనను బెదిరిస్తున్నాడని, అతనికి అతని బావ చంద్రమౌళి సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై ఇప్పటికే పలుమార్లు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని, వెంటనే రక్షణ కల్పించి, న్యాయం చేయాలని జిల్లా ఉన్నతాధికారులను, ప్రజాప్రతినిధులను ఆమె కోరారు.

## కంషేట్ పల్లి గ్రామంలో రైతు అవగాహన సదస్సు



**నసురుల్లాబాద్ జులై 17 (ప్రజావాణి)** గురువారం రోజున నసురుల్లాబాద్ మండలం పరిధిలో కాంశేట్ పల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఏఈఓ గ్రీష్మ ఆధ్వర్యంలో "రైతు అవగాహన కార్యక్రమం" నిర్వహించారు. ఎల్ నినో ప్రభావం కారణంగా ఈ సంవత్సరం ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతన్నలు తక్కువ నీటి శాతంతో పండేటటువంటి మెట్ట పంటలు పెసరు, మినుము, కంది, సోయాబీన్, వేరుశనగ, పొద్దు తిరుగుడు పువ్వు వంటి పంటలను సాగు చేసుకోవాలని అవగాహన కల్పించారు. మెట్ట పంటలు పండించడం వలన పెట్టుబడి తక్కువగా ఉంటుందని చీడపీడల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవడం వలన మెరుగైన దిగుబడి వస్తే రైతులకు లాభసాటిగా ఉంటుందని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సాయా గౌడ్ , బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు, రైతులు జగదీష్, శంకర్, వెంకటి, భాస్కర్, షఫీ, రాము, సామెల్, మల్లయ్య, రాజేశ్వర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ

● సూపరింటెండెంట్ జిల్లా కేంద్ర ఆస్పత్రి గజ్వేల్
● డాక్టర్ రేఖ రాణి





**రాయపోల్ /సిద్దిపేట్ జూలై 15, ( ప్రజావాణి)** సిద్దిపేట జిల్లా గజ్వేల్ జిల్లా కేంద్ర ఆస్పత్రి యందు గౌరవ శ్రీ. కె. హైమావతి జిల్లా కలెక్టర్ సిద్దిపేట గారి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ,ధనరాజ్, జిల్లా క్షయ నిర్మూలన ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నిర్మల రెడ్డి , ఎన్ .సి. డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ,వినోద్ బాబ్జి గారి ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రేఖ రాణి డిస్ట్రిక్ట్ హాస్పిటల్ గజ్వేల్ సూపరిశీటెండెంట్ హాజరైనారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ రేఖా రాణి మాట్లాడుతూ గౌరవ శ్రీ కే. హైమావతి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో స్వచ్ఛంద సంస్థలు (NGOs) సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు (టీ.బీ) ఉచితంగా న్యూట్రిషన్ కిట్స్ అందించారు. ఈ కిట్టులో సాధారణంగా సజ్జలు ,రాగులు, మల్టీ గ్రీన్ పిండి, శక్తిని మరియు ఫైబర్ అందిస్తుందని పప్పు ధాన్యాలు కందిపప్పు, పెసరపప్పు మినపప్పు శరీరానికఅవసరమైన ప్రోటీన్లు మాంస కృతులు అందిస్తాయని వేరుశెనగలు మరియు పుట్నాల పప్పు ఆరోగ్యానికి కొవ్వును మరియు ప్రోటీన్లను బరువు పెరగడానికి సహాయపడుతుందన్నారు బెల్లము ఐరన్ లోపాన్ని రక్తహీనతను నివారిస్తుందన్నారు వంటనూనె శరీరానికి అవసరమయ్యే కేలరీలను అందిస్తుంది అన్నారు. మల్టీ విటమిన్ పౌడర్ రోగ నిరోధక శక్తిని వేగంగా పెరగడానికి తోడ్పడుతుందన్నారు వ్యాధిగ్రస్తులకు Food basket నందు గల వస్తువులు మరియు వాటి యొక్క ప్రాముఖ్యతను తెలపరిచి వ్యాధిగ్రస్తులకు ఆరోగ్య విద్య మరియు మనోధైర్యాన్ని కల్పించడం జరిగింది. ఆర్. ఎం. ఓ డాక్టర్ రాము మాట్లాడుతూ టీబీ వ్యాధిగ్రస్తులు నయం కావడానికి కేవలం మందులు వాడడం కాకుండా రోగ నిరోధక శక్తిని పెంచే బలమైన ఆహారం తీసుకోవాలన్నారు. ఇంటిలో కుటుంబ సభ్యులు వాడకుండా వ్యాధిగ్రస్తులే వాడుకోవాలని సూచించారు..టీవీ సూపర్వైజర్ డి.తిరుపతి రెడ్డి మాట్లాడుతూ నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా క్షయ వ్యాధిగ్రస్తులకు నెలకు ఒక వెయ్యి రూపాయలు పోషకాహారం కొనుగోలు చేయుటకు కేంద్ర ప్రభుత్వము మరియు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ సహాయమందిస్తుందన్నారు. గత ఆరు నెలలుగా పెండింగ్లో ఉన్న 6000 రూపాయలు ఒకటి, రెండు రోజుల్లో అకౌంట్లో పడుతాయన్నారు. గజ్వేల్ డివిజన్ లో 29 మంది క్షయ వ్యాధిగ్రస్తులు ఉన్నారని వారందరికీ న్యూట్రిషన్ కిట్స్ అందజేయబడిందని తెలిపినారు..ఈ కార్యక్రమంలో ఆర్.ఎమ్.ఓ డాక్టర్ శ్రీధర్ పాలివేటివ్ కేర్ వైద్యాధికారి డాక్టర్ పల్లవి, క్లస్టర్ సి. హెచ్. ఓ.ఎస్ .యాదగిరి రావు, సబ్ యూనిట్ ఆఫీసర్ ,బి. శ్రీనివాస్, టి.బి. హెల్త్ విజిటర్ శ్రీకాంత్ ,ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ వాసుదేవ్ దేవసాని, ఆశా కార్యకర్తలు వంజరి గిరిజ, ఉప్పరి లావణ్య, సంతోష, మంజుల, రాణి, బాలమణి, స్వప్న, రాంబాయి, సుగుణ, సుమలత, జ్యోతి, మహేశ్వరి, పల్లవి ,నాగజ్యోతి, మనీషా, కవిత, కనకవ్వ, టీబీ వ్యాధిగ్రస్తులు మరియు వారి పేరెంట్స్ అధిక సంఖ్యలో పాల్గొని ఈకార్యక్రమం విజయవంతం చేశారు..

# రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

■ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
■ మార్కెట్ యార్డ్ లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
■ మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య





**ప్రజావాణి వేములవాడ టౌన్ 16 జులై 2026** కొనరావుపేట మండలం (నిజామాబాద్) వ్యవసాయ మార్కెట్ యార్డ్లో సుమారు 51 లక్షలతో పలు అభివృద్ధి పనులను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన నిర్వహించారు.
అనంతరం 38 మంది లబ్ధిదారులకు 15 లక్షల 46 వేల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శం ఇటీవల తమిళనాడు ముఖ్యమంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్ తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం పై, కేరళ ముఖ్యమంత్రి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పై మొదటి సంతకం చేశారని అన్నారు.
రాష్ట్రంలో కుల గణన చేసిన తర్వాత నరేంద్ర మోదీ దిగి వచ్చి దేశంలో జనగణ కార్యక్రమాన్ని చేపట్టారని అన్నారు. దేశంలో ఎక్కడ లేని విధంగా ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం కోసం 5 లక్షలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరు విషయంలో కుల మతాలకు, పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నామని గతంలో బేస్ మెంట్, గోడలు కట్టుకుని ఉన్నా వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు కింద ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారని అన్నారు. త్వరలో అమలు చేయనున్న ఇందిరమ్మ భీమా పథకం దేశంలో, ప్రపంచంలో ఎక్కడా లేదని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల్లో ఉన్నా ఇక్కడ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. రేషన్ కార్డు ఉన్న వారి అందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, రైతు రుణ మాఫీ చేశామని, రైతు భరోసా అందిస్తున్నామని వెల్లడించారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నామని తెలిపారు.
ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ఊపు అందుకున్నాయని, దేశానికి రోల్ మోడల్ ఈ పథకమని పేర్కొన్నారు. సొంత ఇంటి కల నిజం చేసేందుకు రూ.5 లక్షలు ఇస్తున్నామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లు సొంత ఇల్లు కల నిజం చేయడంతో పాటు ఎందరికో ఉపాధి మార్గం దొరుకుతుందని తెలిపారు. రెండో దశలో అర్హులకు ఇస్తామని పేర్కొన్నారు.
-బీఆర్ఎస్ అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు
-అభివృద్ధి పనులన్నీ పూర్తి చేస్తాం
వేములవాడ నియోజకవర్గ అభివృద్ధిని చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలు గమనిస్తున్నారని, అందుకే బీఆర్ఎస్ నాయకులు ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు.
నియోజకవర్గంలోని రహదారులు, బ్రిడ్జిల నిర్మాణం, సాగునీటి ప్రాజెక్టులు, వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి పనులకు ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. బ్రిడ్జిలకు నిధులు లేవంటూ బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు.
కొనరావుపేట మండలంలో రెండు బ్రిడ్జిలకు సంబంధించిన అంచనాలు సిద్ధమయ్యాయని, మరో బ్రిడ్జికి డ్రాయింగ్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. రహదారి నిర్మాణంతో పాటు అవసరమైన చోట్ల బ్రిడ్జిల నిర్మాణానికి కూడా ప్రభుత్వం పూర్తి స్థాయిలో నిధులు సమకూరుస్తుందని పేర్కొన్నారు.
గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం శిలాఫలకాలు వేయడం తప్ప అభివృద్ధి పనులు పూర్తి చేయలేదని ఆది శ్రీనివాస్ విమర్శించారు. వేములవాడ మూడో బ్రిడ్జికి 2015లో శంకుస్థాపన చేసినప్పటికీ, 10 సంవత్సరాల పాటు బాధిత కుటుంబాలకు నష్టపరిహారం కూడా ఇవ్వలేకపోయారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.6.96 కోట్ల నిధులు విడుదల చేసి బాధితులకు పరిహారం అందించి పనులను పునఃప్రారంభించిందన్నారు. కలికోట సూరమ్మ ప్రాజెక్టు విషయంలో కూడా బీఆర్ఎస్ రైతులను మోసం చేసిందని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. "ఈ దసరాకే నీళ్లు" అంటూ హామీలు ఇచ్చి ఐదేళ్లు గడిచినా ప్రాజెక్టును పూర్తి చేయలేదన్నారు. భూసేకరణ చేయకుండా, రైతులకు నష్టపరిహారం ఇవ్వకుండా శంకుస్థాపనలతోనే కాలం గడిపారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో ప్రాజెక్టుకు అవసరమైన నిధులు విడుదల చేశామని, ఇప్పటికే ఎడమ కాల్వ రైతులకు పరిహారం అందించామని తెలిపారు. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు రాజకీయ ప్రయోజనాల కోసం వడ్ల కొనుగోళ్లు, ఇతర అంశాలపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. తప్పు చేసిన వారెవరైనా చట్టం ముందు సమానమేనని, ఏ పార్టీకి చెందిన వారైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజల మధ్య ఉండకుండా ఎన్నికల సమయంలో మాత్రమే కనిపించే నాయకులు ఇప్పుడు అభివృద్ధిపై మాట్లాడడం హాస్యాస్పదమని అన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రజలకు జవాబుదారీతనంతో పనిచేస్తూ ప్రతి హామీని నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామని, వేములవాడ నియోజక వర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ ముస్కు ముకుంద రెడ్డి, వైస్ చైర్మన్ తాళ్లపల్లి ప్రభాకర్, నిజామాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు. సర్పంచ్ సింగం శ్రీహరి, ఉప సర్పంచ్ రాజు, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు బోయిని దేవరాజు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానుక సత్యం, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, నాయకులు ఫిరోజ్ పాషా, చేపూరి గంగాధర్, గొట్టె రుక్మిణి, నాలుక సత్యం. కర్రోళ్ల భాస్కర్. పలు గ్రామాల సర్పంచులు. మాజీ సర్పంచులు. మాజీ ఎంపీటీసీలు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## షాద్‌నగర్‌లో ఘనంగా శ్రీ జగన్నాథ రథయాత్ర

● హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, ప్రజాప్రతినిధులు



**షాద్ నగర్ ప్రజా వాణి జులై 16:** షాద్‌నగర్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో కళింగ కల్చరల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ జగన్నాథ రథయాత్ర కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి షాద్‌నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన ఆదివాసి రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, మున్సిపల్ కౌన్సిలర్ పెంటయ్య, మురళీమోహన్ అప్పి, సుదీర్, అశోక్, ఎస్పీ శివ, పినమోని గోపాల్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భరత్ లోహాటి, తంగడపల్లి శంకర్, మాజీ జెడ్పీటీసీ సాయికృష్ణ, జయప్రకాష్, మురళి, గంగమణి సత్తయ్య, రవితేజతో పాటు పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు. రథయాత్రలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు శ్రీ జగన్నాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం రథయాత్రలో భక్తులతో కలిసి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసిన కళింగ కల్చరల్ కమిటీ నిర్వాహకులను అభినందించారు..

## "ప్రైవేట్ వద్దు.. అంగన్వాడి ముద్దు"



**రాయికల్, జూలై 16(ప్రజావాణి):** రాయికల్ పట్టణంలోని అంగన్వాడీ కేంద్రాలు 01, 02, 03 లలో శుక్రవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలు,బాలింతలు,6 నెలల నుండి 3 సంవత్సరాల పిల్లలు,3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు బరువులు, ఎత్తులు తీసి తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం 25 రోజులకు సరిపడా ఇంటి సరుకులు బియ్యం,పప్పు, నూనె, గుడ్లు, పాలు, బాలామృతం, మురుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్నప్పటికీ వాతావరణ మార్పుల కారణంగా ఎండలు ఉన్నందున పిల్లలు, తల్లులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఎక్కువసార్లు పానీయాలు, వాటర్, కొబ్బరి నీళ్లు తాగించాలని తల్లులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సుమలత, వనిత, రజిత, ఆయాలు,గర్భవతులు, బాలింతలు,తల్లులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తాం..!

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- యాతాలకుంట టన్నెల్ పనులను పరిశీలించిన డిప్యూటీ సీఎం, మంత్రులు



**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు.డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లు గురువారం సత్తుపల్లి మండలం యాతాలకుంట గ్రామాన్ని సందర్శించి సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం అధికారులతో సీతారామ ప్రాజెక్టు సత్తుపల్లి ట్రంక్ టన్నెల్ పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి, పనుల పురోగతి, భూసేకరణ, నిధుల విడుదల, నిర్మాణ వేగం, పెండింగ్ అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనాన్ని లూటీ చేశారని విమర్శించారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు గోదావరి జలాలు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులు రూపొందించారని, కేవలం రూ.1,500 కోట్లతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును తీసుకొచ్చిందన్నారు.తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఈ విషయాన్ని అనేక సార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని, దాదాపు రూ.8,500 కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా అదనపు ఆయకట్టు తీసుకురాలేదని విమర్శించారు.సీతారామ ప్రాజెక్టులో గతంలో కొన్ని పొరపాట్లు జరిగినప్పటికీ ప్రస్తుతం రైతులకు ప్రయోజనం చేకూరేలా దానిని ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 100 కోట్లతో కొత్తగా రాజీవ్ లింక్ కెనాల్‌ను మంజూరు చేసి రికార్డు సమయంలో పూర్తి చేసి వైరా రిజర్వాయర్‌కు అనుసంధానం చేశామని తెలిపారు.పాలేరు రిజర్వాయర్‌కు సాగునీరు తరలించేందుకు జూలూరుపాడు టన్నెల్ పనులను మంజూరు చేశామని, మున్నేరు--పాలేరు లింక్ కెనాల్ పనులు కూడా చేపట్టామని తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి సంబంధించి ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటికే దాదాపు రూ.1,000 కోట్ల బిల్లులు విడుదల చేసిందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన పొరపాట్లు పునరావృతం కాకుండా ఉండేందుకు హైదరాబాద్‌లో మాత్రమే సమీక్షలు నిర్వహించకుండా నేరుగా ప్రాజెక్టుల వద్దకే వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ ఇక్కడే సమీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం వెంటనే రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామని, అవసరమైన బిల్లులు సిద్ధం చేసి టోకెన్లు వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు.నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణను అత్యంత ప్రాధాన్యతతో చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులను వేగంగా పూర్తి చేస్తున్న నిర్మాణ సంస్థలను ప్రోత్సహించేలా ఎప్పటికప్పుడు బిల్లులు క్లియర్ చేస్తున్నామని తెలిపారు.నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ ఎత్తిపోతల పథకంతో పాటు ఇతర నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ నిధుల వివరాలను ప్రత్యేక నివేదిక రూపంలో సమర్పించాలని అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు యుద్ధ ప్రాతిపదికన భూసేకరణ పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి చెల్లింపులు చేస్తుందని స్పష్టం చేశారు.

సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణకు సంబంధించి ప్రభుత్వ విధానం ప్రకారం వేగంగా చెల్లింపులు చేయాలని నిర్ణయించామని, జిల్లా కలెక్టర్లు, అధికారులు ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. టీఆర్ఎస్ పాలనలో నీటిపారుదల శాఖను సర్వనాశనం చేశారని, ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గి గత పాలకుల హయాంలో నిర్వీర్యమైన ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వడం లేదని అనవసరంగా ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని మండిపడ్డారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా నీటి పారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో సీతమ్మ సాగర్, సీతారామ ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి అవసరమైన భూసేకరణ నిధులను విడుదల చేయడంతో పాటు ఇప్పటికే చేసిన పనులకు 50 శాతం బిల్లులు చెల్లించాలని డిప్యూటీ సీఎంను కోరారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వ హయాంలో నమోదైన ఎన్‌జీటీ కేసును పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, నేడు సుప్రీంకోర్టులో సానుకూల తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.సీతారామ ఎత్తిపోతల పథకానికి 67 టీఎంసీల నీటి కేటాయింపులు, టీఏసీ క్లియరెన్స్ తమ ప్రభుత్వమే సాధించిందని తెలిపారు. చట్టపరమైన సమస్యలను పరిష్కరించి సీతమ్మసాగర్ ప్రాజెక్టును కూడా పూర్తి చేస్తామని చెప్పారు. నీటిపారుదల ప్రాజెక్టులపై రూ.1.80 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ 2004లో ప్రారంభించిన దేవాదుల, సీతారామ, కాళేశ్వరం ప్రాజెక్టుల్లో ఏ ఒక్కదానిని కూడా గత ప్రభుత్వం పూర్తి చేయలేదని విమర్శించారు. సీతారామ, సీతమ్మసాగర్‌తో పాటు గోదావరిపై పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టును కూడా పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందిస్తామని తెలిపారు.

నీటిపారుదల శాఖకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల మరమ్మతులు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ బ్యారేజీలు గత ప్రభుత్వ హయాంలోనే కుంగిపోయాయని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వాటిలో నీటిని నిల్వ చేయకుండా అవసరమైన పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు.మూడు బ్యారేజీలకు ఒకే విధమైన ఫౌండేషన్ ఉన్నందున నీటిని నిల్వ చేయకుండా పరీక్షలు నిర్వహించి, టెస్ట్ రిపేర్ పార్ట్ ఫలితాల ఆధారంగా మరమ్మతులు చేపడుతున్నామని, భారత సైన్యానికి చెందిన అధికారి, నిపుణుల పర్యవేక్షణలో ఈ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు.రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రభుత్వం ఎటువంటి బేషజాలకు పోకుండా గత పాలకులు నిలిపివేసిన సీతారామ ప్రాజెక్టు పనులను వేగవంతం చేస్తోందన్నారు.ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్ ప్రాజెక్టు, వైరా-లంకసాగర్ ప్రాజెక్టు, మైనర్ ఇరిగేషన్ పరిధిలో సాధ్యమైనంత మేరకు ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా కరువు కాలంలో కూడా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామని తెలిపారు.కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశపూర్వకంగా నిలిపివేయలేదని స్పష్టం చేసిన మంత్రి, గత ప్రభుత్వం ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో తాత్సారం చేయకుండా వేగంగా పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పిడిసిఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సిఈ లు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ ఈ యుగంధర్ రావు, ఎన్పిడిసిఎల్ ఎస్ఈ శ్రీనివాస చారి, డిపిఓ రాంబాబు, సీపీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను పుష్కలంగా అందిస్తాం...

- సీతమ్మసాగర్ -- సీతారామ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు కానుక..
- ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రులు...
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.







**భద్రాద్రి జిల్లా బ్యూరో/మన ప్రజావాణి (జూలై 16):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థ, ఆయకట్టు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనులు, అవసరమైన నిధులు తదితర అంశాలను మంత్రులకు వివరించారు. గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించేలా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో రాజీవ్ సాగర్ ప్రాజెక్టు రూ.1,640 కోట్లతో రెండు లక్షల ఎకరాలకు, ఇందిరా సాగర్ ప్రాజెక్టు రూ.1,680 కోట్లతో మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించబడినట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించబడిందన్నారు. రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2,000 కోట్ల వరకు వ్యయం జరిగిందని, మిగిలిన పనులకు సుమారు రూ.1,505 కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. అనంతర కాలంలో ప్రాజెక్టు పునఃరూపకల్పనతో అంచనా వ్యయం సుమారు రూ.24 వేల కోట్లకు పెరిగిందని,ఇప్పటికే రూ.7,500-8,000కోట్ల వరకు వ్యయం జరిగినట్లు వివరించారు.ప్రస్తుతం భారీ ప్రజాధనం ఇప్పటికే వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలను సమన్వయం చేసి గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన నిధులు విడుదల చేసి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

సీతారామ ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని అన్నారు. ఇప్పటికే ప్రాజెక్టుపై గణనీయమైన ప్రజాధనం వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ రంగంపై గతంలో సుమారు రూ.1.81 లక్షల కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పాలమూరు -- రంగారెడ్డి ప్రాజెక్టుపై సుమారు రూ.27,500 కోట్లు వ్యయం జరిగినట్లు తెలిపారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్డిఎస్ఏ), కేంద్ర జల సంఘం (సిడబ్ల్యూసి) సూచనల మేరకు సాంకేతిక పరీక్షలు, భూగర్భ పరిశీలనలు, నిర్మాణ భద్రతా అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిపుణుల నివేదికల ఆధారంగా అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు . ప్రజల భద్రత, నిర్మాణ నాణ్యత, నీటి నిల్వ సామర్థ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని నిర్ణయాలు శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే తీసుకుంటున్నామని వివరించారు.సీతారామ ప్రాజెక్టులోని పంప్‌హౌస్‌లు,బ్యారేజ్,కాలువలు,విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థల నిర్మాణాన్ని వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలలో రికార్డు స్థాయిలో వరి ధాన్యం పండించి రైతుల ఖాతాల్లో రూ.80 వేల కోట్లకు పైగా రైతులకు నేరుగా జమ చేసినట్లు తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందంజలో నిలిచిందన్నారు. సీతమ్మసాగర్--సీతారామ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పై ఉన్న న్యాయపరమైన చిక్కులను పరిష్కరించుకొని త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి జిల్లాలో గోదావరి జలాలను వినియోగించే విధంగా అదేవిధంగా ఇల్లందు నియోజకవర్గంలో కూడా నీరు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందిస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకు రావడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుకు అవసరమైన ఎలక్ట్రికల్, మెకానికల్ తదితర పనుల కోసం సుమారు రూ.1,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోకుండా పంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి నీటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, అవసరమైన చోట అదనపు నిధులు కూడా విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని అన్నారు.జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రాజెక్టు పనుల ప్రస్తుతపురోగతి,భూసేకరణ,పునరావాసం,విద్యుత్ అనుసంధానం, అనుబంధ మౌలిక సదుపాయాల కల్పన, శాఖల మధ్య సమన్వయంపై మంత్రులకు వివరించారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు,భూ సంబంధిత అంశాలను వేగవంతంగా పరిష్కరిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై జిల్లా స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, శాఖల సమన్వయంతో పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు వివరించారు. అనంతరం మంత్రులు మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, నీటిపారుదల శాఖ అధికారులు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 108 & 102 అంబులెన్స్ లలో ఆకస్మిక తనిఖీలు చేసిన అధికారులు

- అంబులెన్స్ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అత్యవసర వైద్య సేవలను ప్రజలకు వేగంగా అందించా
- అత్యవసర ఆరోగ్య సేవలు లిప్రజలకు అందింటమే ప్రభుత్వ లక్ష్య



**షాద్ నగర్ ప్రజా వాణి జులై 16:**తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 108, 102 అంబులెన్స్ సేవలపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో 108 కోఆర్డినేటర్ రాజబాబు, 102 కోఆర్డినేటర్ శ్రీహరి పాల్గొని అంబులెన్స్‌లలో అందుబాటులో ఉన్న అత్యవసర మందులు, వైద్య పరికరాలు, ఆక్సిజన్ సిలిండర్లు, స్ట్రెచర్లు, మానిటరింగ్ పరికరాలు తదితర ప్రాణరక్షక సామగ్రిని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కోఆర్డినేటర్లు మాట్లాడుతూ, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన అన్ని మందులు, పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే అంబులెన్స్‌ల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సేవల నాణ్యతపై సమీక్ష నిర్వహించి, విధుల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా సేవలు అందించాలని ఆదేశించారు.ఈ ఆకస్మిక తనిఖీలో సంబంధిత అధికారులు, 108 పైలట్లు, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ పోస్టర్ విడుదల

- ముఖ్య అతిథిగా షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్





**షాద్ నగర్ ప్రజా వాణి జులై 16:**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మున్సిపాలిటీ ఎంపీడీవో కార్యాలయం ఆవరణ తెలంగాణా జాయింట్ యాక్షన్ కమిటీ( టి జేఏసీ) వారి ఆధ్వర్యంలో 19వ తేదీన నూతనంగా ఏర్పాటు చేసిన తెలగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణ పోస్టర్ విడుదల చేసిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్,పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్,మాజీ జడ్పీటీసీ వెంకట్రాంరెడ్డి, గిరిజన ఆదివాసి రాష్ట్ర కో ఆర్డినేటర్ రఘు నాయక్,శేఖర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి రవి కుమార్ గుప్తా, అంబటి ప్రభాకర్,దంగూ శ్రీనివాస్ యాదవ్, జాంగారి రవి,జేఏసీ నేతలు జనార్ధన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ టీ.కరణకర్, నక్క బాలరాజు,టీజీ శ్రీనివాస్, బిస్వ కృష్ణయ్య, రవీంద్ర నాథ్, అర్జునప్పా,మందారం నర్సింహులు, గొర్ల రాము, పరం జ్యోతి, తదితరులు పాల్గొన్నారు

# అల్మాయిపేట్ గ్రామంలో పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి హాజరైన ఉదయ్ బాబు మోహన్



**మన సమగ్ర ప్రజావాణి జూలై 16 సంగారెడ్డి జిల్లా ప్రతినిధి** అల్మాయిపేట్ గ్రామంలో మహమ్మద్ బాబా కుమారుని పుట్టు వెంట్రుకల కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా హాజరైన ఉదయ్ బాబు మోహన్ బి ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆందోల్ కౌన్సిలర్ నాగరత్నం గౌడ్ ఈ సందర్భంగా మహమ్మద్ బాబా కుమారుడిని ఆశీర్వదిస్తూ తనకు పుట్టు వెంట్రుకలతో మొదలుపెట్టిన కార్యక్రమాన్ని తాను మంచి ఉన్నతమైన స్థానానికి ఎదిగే విధంగా దేవుని ఆశీర్వాదాలు ఉండాలని అల్లా ఆశీస్సులు ఉండాలని ఆ దేవుని సాక్షిగా ఆయన వేడుకున్నారు. అదేవిధంగా ఆయన తండ్రి అయిన బాబా భార్య అమ్మ కుటుంబం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా మంచి సంతోషంతో కుటుంబానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఆ దేవుడు చల్లగా ఆశీస్సులు అందించాలని ఆయన కొనియాడారు ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ గ్రామ యువ నాయకులు ఎండి గౌస్ తదితరులు పాల్గొన్నారు

# మట్టపల్లి క్షేత్రానికి రూ.13 కోట్ల వరం..! పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్


- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చొరవతో నిధుల మంజూరు -- బోటింగ్, పర్యాటక వసతుల అభివృద్ధికి పరిపాలనా అనుమతి





**హుజూర్నగర్,జూలై 17 (ప్రజావాణి):** సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం రూ.13 కోట్ల నిధులను మంజూరు చేస్తూ పరిపాలనా అనుమతులు జారీ చేసింది. దేవాలయ పరిసరాల్లో పర్యాటక, ఆధ్యాత్మిక అభివృద్ధితో పాటు బోటింగ్ కార్యకలాపాల ఏర్పాటుకు ఈ నిధులను వినియోగించనున్నారు.రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు వెల్లడైంది. మట్టపల్లి క్షేత్రాన్ని రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో పలుమార్లు చర్చించి ప్రతిపాదనకు ఆమోదం లభించేలా కృషి చేశారు.మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి మేరకు తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ (టీజీటీడీసీ) అధికారులు మట్టపల్లి క్షేత్రాన్ని పరిశీలించి రూ.13 కోట్ల అంచనా వ్యయంతో అభివృద్ధి ప్రణాళికను రూపొందించారు. అనంతరం ప్రభుత్వం ప్రతిపాదనలను పరిశీలించి పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.ఈ నిధులతో ఆలయ పరిసరాల్లో ఆధునిక పర్యాటక వసతులు, భక్తులకు అవసరమైన సౌకర్యాల కల్పన, బోటింగ్ అభివృద్ధి, పర్యాటక మౌలిక వసతుల విస్తరణ వంటి పనులు చేపట్టనున్నారు. దీంతో తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.మట్టపల్లి క్షేత్ర అభివృద్ధి ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు హుజూర్‌నగర్ ప్రాంతంలో పర్యాటక రంగానికి కొత్త ఊపు వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.మట్టపల్లి క్షేత్ర అభివృద్ధికి పరిపాలనా అనుమతి లభించడం పట్ల స్థానికులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నిర్ణయంతో మట్టపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం తెలంగాణలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చెందుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# లీవ్‌లో ఉంటే ఉద్యోగం పోతుందా మెటా లేఆఫ్స్‌పై సంచలన ఆరోపణలు




మెటా (వీమ్కు) సంస్థకు వ్యతిరేకంగా ఆ కంపెనీకి చెందిన 26 మంది ఉద్యోగులు కాలిఫోర్నియాలోని ఓక్లాండ్ ఫెడరల్ కోర్టులో దావా వేశారు. లేఆఫ్స్ (ఉద్యోగుల తొలగింపు) ప్రక్రియలో కంపెనీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వ్యవస్థలను ఉపయోగించి మెడికల్ లీవ్, ప్రసూతి సెలవులు, ఫ్యామిలీ లీవ్‌లో ఉన్న ఉద్యోగులను ఉద్దేశపూర్వకంగా టార్గెట్ చేసిందని పిటిషనర్లు ఆరోపిస్తున్నారు.

పిటిషనర్ల ప్రధాన ఆరోపణలు: 1. సాంకేతికత దుర్వినియోగం: ఉద్యోగులను తొలగించడానికి మెటా అంతర్గత ఏఐ సిస్టమ్స్, కీస్ట్రోక్ మానిటరింగ్, యాక్టివిటీ ట్రాకింగ్ డేటా, ఏఐ టోకెన్ వాడకం డ్యాష్‌బోర్డులు, అల్గారిథమిక్ పనితీరు రేటింగులను ఉపయోగించింది. 2. లీవ్ నిబంధనల ఉల్లంఘన: సెలవుల్లో ఉన్న ఉద్యోగులు సహజంగానే ఈ డిజిటల్ రేటింగులు సాధించలేరు. అయినప్పటికీ ఏఐ సిస్టమ్స్ ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. 3. చట్టపరమైన లోపాలు: మెడికల్, పెరెంటల్, ఫ్యామిలీ లీవ్‌లో ఉన్నవారి డేటాను విశ్లేషించేటప్పుడు, చట్టప్రకారం చేయాల్సిన వ్యక్తిగత సమీక్షను మెటా యాజమాన్యం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దీని ఫలితంగానే మెడికల్, లేదా ఫ్యామిలీ లీవ్‌లో ఉన్న ఉద్యోగులు ఈ లేఆఫ్స్‌లో ఎక్కువగా నష్టపోయారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ దావా వేసిన 26 మంది అనామక ఉద్యోగులంతా చట్టబద్ధమైన సెలవులు తీసుకోవడంతో పాటు, వైకల్యం కారణంగా ప్రత్యేక సదుపాయాలు కూడా కోరారు. ప్రస్తుతం వీరికి లేఆఫ్ నోటీసులు అందినా, జులై 22 వరకు మెటాలోనే కొనసాగుతారు. పెద్దసంఖ్యలో ప్రసూతి, పెరెంటల్ లీవ్‌లో ఉన్న ఉద్యోగులు: ఈ దావా వేసిన ఉద్యోగుల్లో చాలామంది ప్రెగ్నెన్సీ లేదా పెరెంటల్ లీవ్ తీసుకున్నారు. ఆ సమయంలో వారు విధుల్లో లేకపోవడంతో వారి పనితీరు సహజంగానే తక్కువగా నమోదైంది. మరికొందరు మెడికల్ లీవ్‌లో ఉన్నారు. వారిలో ఒక ఉద్యోగి తన "తీవ్రమైన ఆరోగ్య సమస్య, దివ్యాంగత్వం" గురించి తెలపగా, మెటా అధికృత వైద్య విభాగం కూడా దాన్ని ఆమోదించింది. అయినప్పటికీ, ఒక మేనేజర్ "లీవ్ తీసుకుంటే లేఆఫ్స్‌లో సెలెక్ట్ అవుతావు" అని హెచ్చరించి, లీవ్ తీసుకోవద్దని ఒత్తిడి తెచ్చారని దావాలో పేర్కొన్నారు. అంతేకాకుండా, అతడి ఆరోగ్య పరిస్థితికి మెటా ఎలాంటి ప్రత్యేక సదుపాయాలు కల్పించలేదని కూడా ఆరోపించారు. మెటా వివరణ: దీనిపై మెటా స్పందిస్తూ ఈ వాదనల్లో వాస్తవం లేదని, అవి నిరాధారమైనవని ప్రకటించింది. ఉద్యోగుల నిర్వహణ, సంస్థాగత నిర్ణయాలు గతంలోనూ, ఇప్పుడు కూడా ఏఐ ద్వారా కాకుండా మానవులే తీసుకుంటున్నారని స్పష్టం చేసింది. ఇకపోతే ఈ కేసు వేసిన వారిలో దాదాపు సగంమంది సంరక్షణ లేదా గర్భధారణకు సంబంధించిన కారణాలతో సెలవులు తీసుకున్నవారే ఉన్నారు. వీరిలో ఎనిమిది మంది మహిళలు మెటర్నిటీ లేదా ప్రెగ్నెన్సీ లీవ్‌లో ఉండగా, నలుగురు పురుషులు పేరెంటల్ లీవ్ తీసుకున్నారు. మరో మహిళా ఉద్యోగి తన కుటుంబ సభ్యుని సంరక్షణ కోసం సెలవు తీసుకుని, ఆ తర్వాత సంతాప సెలవు కూడా పొందారు. గత మే నెలలో మెటా తన మొత్తం వర్క్‌ఫోర్స్‌లో 10 శాతం అంటే దాదాపు 8,000 మంది ఉద్యోగులను తొలగిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజా కేసుతో లేఆఫ్స్ వ్యవహారం సరికొత్త మలుపు తిరిగింది.

# అందరూ సమానమే అని చాటిచెప్పే 'మేల్‌మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రం' - నెలసరి సమయంలోనూ అమ్మవారిని పూజించొచ్చు!



సృష్టికి మూలం ఆది పరాశక్తి. ఈ తల్లి దృష్టిలో అందరూ సమానమే! కులమత భేదాలు, స్త్రీ పురుష లింగ, వయో భేదాలు లేకుండా అందరినీ సమదృష్టితో ఆదరించే కరుణామయి. ఈ వాస్తవాన్ని అందరికీ చాటి చెప్పాలనే స్ఫూర్తితో రూపుదిద్దుకున్న ఆలయమే మేల్ మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రం. ఎరుపు రంగు వస్త్రాలు ధరించి, నిరంతరం 'ఓం శక్తి' అంటూ అమ్మవారిని ధ్యానించే భక్తులతో ఎల్లప్పుడూ కిటకిటలాడుతుండే ఈ ఆలయ విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

మేల్ మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రం ఎక్కడుంది? తమిళనాడు రాష్ట్రంలోని చెంగల్పట్టు జిల్లాలో మేల్ మరువత్తూర్ క్షేత్రం ఉంది. ఈ క్షేత్రంలో వెలసిన ఆది పరాశక్తి పీఠాన్ని బంగారు అడిగళార్ అనే స్వామిజి నిర్మించినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. ఒకానొకప్పుడు ఈ క్షేత్రంలో 21 మంది సిద్ధపురుషులు జీవసమాధి పొందారట! అందుకే ఈ క్షేత్రానికి సిద్ధర్ క్షేత్రమని పేరు వచ్చింది.

**స్వయంభువుగా కొలువైన పరాశక్తి**

మేల్ మరువత్తూర్ సిద్ధర్ క్షేత్రంలో ఆది పరాశక్తి సహస్రదళ పద్మంపై కొలువుదీరి భక్తులను అనుగ్రహిస్తోంది. భక్తుల సకల మనోభీష్టాలు నెరవేర్చడంతో పాటు ఆత్మజ్ఞానాన్ని కూడా ప్రసాదించే ఈ తల్లి కులమత భేదాలకు అతీతంగా అందరినీ సమానంగా అనుగ్రహిస్తుంది. దుర్గ, పార్వతి, సరస్వతి, మహాలక్ష్మి రూపాల్లో జగన్మాత పూజలందుకుంటున్న ఈ క్షేత్రంలో ఆదిపరాశక్తి స్వయంభువుగా కొలువై ఉండడం విశేషం.

**ఆలయ స్థల పురాణం**

ప్రస్తుతం ఆలయం ఉన్న ప్రదేశంలో ఒకప్పుడు పెద్ద వేప చెట్టు ఉండేది. కొన్ని రోజులకు వేప చెట్టు నుంచి పాలు కారుతుండేవి. స్థానికులు కొంతమంది ఆ పాలను రుచి చూస్తే అవి తియ్యగా ఉన్నాయి. అంతేకాదు ఆ పాలు సేవించిన వారికి దీర్ఘకాలిక అనారోగ్యాలు సైతం నయమయ్యాయంట! ఈ విషయం చుట్టుపక్కల ప్రాంతాలకు కూడా వ్యాపించడంతో భక్తులు తండోపతండాలుగా రావడం మొదలు పెట్టారు. వచ్చిన భక్తులు ఈ వేపచెట్టు పాలను తీర్థంగా స్వీకరిస్తూ, వేపచెట్టును పూజించడం మొదలు పెట్టారు.

**తుఫానుకు కూలిన వేపచెట్టు**

కొంతకాలానికి ఒక భయంకరమైన తుఫాను వచ్చి ఈ భారీ వేప చెట్టు వేళ్లతో సహా పెకిలించు కుని రావడంతో ఆ చెట్టుకింద భూగర్భంలో ఉన్న అమ్మవారి విగ్రహం బయట పడిందట!

**బంగారు అడిగళార్**

ఆ సమయంలో ఆ ప్రాంతంలో లెక్కల టీచర్‌గా పనిచేస్తున్న బంగారు అడిగళార్ అనే వ్యక్తి దేవి రూపాన్ని ఆది పరాశక్తిగా గుర్తించి, ప్రతిష్ఠించి ఆరాధించి శాస్త్రోక్తంగా పీఠాన్ని స్థాపించి పూజలు ప్రారంభించారు. అప్పటి నుంచి భక్తులు దేవిని ఆరాధించడంతోపాటు బంగారు అడిగళార్‌ను 'బంగారు అమ్మ' అని పిలుస్తూ భక్తితో సేవించసాగారు.

**ఆలయ విశేషాలు**

మేల్ మరువత్తూర్ సిద్ధర్ క్షేత్రంలో వెలసిన ఆది పరాశక్తి ధ్యానానికి ప్రతీక. జగన్మాత జ్ఞానముద్రతో దర్శనమిచ్చే ఈ ఆలయ ప్రాంగణంలో నవగ్రహాల స్థానంలో సప్తకన్యలర్ పేరుతో పరాశక్తి పరివార దేవతలైన సప్తమాతృకల ఆలయం ఉంటుంది. ఇక్కడ ఆది పరాశక్తి స్వయంభువు అయినా, గణపతి స్థపతి తయారు చేసిన దేవి విగ్రహాన్ని కూడా భక్తులు దర్శించుకుంటారు.

**అందరికీ ఒకటే దర్శనం**

అమ్మవారి సమక్షంలో అందరూ సమానమే అని తెలపడానికి ఈ ఆలయంలో అందరికీ సర్వదర్శనమే ఉంటుంది. అలాగే కులమతాలతో సంబంధం లేకుండా ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు అమ్మవారిని పూజించుకోవచ్చు.

**నెలసరి సమయంలోనూ పూజించవచ్చు**

సాధారణంగా మహిళలు నెలసరి సమయంలో దేవతారాధనకు, పూజకు దూరంగా ఉండటం సాధారణం. కానీ ఈ ఆలయంలో మహిళలు అమ్మవారిని నెలసరి సమయంలో కూడా పూజించవచ్చు.

**పూజోత్సవాలు**

మేల్ మరువత్తూర్ సిద్ధర్ ఆది పరాశక్తి ఆలయంలో ప్రతిరోజూ అభిషేకం, అర్చనలు జరుగుతాయి. ప్రతి మంగళవారం, అమావాస్య, పౌర్ణమి తిథుల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయి.

**నిత్యాన్నదానం**

ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజూ నిత్యాన్నదానం జరుగుతుంది. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు ఇక్కడ అన్నప్రసాదాన్ని స్వీకరిస్తారు. అంతేకాదు ఈ దేవస్థానం ట్రస్టు తరఫున ఉచిత వైద్య సేవలు, విద్యా సేవలు నిర్వహిస్తున్నారు. మహిళలకు వృత్తి విద్యల్లో శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తున్నారు.

**ఇరుముడి దీక్ష**

స్త్రీ పురుష భేదం లేకుండా ఎరుపు వస్త్రాలు ధరించి, శక్తి మాల దీక్షాధారణతో సమర్పించే ఇరుముడి ఉత్సవం చూసి తీరాల్సిందే!

**ఎలా చేరుకోవాలి?**

చెన్నై నుంచి చెంగల్పట్టు మార్గంలో ఉండే ఈ ఆలయానికి చేరుకోవడానికి మేల్ మరువత్తూర్ రైల్వే నుంచి ప్రైవేటు వాహనాల్లో చేరుకోవచ్చు. దర్శించినంత మాత్రాన్నే అభీష్టాలు నెరవేర్చే మేల్ మరువత్తూర్ ఆది పరాశక్తి క్షేత్రాన్ని మనం కూడా దర్శించి తరిద్దాం.

**ఓం శ్రీ మాత్రే నమః**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. లేకపోవచ్చనే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# పూరీ జగన్నాథ రథయాత్ర దర్శనం మోక్షదాయకం- ఇంతటి పవిత్రత ఎందుకు వచ్చిందో తెలుసా?



ఆషాఢ మాసంలో శుక్లపక్షం విదియ రోజు జరిగే పూరీ జగన్నాథుని రథయాత్ర ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఈ సందర్భంగా జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలు తమ ప్రత్యేక రథాలపై ఊరేగింపుగా గుండిచా ఆలయానికి వెళ్తారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో, స్వామివారు తన జన్మస్థానాన్ని పోలిన గుండిచా ఆలయంలో విశ్రాంతి తీసుకుంటారు. పూరీ జగన్నాథ స్వామి రథయాత్ర కళ్లారా వీక్షించిన వారికి అన్ని తీర్థయాత్రలు చేసిన ఫలం లభిస్తుందని, పునర్జన్మ లేకుండా మోక్షం పొందుతారని విశ్వాసం. అసలు పూరీ జగన్నాథుని రథయాత్రకు ఇంతటి పవిత్రత ఎలా వచ్చిందో ఈ కథనంలో తెలుసుకుందాం.

**ఆధ్యాత్మిక సమైక్యత సూత్రం**

జగన్నాథుని రథయాత్ర భారతీయ ఆధ్యాత్మికతతో సమైక్యతా సూత్రానికి ప్రతీకగా నిలుస్తుంది. పూరీ క్షేత్రంలో జగన్నాథుని స్వామి ఆలయంలోని విగ్రహాలు రాతితో కాకుండా వేప చెక్కతో తయారు చేయబడి ఉంటాయి. ప్రతి సంవత్సరం పాత విగ్రహాల స్థానంలో నూతన విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. ఈ సందర్భంగా తొలగించిన పాత విగ్రహాలను జ్యోతిష్య, గ్రహగతులను అనుసరిస్తూ ఖననం చేస్తారు. పాత విగ్రహాలను తొలగించే సమయంలో ఆ విగ్రహాల నుంచి నాభి భాగాన్ని మాత్రం వేరు చేసి కొత్త విగ్రహాలకు అమరుస్తారు. ఈ విధంగా చేయడం వెనక ఒక పురాణ రహస్యం ఉంది. అదేమిటో చూద్దాం.

**పౌరాణిక గాథ**

ద్వాపర యుగాంతంలో కురుక్షేత్ర యుద్ధం ముగిసిన తర్వాత శ్రీకృష్ణుడు ద్వారకకు తిరిగి వెళ్లాడు. ఒకరోజు శ్రీకృష్ణుడు వనవిహారానికి వెళ్లి అక్కడ ఒక చెట్టు కొమ్మపై విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ సమయంలో శబర రాజు అనే బోయవాడు శ్రీకృష్ణుని కాలి బొటనవేలిని పక్షిగా భావించి బాణాన్ని సంధించి విడిచాడు. అప్పుడు అర్జునుడు ఆ శరాఘాతానికి శ్రీకృష్ణుడు తనువు చాలించాడు. అంతటి పరమాత్మ, అజాతశత్రువు అయిన శ్రీకృష్ణుడు ఒక సాధారణ బోయవాని బాణానికి ప్రాణాలు విడవడం అనేది నమ్మదగని విషయం అయినప్పటికీ మహాత్ములు తమ అవతారాన్ని ముగించడానికి వారంతట వారే ఇలాంటి ఘటనలు సృష్టించుకుంటారు.

**నాభిని అనుసరించిన శబర రాజు**

శ్రీకృష్ణుడు దేహత్యాగం చేసిన చేశాడన్న విషాద వార్త తెలుసుకున్న అర్జునుడు ద్వారకకు తరలి వస్తాడు. శ్రీకృష్ణునికి అంతిమసంస్కారాలు జరిపిస్తాడు. ఆ సమయంలో చితాగ్నిలో శ్రీకృష్ణుని దేహం మొత్తం దగ్ధమైనా, నాభి మాత్రం అలాగే ఉండిపోయింది. అప్పుడు అర్జునుడు ఆ నాభి భాగాన్ని సముద్రంలో నిక్షిప్తం చేశాడు.

**మహా ప్రళయం**

శ్రీకృష్ణుని నిర్యాణం తర్వాత మహా ప్రళయం ముంచుకు వచ్చి ద్వారకా నగరం మొత్తం సముద్రంలో మునిగిపోయింది. ఆ సమయంలో అర్జునుడు సముద్రంలో దాచి ఉంచిన శ్రీకృష్ణుని నాభి సముద్ర జలాలపై తేలుతూ ఉంటుంది. శ్రీకృష్ణుని మరణానికి కారణమైన శబరరాజు సముద్రంలో తేలియాడుతున్న శ్రీకృష్ణుని నాభి భాగాన్ని గమనించి దానిని అనుసరించసాగాడు. అలా శబర రాజు ద్వారకా నుంచి పూరీ వరకు శ్రీ కృష్ణుని నాభిని అనుసరించి కొనసాగాడు. శబర రాజు భక్తికి మెచ్చిన శ్రీకృష్ణుడు 'ఇక్కడ నుంచి నన్ను తీసుకువెళ్లు' అని ఆదేశించాడు. శబర రాజు దైవాజ్ఞను ఆచరించాడు. తదనంతర కాలంలో పూరీలో విష్ణుభక్తుడైన ఇంద్రద్యుమ్నుడు పూరీ క్షేత్రంలో ఆలయం నిర్మించాడన్నది పూరీ క్షేత్ర స్థలపురాణం ద్వారా తెలుస్తోంది.

**జన్మ సాఫల్యం**

పూరీ జగన్నాథుడు వామన రూపంలో రథంలో ఆసీనుడై ఉండగా జరిగే ఈ రథయాత్రను కనులారా చూసిన వారికి పునర్జన్మ ఉండదని ఆర్యోక్తి. ఈ విశ్వాసంతోనే ఒక్క మన దేశం నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు జగన్నాథుని రథయాత్ర వీక్షించడానికి క్షేత్రానికి తరలి వస్తారు.

**మోక్షదాయకం - రథయాత్ర దర్శనం**

పూరీ జగన్నాథుని రథయాత్రలో పాల్గొని, ఈ పవిత్ర రథయాత్రను దర్శించడం మరియు లాగడం వల్ల జన్మజన్మల పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. జులై 16, గురువారం పూరీలో జరగనున్న జగన్నాథుని రథయాత్రలో మనం కూడా పాల్గొని ఆ పరమాత్మ అనుగ్రహాన్ని పొందుదాం. జగన్నాథా!ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చనే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# వోక్స్‌వ్యాగన్ కొత్త లగ్జరీ కార్- ధర ఎంతో తెలుసా?




భారతీయ ప్రీమియం ఎస్‌యూవీ మార్కెట్లోకి వోక్స్‌వ్యాగన్ ఇండియా సరికొత్త మోడల్‌ను ప్రవేశపెట్టింది. కంపెనీ తన ఫ్లాగ్‌షిప్ మోడల్‌లో 'టైరాన్ లైఫ్' అనే కొత్త వేరియంట్‌ను అధికారికంగా విడుదల చేసింది. స్పోర్టీ లుక్ కంటే కూడా రోడ్డుపై మరింత సింప్లిసిటీ, ప్రాక్టికాలిటీని (సౌకర్యాన్ని) ఇష్టపడే కస్టమర్లను దృష్టిలో ఉంచుకుని ఈ వేరియంట్‌ను ప్రత్యేకంగా రూపొందించారు. అయితే టాప్ మోడల్ ఆర్-లైన్ (ఆర్-లైన్) 7-సీటర్‌గా వస్తుండగా, ఈ కొత్త టైరాన్ లైఫ్ వేరియంట్ మాత్రం 5-సీటర్ ఆప్షన్‌తో మాత్రమే లభిస్తుంది. ధర ఎంతంటే?: కంపెనీ దీని ధరను రూ. 41.99 లక్షల (ఎక్స్-షోరూమ్)గా నిర్ణయించింది. ఇది టాప్-ఎండ్ మోడల్ అయిన 'ఆర్-లైన్' (ఆర్-లైన్) వేరియంట్ కంటే ఏకంగా రూ. 5 లక్షలు తక్కువ. ధర పరంగా తక్కువగా ఉన్నప్పటికీ, ఈ లైఫ్ వేరియంట్ కూడా టాప్ ఎండ్ 'ఆర్-లైన్' మోడల్ మాదిరిగానే పటిష్టమైన బిల్ట్ క్వాలిటీ, ప్రీమియం ఫీచర్లు, పవర్‌ఫుల్ ఎస్‌యూవీ ఎలివేషన్‌ను అందిస్తుంది. ఛత్రపతి శంభాజీనగర్‌లో తయారీ: వోక్స్‌వ్యాగన్, మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్‌లో ఉన్న తన ప్లాంట్‌లో టైరాన్ కారును తయారు చేస్తోంది. ఎక్స్‌టీరియర్ డిజైన్: టైరాన్ లైఫ్ మోడల్‌లో వోక్స్‌వ్యాగన్ తన సరికొత్త డిజైన్ లాంగ్వేజ్‌ను ఉపయోగించింది. ఇది స్పోర్టీ లుక్‌తో ఉండే 'ఆర్-లైన్' కంటే చాలా క్లాసిక్, సింపుల్ అండ్ హుందాగా ఉంటుంది. ఫ్రంట్ లుక్: కారు ముందు భాగంలో స్లీక్ ఎల్‌ఈడీ హెడ్‌లైట్స్ ఉన్నాయి. ఇవి కారు వెడల్పు పొడవునా సాగే పూర్తి స్థాయి ఎల్‌ఈడీ లైట్ బార్‌తో కనెక్ట్ అయి ఉంటాయి. ఈ లైట్ బార్ మధ్యలో ఉండే ఇల్యూమినేటెడ్ 'లోగో' కారుకు మరింత ప్రీమియం లుక్‌ను ఇస్తుంది. బోల్డ్ బంపర్: బంపర్‌లో అడ్డంగా ఉండే స్లాట్లతో కూడిన వెడల్పాటి ఎయిర్ డ్యామ్ ఉంది. ఇది ఈ ఎస్‌యూవీకి ఒకే సమయంలో పవర్‌ఫుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌ను తెస్తుంది. సైడ్ ప్రొఫైల్: సైడ్ నుంచి చూసినప్పుడు ఈ రెగ్యులర్ టైరాన్ పొడవుగా, నిటారుగా ఉండే ఎస్‌యూవీ సిల్హౌట్‌తో కనిపిస్తుంది. దీనికి స్పష్టమైన షోల్డర్ లైన్స్, స్క్వేర్ వీల్ ఆర్చెస్, రూఫ్ రైల్స్, సూక్ష్మమైన బాడీ క్లాడింగ్ ఉన్నాయి. ఈ డిజైన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి కారుకి మరింత దృఢమైన, ఆకర్షణీయమైన రూపాన్ని ఇస్తాయి. ఇంటీరియర్ & ఫీచర్లు: దీని క్యాబిన్ 'టైరాన్ లైఫ్ ఆర్-లైన్') మాదిరిగానే ఉంటుంది. అయితే ఇందులో 'ఆర్' (ఆర్) బ్రాండింగ్‌కి సంబంధించిన కొన్ని ప్రత్యేక బ్యాడ్జ్‌లు, స్పోర్టీ ఎలిమెంట్స్ మాత్రం కనిపించవు. ఈ వాహనంలో 15-అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, 10.25-అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, పనోరమిక్ సన్‌రూఫ్, త్రీ-జోన్ క్లైమేట్ కంట్రోల్, పవర్డ్ & వెంటిలేటెడ్ ఫ్రంట్ సీట్లు, 360-డిగ్రీ కెమెరా, 9 ఎయిర్‌బ్యాగ్‌లు, లెవల్ 2 వంటి అనేక ఫీచర్లను అందించారు.

# ఇంగ్లాండ్‌ను మట్టికరిపించిన అర్జెంటీనా




ఫిఫా ప్రపంచకప్ 2026 సెమీఫైనల్‌లో అర్జెంటీనా అద్భుతం చేసింది. ఓటమి అంచుల్లో నిలిచిన దశ నుంచి ఊహించని రీతిలో పుంజుకుని, చివరి ఏడు నిమిషాల్లో రెండు గోల్స్ కొట్టి ఇంగ్లాండ్‌పై 2-1 తేడాతో చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో అర్జెంటీనా బ్లాక్‌బస్టర్ విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లగా.. సుదీర్ఘకాలం తర్వాత వరల్డ్ కప్ ఫైనల్ చేరాలనే ఇంగ్లాండ్ కల మరోసారి చెదిరిపోయింది. ఫైనల్లో అర్జెంటీనా, స్పెయిన్ తలపడనున్నాయి. మ్యాచ్ తొలి సగభాగంలో ఇరు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. మొదటి హాఫ్‌లోనే ఏకంగా 19 ఫౌల్స్ నమోదయ్యాయంటే మ్యాచ్ ఎంత ఉత్కంఠగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, మ్యాచ్ 55వ నిమిషంలో ఇంగ్లాండ్ ఆటగాడు ఆంథోనీ గోర్డాన్ అద్భుత గోల్‌తో జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. మోర్గాన్ రోజర్స్ కుడి వైపు నుండి అందించిన సూపర్ క్రాస్‌ను గోర్డాన్ గోల్‌గా మలిచాడు. ఆ తర్వాత ఇంగ్లాండ్ పూర్తి నియంత్రణలో ఉన్నట్లు కనిపించింది. అర్జెంటీనా దాడులను ఇంగ్లాండ్ గోల్‌కీపర్ జోర్డాన్ పిక్‌ఫోర్డ్ అద్భుతమైన సేవ్‌లతో అడ్డుకున్నాడు. మ్యాచ్ ముగియడానికి కేవలం ఐదు నిమిషాల సమయం మాత్రమే ఉన్న దశలో అర్జెంటీనా ఆట స్వరూపాన్నే మార్చేసింది. 85వ నిమిషంలో ఎంజో ఫెర్నాండెజ్ డి బాక్స్ వెలుపల నుండి కొట్టిన సంచలన లాంగ్-రేంజ్ షాట్ నేరుగా గోల్ పోస్ట్‌లోకి దూసుకెళ్లి స్కోరును 1-1తో సమం చేసింది. దీంతో ఇంగ్లాండ్ ఒక్కసారిగా ఒత్తిడిలో పడిపోయింది.

ఇక 92వ నిమిషంలో (ఇంజ్యూరీ టైమ్) లియోనెల్ మెస్సీ తన మేధావితనాన్ని ప్రదర్శించాడు. మెస్సీ అందించిన క్లాసిక్ క్రాస్‌ను సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ లౌటారో మార్టినెజ్ హెడర్ ద్వారా గోల్‌గా మలిచి అర్జెంటీనాకు 2-1తో తిరుగులేని ఆధిక్యాన్ని అందించాడు. ఈ గోల్‌తో అర్జెంటీనా ఆటగాళ్లు, అభిమానులు సంబరాల్లో మునిగిపోగా.. ఇంగ్లాండ్ ఆటగాళ్లు దిగ్భ్రాంతికి గురయ్యారు. అంతటా గట్టి మార్కింగ్‌లో ఉన్నప్పటికీ, కెప్టెన్ మెస్సీ రెండు అసిస్ట్‌లతో (గోల్స్ చేయడంలో సహకారం) అర్జెంటీనాను ఒంటిచేత్తో ఫైనల్‌కు నడిపించాడు. మరో సెమీఫైనల్‌లో ఫ్రాన్స్‌ను 2-0తో ఓడించిన స్పెయిన్‌తో ఆదివారం జరిగే ఫైనల్‌లో అర్జెంటీనా తలపడనుంది. ఈ గెలుపుతో అర్జెంటీనా తన ప్రపంచ కప్ టైటిల్‌ను నిలబెట్టుకోవడానికి కేవలం ఒకే ఒక్క విజయం దూరంలో నిలిచింది. మరోవైపు, ఇంగ్లాండ్‌కు 1966 తర్వాత మరోసారి వరల్డ్ కప్ ఫైనల్ చేరే అవకాశం తృటిలో చేజారిపోయింది.

# నీలో గొప్ప ట్యాలెంట్ ఉంది



## • గుర్నూర్ బ్రార్ పై ఫ్యాన్స్ కామెంట్స్

ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా ఎట్టకేలకు విజయాన్ని అందుకుంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో చిత్తు చిత్తుగా ఓడిన భారత జట్టు.. తొలి వన్డేలో మాత్రం ఘనవిజయాన్ని అందుకుంది. సీనియర్లు రావడంతో జట్టు బలంగా తయారైంది. మొదట బౌలర్లు ప్రతాపం చూపిస్తే.. ఆ తర్వాత బ్యాటర్లు రెచ్చిపోయారు. ఫలితంగా భారత జట్టు 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు విఫలం అయ్యారు. కోహ్లీ కేవలం 5 పరుగులు చేసి అవుటైతే.. రోహిత్ శర్మ 11 పరుగులు మాత్రమే చేశాడు. అయితే గిల్ (80 రిటైర్డ్ హర్ట్) జట్టుకు విజయాన్ని ఖాయం చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవడానికి ముఖ్య కారణం బౌలర్లు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆరంభంలో మంచి ప్రదర్శన చేసింది. ముఖ్యంగా బెన్ డకెట్ (43) అద్భుతంగా ఆడాడు. తొలి వికెట్‌కు బెతెల్ (14)తో కలిసి 61 పరుగులు జోడించారు. ఈ దశలో ఇంగ్లండ్ 300కు పైగా పరుగులు చేస్తుందని అంతా అనుకున్నారు. అయితే ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. కొత్త బౌలర్ గుర్నూర్ బ్రార్ టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. బంతిని అందుకున్న అతడు 3 బంతుల వ్యవధిలో 2 వికెట్లు తీశాడు. 13వ ఓవర్ వేసిన బ్రార్.. మొదట జాకబ్ బెతెల్‌ను అవుట్ చేశాడు. అనంతరం డేంజరస్ ప్లేయర్ బెన్ డకెట్‌ను అవుట్ చేశాడు. దాంతో ఇంగ్లండ్ 2 పరుగుల తేడాతో రెండు వికెట్లను కోల్పోయింది. ఇక ఇక్కడి నుంచి భారత జట్టు పుంజుకుంది. ఆ వెంటనే మరో డేంజరస్ ప్లేయర్ హ్యారీ బ్రూక్‌ను బుమ్రా అవుట్ చేశాడు. అంతే ఇంగ్లండ్ వెంటవెంటనే 3 వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఇంగ్లండ్ క్రమం తప్పకుండా వికట్లను కోల్పోయింది. ఒక దశలో 61 పరుగులకు వికెట్ లేకుండా ఉన్న ఇంగ్లండ్.. 46 పరుగుల తేడాతో 6 వికెట్లను కోల్పోయింది. గుర్నూర్ బ్రార్ 9 ఓవర్లలో 2 వికెట్లు తీశాడు. అయితే మ్యాచ్ మధ్యలో కాస్త అతి కూడా చేశాడు. బెన్ డకెట్ నేరుగా కొట్టిన షాట్‌ను అడ్డుకున్న బ్రార్.. బంతిని డకెట్ వైపు విసిరాడు. ఆ తర్వాత బంతిని డకెట్ సిక్సర్ బాదాడు. సోషల్ మీడియాలో.. ఇలాంటి అతి పనులు చేయకు బ్రార్.. నీలో గొప్ప ట్యాలెంట్ ఉందంటూ ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు.

# వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌కు ముందు సూపర్-7

**టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8కు బదులు సూపర్-10**

**వన్డే, టి20 ప్రపంచకప్‌లలో కీలక మార్పులు**

**వచ్చే ఏడాది వన్డే ప్రపంచకప్ నుంచి అమలు**

రాబోయే ఐసీసీ టోర్నీల ఫార్మాట్లలో కీలక మార్పులు చూడబోతున్నాం. 2027 వన్డే ప్రపంచకప్‌లో సెమీస్‌కు ముందు సూపర్-7 దశ జరగనుంది. 2028 టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8కు బదులు సూపర్-10 నిర్వహించనున్నారు. టోర్నీలపై ఆసక్తిని జట్ల మధ్య పోటీని పెంచేందుకు ఈ నిర్ణయాలు తీసుకుంటున్నామని ఐసీసీ తెలిపింది. 2023 వన్డే ప్రపంచకప్‌లో 10 జట్లు పోటీపడగా.. వచ్చే ఏడాది 14 జట్లు తలపడనున్నాయి. 10 జట్లు నేరుగా టోర్నీకి అర్హత సాధిస్తాయి. క్వాలిఫయర్స్ ద్వారా మరో నాలుగు జట్లు ఎంపికవుతాయి. 11వ స్థానంతో ప్రపంచకప్‌నకు వచ్చే జట్టు.. నేరుగా గ్రూప్ దశలో తలపడుతుంది. 12, 13, 14వ స్థానాలతో టోర్నీకి అర్హత సాధించిన జట్లు గ్రూప్ దశకు ముందు 'సూపర్ సిరీస్' రౌండ్ ఆడతాయి. ఇందులో అగ్రస్థానం దక్కించుకున్న టీమ్ గ్రూప్ దశకు అర్హత సాధిస్తుంది. గ్రూప్ దశలో 12 జట్లు రెండు గ్రూప్‌లుగా విడిపోతాయి. ప్రతి గ్రూప్ నుంచి 3 జట్లు, మొత్తంగా నాలుగో ఉత్తమ టీమ్ సూపర్-7 దశకు చేరుకుంటాయి. అక్కడ రౌండ్ రాబిన్ పద్ధతిలో తలపడి టాప్-4లో నిలిచిన జట్లు సెమీస్‌కు చేరుకుంటాయి. సంయుక్త ఆతిథ్య దేశాలుగా దక్షిణాఫ్రికా, జింబాబ్వే నేరుగా ప్రపంచకప్‌నకు అర్హత పొందుతాయి. నమీబియా అసోసియేట్ దేశం కావడంతో అర్హత టోర్నీ ఆడాల్సివుంటుంది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే కాకుండా ఐసీసీ ర్యాంకింగ్స్‌లో 8 ఉత్తమ జట్లు టోర్నీకి అర్హత పొందుతాయి. టీ20 ప్రపంచకప్‌లో సూపర్-8 విధానానికి బదులు సూపర్-10ను ప్రవేశపెట్టింది ఐసీసీ. మొదట 20 జట్లను అయిదు గ్రూపులుగా విభజిస్తారు. ప్రతి గ్రూప్ నుంచి రెండు టీమ్‌లు సూపర్-10 దశకు చేరుకుంటాయి. ఇక్కడ అయిదేసి జట్లు రెండు గ్రూపులుగా విడిపోతాయి. ప్రతి గ్రూప్ నుంచి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు నేరుగా సెమీస్‌కు చేరుతాయి. మిగతా రెండు బెర్తుల కోసం 2వ స్థానంలో ఉన్న జట్లు ప్రత్యర్థి గ్రూప్‌లోని మూడో స్థానంలో ఉన్న టీమ్‌లను ఢీకొంటాయి. ఇందులో గెలిచిన జట్లు సెమీస్ చేరుకుంటాయి. 2028లో జరిగే టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగనుంది.




# మైదానంలో తీవ్ర ఉద్రిక్తత

## • అర్జెంటీనా ప్లేయర్ తలపై కొట్టిన ఇంగ్లాండ్ స్టార్

ఫిఫా వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్ మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో ఊహించని షాకింగ్ డ్రామా నడిచింది. అర్జెంటీనా చేతిలో 2-1 తేడాతో ఇంగ్లాండ్ ఘోర పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే, రెఫరీ ఫైనల్ విజిల్ వేసిన వెంటనే, మ్యాచ్‌ను గెలిచిన ఆనందంలో అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా, ఇంగ్లాండ్ స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఓటమి భారంతో కోపంతో ఊగిపోయిన బెల్లింగ్‌హామ్, ఒక అర్జెంటీనా ఆటగాడి వద్దకు వెళ్లి అతడి తలపై కొట్టాడు. దీంతో మైదానంలో ఒక్కసారిగా ఉత్కంఠ, ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిజానికి మ్యాచ్ చివరి నిమిషం వరకు ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య తీవ్రమైన పోటీ నడిచింది. చివరి నిమిషాల్లో కమ్ బ్యాక్ ఇచ్చిన అర్జెంటీనా.. వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. దీంతో ఇంగ్లాండ్ ఆటగాళ్లు తీవ్ర ఒత్తిడి, నిరాశకు గురయ్యారు. మ్యాచ్ ముగిశాక అర్జెంటీనా ఆటగాళ్ల సంబరాలు స్లెడ్జింగ్ బెల్లింగ్‌హామ్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించినట్లు తెలుస్తోంది. దీంతో సహనం కోల్పోయిన జూడ్.. అర్జెంటీనా ఆటగాడు బార్కో తలపై కొట్టాడు. బార్కో ఏదో అన్న తర్వాతే జూడ్.. కొట్టినట్లు తెలుస్తోంది. ఇది జరిగిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లు వెంటనే బెల్లింగ్‌హామ్‌ను చుట్టుముట్టారు. దాంతో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య పెద్ద ఎత్తున తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. మైదానంలో వాతావరణం మరింత వేడెక్కడంతో వెంటనే మిగతా ఆటగాళ్లు.. కగలజేసుకుని, ఇద్దరికీ సర్ది చెప్పారు. ఇక ఇదే మ్యాచులో మెస్సీతోనూ ఓ దశలో ఇంగ్లాండ్ స్టార్ బెల్లింగ్‌హామ్ వాగ్వాదానికి దిగాడు. క్రికెట్‌లో భారత్, పాక్ మ్యాచ్ అంటే ఎంత క్రేజ్ ఉంటుందో.. ఫిఫా ప్రపంచకప్‌లోనూ అర్జెంటీనా, ఇంగ్లాండ్ మ్యాచ్‌కు అంతే క్రేజ్ ఉంది. ఫాక్ లాండ్ దీవుల కోసం 1982లో ఈ రెండు దేశాల మధ్య సుమారు 74 రోజుల పాటు ఘర్షణ జరిగింది. ఇంగ్లాండ్ పైచేయి సాధించడంతో.. అర్జెంటీనా సంధి కుదుర్చుకుంది. ఈ ఘర్షణల్లో ఇరు దేశాలకు చెందిన సుమారు 900 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఇది గుర్తుపెట్టుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు మ్యాచ్ తర్వాత 'ఫాక్ లాండ్స్ అర్జెంటీనాదే' అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శించడం గమనార్హం. దీంతో ఈ విషయంపై ఇప్పటికీ రెండు దేశాల మధ్య వైరం కొనసాగుతోందని స్పష్టమైంది.




# ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో మెస్సీ సరికొత్త రికార్డులు



హైదరాబాద్ : అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఫిఫా ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో 10 గోల్స్‌కు అసిస్ట్‌లు నమోదుచేసిన తొలి ఆటగాడిగా రికార్డు నెలకొల్పారు. దీంతో అతని మొత్తం అసిస్ట్‌ల సంఖ్య 12కు చేరింది. ఇంగ్లాండ్‌పై అర్జెంటీనా సాధించిన ఫిఫా ప్రపంచకప్ 2026 సెమీఫైనల్ విజయంలో రెండు అసిస్ట్‌లు అందించడంతో మెస్సీ ఈ మైలురాయిని చేరుకొన్నాడు. 1966 నుంచి ప్రపంచకప్ చరిత్రలో మరే ఇతర ఆటగాడు 8 కంటే ఎక్కువ అసిస్ట్‌లు చేయలేదు.

# నా ఫోటోలు తీయకండి ప్లీజ్: మౌనీరాయ్



బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై అసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్టును డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.

--------------

# ప్రభాస్ ఫౌజీ డిసెంబర్ 3న

## రిలీజ్ డేట్‌తో పాటు పోస్టర్ విడుదల




ప్రభాస్ హీరోగా వస్తోన్న ఫౌజీ రిలీజ్ డేట్ ఫిక్స్ అయ్యింది. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఫౌజీ' సినిమా కోసం ప్రభాస్ అభిమానులతో పాటు సినీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా టీమ్ వారికి అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ చిత్ర విడుదల తేదీ ప్రకటించింది. డిసెంబర్ 3న 'ఫౌజీ' విడుదల కానున్నట్లు తెలుపుతూ ఓ కొత్త పోస్టర్ పంచుకుంది. 'అజ్ఞాతపర్వం ముగిసింది.. ఇక తిరుగుబాటు మొదలైంది..' అంటూ పంచుకున్న ఆ పోస్టర్‌లో '1932 నుంచి మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్నాడు' అని రాసి ఉన్న స్టాంప్ ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రభాస్ మునుపెన్నడూ చూడని లుక్‌లో కన్పించాడు. యుద్ధంలో ఒంటి నిండా రక్తంతో, తుపాకీపై చేయి పెట్టి కూర్చొని ఉన్న పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచేలా ఉంది. ప్రభాస్‌కు జోడీగా ఇమాన్వి నటిస్తోంది. మిథున్ చక్రవర్తి, అనుపమ్ ఖేర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం దీని షూటింగ్ చివరి దశలో ఉంది. 75 శాతం షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రంలో మరో మూడు యాక్షన్ ఘట్టాలతో పాటు కొన్ని కీలక సన్నివేశాలు తెరకెక్కించాల్సి ఉంది. ఇక ఈ సినిమా నుంచి త్వరలోనే ఓ లిరికల్ సాంగ్‌ను కూడా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. 'సీతారామం' తర్వాత ఫౌజీ కథను రాయడానికే సుమారు ఏడాదికి పైగా సమయం పట్టిందని గతంలో హను రాఘవపూడి తెలిపారు. ప్రేక్షకులు తప్పకుండా సర్‌ప్రైజ్ ఫీలవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# మహాప్రభు జగన్నాథ్ విడుదలపై స్టే

## నేడు విచారించనున్న సుప్రీం కోర్టు





ఎ లీ యానిమేషన్స్ సంస్థ నిర్మించిన మహాప్రభు జగన్నాథ్ చిత్రాన్ని శుక్రవారం రిలీజ్ చేయాల్సి ఉన్నది. కానీ ఆ ఫిల్మ్ రిలీజ్‌పై ఒడిశా హైకోర్టు స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ఇవాళ వెల్లడించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, వీ మోహనాతో కూడిన ధర్మాసనం ఈ కేసులో అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. తక్షణమే ఈ పిటీషన్‌పై విచారణ చేపట్టాలని సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ కోరారు. యానిమేషన్ ఫిల్మ్‌లో జగన్నాథుడి పాత్రను చిత్రీకరించిన విధానంపై న్యాయ సమీక్ష చేయాల్సిన అవసరం ఉందని ఒడిశా హైకోర్టు తన తీర్పులో చెప్పింది. మహేశ్ కుమార్ సాహూ దాఖలు చేసిన పిల్‌పై హైకోర్టు తాత్కాలిక ఆదేశాలు ఇస్తూ సినిమా రిలీజ్‌పై స్టే విధించింది. పిల్ దాఖలు చేసిన వారిలో పూరి ఆచార్య డాక్టర్ ప్రమోద్ కుమార్, ఉమాశంకర్ ఆచార్య కూడా ఉన్నారు. ఒడిశాలో చిత్ర ప్రదర్శన ఆపేయాలని, ఆ సినిమాకు సీబీఎఫ్‌సీ ఇచ్చిన సర్టిఫికేట్‌ను రద్దు చేయాలని కోరుతూ ఒడిశా కోర్టులో పిటీషన్ వేశారు. చిత్రంలో జగన్నాథుడి బాల్యం, డైలాగ్‌లు, సాహసాలు, యుద్ధ సన్నివేశాలు చూపించిన తీరును తప్పుపట్టారు. ఆ సన్నివేశాలన్నీ స్కంద పురాణం, బ్రహ్మ పురాణం, సనాతన ఆలయ సంప్రదాయాలకు వ్యతిరేకంగా ఉన్నట్లు పిటీషన్‌లో అభ్యంతరాలు తెలిపారు.

# నన్ను ధైర్యంగా నిలబెట్టింది నా భార్యనే : అఖిల్

మూడేళ్లుగా ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నానని.. తన భార్య జైనబ్ వెన్నంటే ఉండి ధైర్యాన్ని ఇచ్చిందన్నారు నటుడు అఖిల్. ఆయన ప్రధానపాత్రలో నటించిన 'లెనిన్' ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గుంటూరులో సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రబృందానికి కృతజ్ఞతలు చెప్పిన అఖిల్ తన కుటుంబం గురించి మాట్లాడారు. నేను జైనబ్‌ను ఇంట్లో బంగారు తల్లి అని పిలుస్తాను. మూడేళ్లుగా నేను బాధలో ఉన్నప్పుడు నా పక్కనే ఉంటూ నన్ను ఎంతో సపోర్ట్ చేసింది. నాకు గైడ్‌లా ఉంటూ ధైర్యాన్నిచ్చింది. ఇక, లెనిన్ విడుదలైన అనంతరం జరిగిన ఈవెంట్‌లో నేను నాన్నను హగ్ చేసుకున్నాను. అందులోనే నేను పదేళ్లుగా దాచుకున్న ఎమోషన్స్ అన్నీ బయటకు వచ్చాయి. ఇన్నేళ్లలో నాన్న నన్ను ఒక్కసారి కూడా తిట్టలేదు. నిరుత్సాహపర్చలేదు. నాకు సర్వస్వం ఆయనే. ఒక స్నేహితుడిలా ఈ జర్నీలో తోడుగా ఉన్నాడు. 'లెనిన్'ను తన భుజాలపై మోశాడు. అక్కినేని అభిమానులకు మంచి సినిమాను అందించాలనే తపనతో వర్క్ చేశాడు' అని అఖిల్ చెప్పారు. ఇక అభిమానుల గురించి మాట్లాడుతూ.. 'ఎన్నో జన్మల పుణ్యం చేస్తే ఇలాంటి అభిమానులు దొరుకుతారు. ఫ్యాన్స్ కోసం అయినా హిట్ కొట్టాలని మా ఆవిడతో ఎప్పుడూ చెప్పేవాడిని. నన్ను నమ్మిన ప్రేక్షక దేవుళ్లందరికీ ఒక్కటే మాట చెబుతున్నాను. నేనేం కాలర్ ఎగరేయను.. విజయం సాధించాం అని గర్వపడను. ఇప్పటి నుంచి నా కొత్త ప్రయాణం మొదలవుతోంది. నేను చేయాలనుకుంటున్న యుద్ధాన్ని ప్రశాంతంగా చేస్తానని అన్నారు.

----------



# డబ్బుల కోసమే సినిమాల్లోకి వచ్చా..

## ఒకప్పుడు కూలీ పని కూడా చేశా: విజయ్ సేతుపతి

సినిమా పరిశ్రమలో ఎలాంటి గాడ్‌ఫాదర్ లేకుండా, కేవలం తన అద్భుత నటనతో 'మక్కల్ సెల్వన్' (ప్రజల నటుడు)గా ఎదిగిన విజయ్ సేతుపతి.. తమిళ, తెలుగు ప్రేక్షకులలో సంపాదించుకున్న గుర్తింపు ప్రత్యేకమైనది. ఇటీవల జరిగిన ఒక ఇంటర్వ్యూలో ఆయన తన చిన్ననాటి కష్టాలు, కుటుంబ ఆర్థిక ఇబ్బందుల గురించి పంచుకున్న విషయాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి."చిన్నప్పుడు మా కుటుంబం తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేది. మా నాన్న మా కోసమే చాలా అప్పులు చేశారు. అవి తీర్చలేక సతమతమయ్యేవాళ్లం. కొన్నిసార్లు అప్పులవాళ్లు మా ఇంటిపైకి గొడవకు వచ్చేవారు. ఆ సమయంలో మా నాన్న ఒంటరిగా బాధపడకూడదని నేను ఎప్పుడూ ఆయన పక్కనే కూర్చునేవాడిని" అని సేతుపతి గుర్తుచేసుకున్నారు. ఎన్ని కష్టాలున్నా ప్రతిరోజు రాత్రి 9.30 గంటలకు నాన్న బుల్లెట్ బండిపై వస్తూ ఫ్రైడ్ రైస్ తెచ్చేవారని, కుటుంబమంతా కలిసి దాన్ని పంచుకుని తినే ఆ క్షణాలు తన జీవితంలో మర్చిపోలేని మధుర జ్ఞాపకాలని చెప్పారు. నటుడు అవ్వాలనేది విజయ్ సేతుపతి లక్ష్యం కాదట. కేవలం కుటుంబ బాధ్యతలు, డబ్బుల కోసమే ఆయన రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టారు. సినిమాల్లోకి రాకముందు ఆయన స్కూల్ రోజుల్లో కూలీ పనికి వెళ్లారు. ఆ తర్వాత రిటైల్ స్టోర్‌లో సేల్స్‌మ్యాన్‌గా, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో క్యాషియర్‌గా, ఫోన్ బూత్ ఆపరేటర్‌గా పనిచేశారు. ఆ తర్వాత దుబాయ్ వెళ్ళి అక్కడ అకౌంటెంట్‌గానూ ఉద్యోగం చేశారు. దుబాయ్ నుంచి ఇండియాకు తిరిగి వచ్చిన తర్వాత నాటక రంగానికి చెందినవారితో ఏర్పడిన పరిచయమే విజయ్ సేతుపతి జీవితాన్ని మలుపు తిప్పింది. మొదట్లో సినిమాల్లో చిన్న చిన్న క్యారెక్టర్లు చేస్తూ.. 'తెన్మేర్కు పరువకాట్రు' చిత్రంతో హీరోగా మారారు. ఆ తర్వాత 'సూదు కవ్వమ్', 'విక్రమ్ వేద', 'పిజ్జా', 'మహారాజా' వంటి విలక్షణమైన చిత్రాలతో స్టార్ హీరోగా నిలదొక్కుకున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా నటించిన 'ట్రైన్', 'స్లమ్ డాగ్' సినిమాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.



# కష్టాలు లేనిది ఎవరికి?

## : నటుడు 'శుభలేఖ' సుధాకర్



'శుభలేఖ' సుధాకర్ .. విభిన్నమైన పాత్రలకు కెరాఫ్ అడ్రెస్ గా కనిపిస్తారు. ఇటు సినిమాలలోను .. అటు సీరియల్స్ లోను ఎన్నో విలక్షణమైన పాత్రలను పోషించి మెప్పించినవారాయన. తాజాగా ' సుమన్ టీవీ'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అనేక విషయాలను గురించి ప్రస్తావించారు. "మొదటి నుంచి కూడా నటన అంటే చాలా ఇష్టంగా ఉండేది. అదే నన్ను సినిమాల వైపుకు నడిపించింది. 'శివ' సినిమా తరువాత చాలా గ్యాప్ వచ్చింది. ఆ సమయంలో నేను చాలా ఇబ్బందిపడ్డాను. ఏం చేయాలో .. ఎటు వెళ్లాలో తెలియని పరిస్థితి అది" అని అన్నారు."జీవితంలో కష్టాలు లేనివారంటూ ఎవరూ ఉండరు. ఎవరికి ఉండవలసిన కష్టాలు వారికి ఉంటూనే ఉంటాయి. అలా ఎన్నో కష్టాలను ఎదుర్కొని నిలబడ్డాను. అందువలన నాకు ఆకలి బాధ తెలుసు. ఎవరైనా ఆకలి అంటే.. సాయం చేయకుండా ఉండలేను. అలా ఎంతోమందికి సాయం చేసినవాడిని నేను. అయితే కొంతమంది దానిని అవకాశంగా తీసుకుంటున్నారని గ్రహించిన తరువాత, అవసరం ఏమిటనేది తెలుసుకున్న తరువాతనే సాయం చేయడం మొదలుపెట్టాను" అని చెప్పారు. 'ఒకానొక సమయంలో సినిమాలలో పూర్తిగా అవకాశాలు తగ్గినప్పుడు టీవీ సీరియల్స్ నాకు అన్నం పెట్టాయి. అందువలన నేను వాటితోనే బిజీ అయ్యాను. ఈ మధ్య కాలంలో మళ్లీ సినిమాలలో మంచి వేషాలు పడుతున్నాయి. అందుకు చాలా సంతోషంగా ఉంది. టీవీ .. సినిమా అనే వాటిని నేను వేరుగా చూడను. నటుడిగా ముందుకు వెళుతున్నానా లేదా అనేది మాత్రమే చూస్తాను. నేను భగవంతుడిని బలంగా నమ్ముతాను. మన ప్రయత్నం మంచిదైతే .. అందులో నిజాయితీ ఉంటే ఆయన సాయం తప్పకుండా అందుతుంది" అని అన్నారు.


Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com